ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

జనవరి 4, 2009

అగ్రరాజ్యంలో అభాగ్యులు

39277

హ్యాపీబర్త్‌డే

(2009 జనవరి-4 నుంచి 2009 జనవరి-10 వరకు)

పి. హేమలక్ష్మి
5సం॥, జనవరి-2004
కామేశ్వరి-మూర్తి
నర్సీపట్నం-విశాఖపట్నం

షేక్ సద్దాప్
5సం॥, జనవరి-5
ఖాదర్‌బి-సుభాని
చిట్టినగర్-విజయవాడ

ఆర్. నవ్యశ్రీ
5సం॥, జనవరి-7
వెంకటలక్ష్మి-చంద్రశేఖరరావు
బంజారాహిల్స్-హైదరాబాద్

యు. చంద్రిక
3సం॥, జనవరి-2006
అంబికాదేవి-నరేష్
సాయినగర్-విశాఖపట్నం

ఎ.మున్నా
2సం॥, జనవరి-2007
కావ్యశ్రీ-శ్రీధర్
కొరవి-వరంగల్

ఆర్. సుభాషిణి
జనవరి-4
శ్రీదేవి-గిప్సన్
గోనెగండ్ల-కర్నూలు

పి. శ్రీరామ్‌కుమార్
3సం॥, జనవరి-9
సాయిదుర్గ-శ్రీనివాస్
తణుకు

హారిక
జనవరి-9
లక్ష్మి-సాయిచరణ్
తాండ్ర-ఆదిలాబాద్

జి. నవీన
జనవరి-7
కవిత-శ్రీనివాస్
అమలాపురం-తూ॥గో॥

భరత్
1సం॥, జనవరి-7
బేబిరాణి-రంగారావు
ఖమ్మం

పి. గోపీచంద్
1సం॥, జనవరి-2008
ఉమ-ఉపేందర్‌రావు
ఏదులాపురం-ఖమ్మం

మనలో మాట

ఆశల పల్లకి



కొత్త సంవత్సరం వచ్చేసింది!

అంబరాన్నంటే సంబరాల మధ్య, అనంతకోటి ఆశలూ ఆకాంక్షల మధ్య ఘనంగా అరుదెంచింది. కాలం నిరంతర ప్రవాహం. మన ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా సాగిపోతూ ఉంటుంది. గతము కన్నా వచ్చు కాలమే మేలైనదని అనుభవజ్ఞులు అంటారు. ఆ మేలును ఎవరికి వారు అన్వయించుకొని ఆనందించడంవల్లే- నూతన సంవత్సరానికి ఇంత గిరాకీ, మనికింత చలాకీనూ. కొత్త సంవత్సరంపై ఎవరి ఆశలు వారికుంటాయి. దానికి రీజన్లూ ఉంటాయి.

* 'ఇందిరమ్మ ఇళ్లు ఇంకా పునాదిలోనే ఉన్నాయి. గుడిసెను పీక్కున్నవాళ్లు పందిరేసుకొని తల దాచుకుంటున్నారు. వానొచ్చినా, చలేసినా వారికి అభయ'హస్తం' కనిపిస్తుంటుంది. తవ్వి వదిలేసిన కాలువలను చూసినప్పడల్లా రైతులకు సాగునీరు గుర్తుకొస్తుంది. నిరుద్యోగులను ఉద్యోగం బస్సెక్కించేసి, నోటిఫికేషన్ల టికెట్టు కొట్టేశాం కాబట్టి- చచ్చినట్టు కాంగ్రెస్ డ్రైవరునే కలవరిస్తారు. ఏతావాతా ఎన్నికల్లో విజయం తథ్యం!'

- ఇదీ, వైఎస్ రాజశేఖరరెడ్డి కొత్త సంవత్సరం ఆశ.

* 'కాలవల్లో నీరు పారకపోయినా ఎన్నికల సంవత్సరంలో మద్యం ఏరులై ప్రవహిస్తుంది. జనం మునిగి తేలతారు. ఖజానాకు కోట్లు వచ్చి పడతాయి. ఇక బడ్జెట్టుకు భరోసా దొరికినట్టే!'

- ఇది ఆర్థికమంత్రి రోశయ్య ఆశ.

* 'కొత్త సంవత్సరం వచ్చిందే కొత్త రాజ్యం కోసం. సినిమాకొచ్చిన జనం టికెట్టు తీయకుండా ఉండరుకదా. అలాగే సభలకొచ్చిన జనమూ ఓటేసి తీరతారు. మా సినిమా హిట్టు కావడం ఖాయం.' - ఇది చిరంజీవి పెద్ద ఆశ.

* 'గత గుణపాఠంతో జన సంక్షేమం తెలిసొచ్చింది. కాంగ్రెస్ పథకాలన్నీ అవినీతి శతకాలు. నందమూరి తారలతో 'చిరు' తారలకు జవాబు. పైగా అరుణతారల అండ వుంది. నిజంగా ఇది మాకు విజయోత్సవ సంవత్సరం.'

- ఇది చంద్రబాబు ఆశ.

* 'ధరలు పెరిగాయి. నిత్యావసరాలు నింగికెగసాయి. ఆదాయం అడుగంటింది. చారెడు నేలడిగితే చావబాదారు. కొత్త సంవత్సరం వేళ... ఉన్న ఉపాధికీ ముప్పొచ్చి పడింది. నా అనుభవాలు నాకున్నాయి. నా నిర్ణయాలు నాకున్నాయి.'

ఇదీ, కింగ్ మేకర్ సామాన్యుడి మనోగతం.

ఎవరి ఆశలు వారివి. ఎవరి అనుభవాలు వారివి. కాలమే తీర్పరి.

కర్ర వంకరలన్నీ సరిచేసే నేర్పరి.

ఈ సంచికలో....

టపా	...	2
విజ్ఞాన వీచిక	...	4
కథ	...	6
బాలనేస్తాలు	...	12
రుచి	...	16
క్రైమ్ కథ	...	17
అట్టమీది కథ	...	18
మనసా తెలుసా	...	21
చూద్దామా	...	22
కవిత్వమ్	...	26
కొత్త పుస్తకాలు	...	28

ఇంకా...

అమ్మ...నాన్న...
ఓ అమెరికా అమ్మాయి
...3

మంచిపుస్తకం ... 8
మార్పులోనే నేర్పు



ఆరోగ్యం ... 10
చిన్న పిల్లల్లో వచ్చే
వ్యాధులు - నివారణ

సమ్‌థింగ్ ... 24
ఆ మెరుపుల వెనుక...



హృదయాన్ని కదిలించిన గొరిల్లాలు

చింపాంజీల తర్వాత మానవులకు అత్యంత దగ్గరగా ఉన్న గొరిల్లాలు భారీ స్థాయిలో అంతరించి పోవడానికి గల కారణాలను గురించి హృదయాన్ని కదిలించే విషయాలను ఈ వారం స్నేహ కవర్ స్టోరీ ద్వారా తెలుసుకున్నాం. రక్తం రుచి మరిగిన పులిలా మానవుడు సాగిస్తున్న హింసాత్మక చర్యలకు చింపాంజీలు, గొరిల్లాలు బలి అవుతుండడం బాధాకరం. తగ్గిపోతున్న గొరిల్లాలను కాపాడటానికిగాను 2009 సంవత్సరాన్ని గొరిల్లా సంవత్సరంగా ప్రకటించడం అభినందనీయం. కానీ అంతటితో సరిపెట్టక వాటిని వేటాడేవారిని తీవ్రంగా శిక్షించినట్టయితే మిగిలిన వారికి గుణపాఠం కాగలదు. వాటి మాంసం ఎగుమతి అయ్యే దేశాలలోని జీవ కారుణ్య సంస్థల వారు కూడా కృషి చేయాల్సిన అవసరం ఉంది. అలాగే మరుగుజ్జుల జీవితాల్లోని ఆటుపోట్లను గురించి సమ్‌థింగ్ స్పెషల్ శీర్షిక ద్వారా మరుగుజ్జుల గురించీ, గర్భాశయ క్యాన్సర్లను గురించిన ఎన్నో విషయాలను ఆరోగ్యం శీర్షిక ద్వారా తెలుసుకున్నాం. ఇంకా.. చూద్దామాలోని ఆస్ట్రేలియాలోని చూడదగ్గ ప్రదేశాలను తెలులసుకుని చాలా ఆనందపడ్డాం.

గొల్లమందల సురేష్ కుమార్,
సీతారాం పురం, ఖమ్మం.

మరుగుజ్జుల జీవితం చలింపచేసింది

గొరిల్లా చిత్ర విచిత్ర ముఖ చిత్రంతో వచ్చిన 21-12-08 నాటి స్నేహ సంచిక బావుంది. ఇందులో డా॥ కె. విజయ్ అందించిన 2009 గొరిల్లా సంవత్సరంలో గొరిల్లాల పుట్టుపూర్వోత్తరాలన్నీ చక్కగా విపులీకరించారు. క్రిస్‌మస్ కాంతులు మిరుమిట్లు గొలిపే వెలుగు జిలుగులతో చూడ చక్కగా మురిపింపజేశాయి. ఆరోగ్యంలో డా॥ మోహనవంశీ వివరించినట్టు కత్తిగాటు లేకుండా క్యాన్సర్ చికిత్స చేయటం సైన్స్ సాధించిన ఘన విజయంగా చెప్పవచ్చు. సమ్‌థింగ్ స్పెషల్‌లో మరుగుజ్జుల జీవితయాత్ర చలింపజేసింది. వీరిని ఇంకా వికలాంగుల జాబితాలో చేర్చకపోవడం శోచనీయం. ప్రభుత్వం వారికి చేసే తొలి సాయం వారికి వికలాంగుల కోటాలో సభ్యత్వాన్ని కల్పించటమే. విజ్ఞాన వీచికలో చెప్పినట్టు వ్యర్థాల బాధ అంతరిక్షంలో కూడా తప్పలేదని తెలుస్తోంది. మనలో మాట గీతాసారాంశానికి ఉదాహరణగా ఆ మూడు ఉదహరించటం సహేతుకమే కానీ, వరంగల్ పోలీసుల ఎన్‌కౌంటర్ జరుగకపోతే, ఆ ముగ్గురూ కోర్టులో ప్లేటు ఫిరాయించి పోలీసులే బలవంతంగా, హింసించి ఒప్పుకోమన్నారనే కొత్త మంత్రం జపించే ఛాన్సు లేకపోలేదు కదా.

-నేమాన సుభాష్ చంద్రబోస్.

గొరిల్లా కవర్ బాగుంది

2009 గొరిల్లా సంవత్సరం కవర్‌స్టోరీ ద్వారా చాలా విషయాలు తెలుసుకొన్నాం. 2009 గొరిల్లా సంవత్సరం కనుక వాటి పరిరక్షణకు ఐక్యరాజ్య సమితి చర్యలు చేపట్టవలసినదిగా కోరుతున్నాం. సమ్‌థింగ్ స్పెషల్‌లో మరుగుజ్జుల గురించి తెలియజేశారు. వారు నిరుత్సాహ పడకుండా జీవితాన్ని మెరుగు పరుచుకోవాలని కోరుకుంటున్నాం.

శ్రీరామచంద్రమూర్తి,
గాజువాక.

అలరించిన ఆస్ట్రేలియా అందాలు

ఈవారం స్నేహలో గీతా సారాంశం అంటూ గీతను గురించి ఉదాహరణలతో సహా సూపర్‌గా తెలియజేశారు. విజ్ఞాన వీచికలో 'వ్యర్థాల నిలయం అంతరిక్షం' అంటూ అంతరిక్షంలో చెత్త అనూహ్యమైన వేగంతో తిరుగుతోందని చెప్పారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు కాక వ్యర్థాలను గుర్తించిన శాస్త్రవేత్తలు వాటిని తొలగిస్తేనే రాబోయే తరాలకు మంచిదని ఆశిస్తున్నాను. చూద్దామాలో అందమైన దేశం ఆస్ట్రేలియా అంటూ ఆస్ట్రేలియా అందాలను వొలకబోస్తూ... వర్ణించిన తీరు బాగుంది. చదువుతుంటేనే ఆ ప్రదేశంలో తిరిగిన అనుభూతి కలిగింది. ప్రచురించిన హార్బర్ బ్రిడ్జ్ సూపర్‌గా ఉంది. అక్కడ పార్లమెంట్ భవనం భూమి కింద ఉందని, మొదటి ప్రపంచ యుద్ధం, రెండవ ప్రపంచ యుద్ధంలో వాడిన వస్తువులు, ఆయుధాలు మరెన్నో అక్కడ ప్రదర్శనలో ఉన్నాయని, ఎన్నో సంగతులు తెలియజేసినందుకు ధన్యవాదాలు. కత్తిగాటు లేకుండా క్యాన్సర్ చికిత్స చేయటానికి నేడు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని, జన్యు సంబంధ క్యాన్సర్లు, గర్భాశయ క్యాన్సర్ వాక్సిన్, లేజర్ చికిత్స ప్రత్యేకతలను తెలియజేసినందుకు ధ్యనవాదాలు. ఆరోగ్యంలో మా జీవితానికి నిండు సౌభాగ్యాన్ని కలిగించే శీర్షికలను, వ్యాసాలను ప్రచురిస్తున్న స్నేహకు నమస్సులు. 2009 గొరిల్లా సంవత్సరం అంటూ వాటికంత ప్రాముఖ్యత ఎందుకన్న అంశాలను చాలా చక్కగా వివరించారు.

గొరిల్లాల గొప్పదనాన్ని తెలియజేసినందుకు కాకర్లమూడి విజయ్‌గారికి వందనాలు.

కర్రా వరప్రసాద్, యలమర్రు.

'ప్లాస్టిక్ నవ్వు' బావుంది

'ప్లాస్టిక్ నవ్వు' కథ చాలా బావుంది. విజ్ఞానవీచిక శీర్షికలో వచ్చేవి నిజంగా విజ్ఞానాన్ని కలిగించేవిగా ఉంటున్నాయి. సమ్‌థింగ్ స్పెషల్‌లో కేరళ కుర్రాళ్ల గురించి, చూద్దామాలో ఆస్ట్రేలియాలో అందాలు, మనలో మాట, రుచి ఆసక్తిదాయకంగా ఉన్నాయి. వార్తా చానళ్లపై వచ్చిన కవర్ స్టోరీ వివరించిన తీరు మళ్లీ మళ్లీ చదివేలా చేసింది. ఇంకా ఎం. కోటేశ్వరరావు గారు అందించిన క్యాపిటల్ స్టోరీ విధానం చాలా బాగుంది. ఆరోగ్యంలో వచ్చే ఆర్టికల్స్ చదివి మాకు తెలిని విషయాలు చాలా తెలుసుకుంటున్నాం.

కలకొండ ప్రభాకర్, నల్గొండ.

వీరి వీరి గుమ్మడి పండు

వీరి పేరేమి?

ఈ ఫోటో
ఓ ప్రముఖ నటిది.
ఎవరో
తెలియాలంటే
11 వ పేజీ
చూడండి.



అమ్మా...నాన్నా...

ఓ అమెరికా అమ్మాయి

"అమ్మా...నాన్నా... బావున్నారా! ఇక్కడ నేను చాలా బావున్నాను. ఓ...నేనెవరో చెప్పలేదు కదూ. నేనమ్మా...మీ తొలి కలల పంటను. మీ ఇద్దరి అనురాగానికి నిలువెత్తు చిహ్నాన్ని, మీ పెద్ద కూతుర్ని. అన్నట్టు నా పేరు చెప్పలేదుకదూ. నాకు మీరు ప్రసాదించిన అమ్మ పెట్టిన పేరు చెప్పనా! మిండా కాక్స్. బావుందా అమ్మా. మీకు నేను ఒక ముఖ్యమైన విషయం చెప్పాలని ఎంతకాలంగానో వువ్విళ్లూరుతున్నాను. అది ఇప్పటికి ఇలా నెరవేరింది. ఈరోజుల్లో పాలరాతి బొమ్మల్లా పుట్టిన ఆడపిల్లలనే కనికరించకుండా చెత్తకుండీల్లోనో, మురుగు కాలువల్లోనే వేసేస్తున్నారు. మీరు నాపట్ల ఎంతో దయ చూపించారనుకుంటున్నాను. నేను వైకల్యంతో జన్మించినాగానీ మీరాపని చేయలేదు. పైగా చికిత్స కోసం నన్ను హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అందుకు నేను మీకు జీవితాంతం రుణపడివుంటాను. అమ్మా... నీకో తీపి కబురు చెప్పనా. నేను ఇప్పుడు నా పనులు నేనే సొంతగా చేసుకుంటున్నాను. ఎలక్ట్రిక్ వీల్ చైర్ వాడుతున్నాను. అంతేకాదు! యూనివర్సిటీలో క్లాసులు తీసుకుంటున్నాను. నేను మంచి ఆర్టిస్ట్ అవుతానమ్మా. నేను మీకోసం ఎంతగా పరితపిస్తున్నానో తెలుసా అమ్మా. ఒక్కసారి మిమ్మల్నిద్దర్నీ చూడాలి. ఆత్మీయంగా కౌగిలించుకోవాలి. మనసారా మాట్లాడాలి. బోలెడన్ని కబుర్లు చెప్పాలి. గోరువెచ్చని నీ ఒడిలో సేదతీరాలి. అదే నా కోరిక. ఏదో ఒకరోజు మిమ్మల్ని తప్పకుండా కలుస్తానన్న నమ్మకమైతే నాకు మనసు నిండా వుందమ్మా. ఆ కోరికతోనే...ఆ ఆశతోనే...ఆ ఆశయంతోనే ఆ క్షణం కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్న..."

మీ

మిండా, బొలివర్, మిస్సోరి.

కన్నవారికి దూరమై ... వారి చెంత చేరేందుకు తపన పడుతున్న పంతొమ్మిదేళ్ల అమ్మాయి మిండా హృదయ వేదన, స్పందనకు అక్షర రూపమే ఈ లేఖ. ఇది కర్నాటకలోని ఓ పత్రికలో అచ్చయింది.

ఇదంతా చదివినవారికి...ఎక్కడో లాటిన్ అమెరికాలో వుండే అమ్మాయేంటి? అమ్మానాన్నలకోసం కర్నాటకలో పత్రికా ప్రకటన ఇవ్వడమేంటి? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. అది తెలియాలంటే సరిగ్గా రెండు దశాబ్దాల వెనక్కి వెళ్లాల్సిందే. కళావతి, శంకర్‌శెట్టి దంపతులు అందరిలాగే తమకు పుట్టబోయే తొలి బిడ్డమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పాపయినా బాబయినా ఆరోగ్యంగా అందంగా వుండాలని ఆరాటపడ్డారు. 1988లో వారికి పుట్టిన పాపే మిండా. అయితే పుట్టుకతోనే తనకు కాళ్లు, చేతులు లేవు. అయితేనేం పాప మొహం ఎంతో కళగా వుంది. ఆ ఒక్క లోపాన్ని మినహాయిస్తే... పాప ముద్దులొలుకుతోంది. తను అమాయకంగా బోసినవ్వులు రువ్వినపుడు బుగ్గ చొట్టబడుతోంది. తనను ఆ స్థితిలో చూచిన దంపతులకు నోట మాట రాలేదు. దుఃఖం ఏరులై పొంగుకొచ్చింది. అంత బాధలోనూ పాపను ఏడు మాసాలపాటు సాకారు. కానీ అలా ఎంతకాలం? పాపకు వైద్యం చేయిస్తే తన పనులు తను చేసుకుంటుందికదా అన్న ఆలోచన శంకర్‌కు వచ్చింది. కాని అప్పట్లో వారిది చాలీచాలని ఆదాయం. చిన్న పూరిగుడిసెలో నివాసం. అందుకే గుండె రాయి చేసుకొని పాపను బెంగుళూరుకు చెందిన 'ఆశ్రయ' అనే సంస్థకు దత్తత ఇచ్చారు. అక్కడైతే కన్నవారి ప్రేమ అందకపోయినా కనీసం చికిత్స లభించి తన కాళ్లమీద తను నిలబడుతుందని ఆశించారు. అలా ఏడు మాసాల పసికందుగా మిండా తల్లి ఒడిని వీడి 'ఆశ్రయ'కు చేరింది. అక్కడి నుంచి కాథరిన్ కాక్స్ దత్త పుత్రికగా లాటిన్ అమెరికా వెళ్లింది. కానీ ఊహ తెల్సిన దగ్గర నుంచి మిండాకు తన కన్నవారిని ఒక్కసారైనా కలుసుకోవాలని ...చూడాలని ...తపించిపోయింది. అది అసాధ్యమని తెల్సుకుని నిరాశపడింది. చివరి ప్రయత్నాల్లో భాగంగా 'ఆశ్రయ' 25వ వార్షికోత్సవ సందర్భంగానైనా కన్నవారి చెంతకు చేరుకోవాలని ఆశపడింది. స్థానిక పత్రికకు తన లేఖను పంపింది.

అలా అలా... మిండా సమాచారం ఉడిపి జిల్లాలోని కొలేకబైలు గ్రామంలో వున్న అసలు సిసలు అమ్మానాన్నలకు చేరింది. అక్కడ మిండా కన్నతండ్రి చిన్న షాపు నడుపుతుంటాడు.

ఓ ఆదివారం నాడు మిండా, ఆమె పెంపుడు తల్లి కాథరిన్ కలిసి ఆ కుగ్రామం చేరారు. ఈ విషయం తెలిసిన చుట్టుపక్కల వారే కాకుండా ఊరు ఊరంతా అక్కడికి చేరుకుంది. కళావతికి కూడా ఆ క్షణంలో చాలా ఆతురతగా అనిపించింది. నెలల పసికందుగా వున్నప్పుడు చూసిన బిడ్డ పెద్దదై సరిగ్గా 20 ఏళ్ల తర్వాత ఇవాళ తనకోసం...తన ప్రేమకోసం పరితపిస్తూ తిరిగి వస్తున్నందుకు ఎంతో ఆనందంగానూ ఉద్వేగంగానూ అనిపించింది. ఆ తల్లీకూతుళ్ల అపూర్వ సంగమాన్ని చూడ్డానికి అంతా ఎంతో ఉత్సుకత చూపించారు. ఇద్దరూ ఆనందభాష్పాలతో ఒకరినొకరు పొదవి పట్టుకున్నారు. ఆ ఉద్వేగక్షణంలో ఇద్దరికీ మొదట మాట రాలేదు. ముందుగా తేరుకున్న కళావతి కాథరిన్ చేతులు పట్టుకొని

"నేను పాపను ఈ కళ్లతో చూడగలుగుతానని కలలో కూడా అనుకోలేదు. నేను జన్మనిస్తే మీరు జీవితం ఇచ్చారు" అంది. అలా కాసేపు మాట్లాడుకున్నాక వీల్ చైర్‌లో వున్న మిండాను ఊరి ప్రజలు చూడ్డానికి వీలుగా వరండాలోకి తీసుకెళ్లాడు తండ్రి శంకర్. ఆ ఆతురతలో జనం మధ్య కూసింత తోపులాట కూడా జరిగింది.

ఆ తర్వాత తన చిట్టితల్లి మిండాతో మాట్లాడుతూ..." అప్పుడు మన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. నీ ఆరోగ్యం బాగు చేయించడానికి ఆసుపత్రికి పంపిస్తున్నామని, మళ్లీ అంతా మామూలుగా అయ్యాక నువ్వు తిరిగి వస్తావని చెప్పాకే మీ అమ్మ నిన్ను అక్కడికి పంపడానికి అంగీకరించింది" అన్నాడు శంకర్.

తనను కని ఎందుకు వదిలేశారని ప్రశ్నించడం మిండా ఉద్దేశం కాదు. ఈ వైకల్యంతో సహ స్వీకరిస్తారన్న భరోసా పొందడానికే ఆమె వచ్చింది. మరోవైపు వైకల్యం కారణంగా నిస్సహాయ స్థితిలో వారు వదిలేసిన తను చక్కగానే బతకగలుగుతున్నానని కన్నవారికి కూడా భరోసా ఇవ్వాలన్నది ఆమె ఆకాంక్ష.

- చరిత



అమ్మా నాన్నా పెంపుడు తల్లితో మిండా

విజ్ఞాన వీచిక

విజ్ఞాన శాస్త్రంలో అద్భుతాలు

విజ్ఞాన శాస్త్రంలో కాలం కీలకమే అయినా దానికి మనమిచ్చే ప్రాముఖ్యత ఇవ్వలేదు. అయినప్పటికీ, మనలాంటి వారికోసం కాలాన్ని సంవత్సరాలుగానూ, ఆ సంవత్సరంలో జరిగిన ప్రముఖ ఘట్టాలను ప్రత్యేకంగానూ విడగొట్టారు. ఆ క్రమంలో గడిచిన ఏడాదిలో విజ్ఞాన ప్రపంచంలోని వీచికలను - ముఖ్యమైన వాటిని నెమరువేసుకుందాం.

డా॥ కాకర్లమూడి విజయ్



ఏ విజ్ఞాన పరిశోధనైనా మానవాళికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపయుక్తంగా ఉండటం ముఖ్యం. అది ఎంత చిన్న ఆవిష్కరణ అయినా సరే, మానవజాతికి ఏ మేరకు సాయపడుతుందన్నదే ముఖ్యం. మానవులను ఇప్పటికీ గడగడలాడిస్తున్నది వ్యాధి. అది ఏ వ్యాధైనా సరే – ఎంతో కొంత నష్టం వాటిల్లడం పరిపాటి. కొన్ని సందర్భాల్లో నష్టాలు భారీ స్థాయిలో కూడా ఉంటాయి. అటువంటి నష్టాలలో కీలక అవయవాలు దెబ్బతినటం ఒకటి. గత సంవత్సరం వెలుగుచూసిన ఒక శాస్త్రీయ పరిశోధన కావలసిన అవయవ కణజాలాన్ని తయారు చేసే వీలు కలిగించేది కావడం చెప్పుకోతగ్గది. కణాల పునర్వ్యవస్థీకరణ (సెల్యులార్ రీ ప్రోగ్రామింగ్) గత ఏడాది ఉత్కృష్ట పరిశోధన అని సర్వత్రా ప్రశంసలందుకుంటోంది.

కణాల పునర్వ్యవస్థీకరణ జీవ శాస్త్రంలో కొత్త రంగానికి తెరలేపింది. ఈ పరిశోధనకు రానున్న కాలంలో మానవ ప్రాణాల్ని నిలబెట్టే దిశలో ప్రాముఖ్యత ఉంటుంది. డయాబెటిస్, పార్కిన్ సన్ వ్యాధి వంటి క్లిష్టమైన వ్యాధుల అవగాహనకు, నివారణకు కూడా దీనివల్ల మార్గం సుగమమయ్యే వీలుంది. అయితే ఈ మహావిష్కరణకు బీజాలు రెండేళ్ల క్రిందటే పడ్డాయి. కణాల అభివృద్ధి క్రమాన్ని సమూలంగా చెరిపివేసి, వాటిని తిరిగి శైశవ దశకు తీసుకెళ్లి, అక్కడినుండి తిరిగి మనకు కావలసిన విధంగా మార్చుకునే ప్రయత్నాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. గత సంవత్సరం పరిశోధకులు ఈ ప్రయత్నాలలో పెను విజయం సాధించారు. విభిన్న వ్యాధులున్న వ్యక్తుల కణాలను ప్రోగ్రాం చేసి, శరీర వ్యవస్థ వెలుపల వాటిని అభివృద్ధి చేయగలిగారు. రానున్న కాలంలో ఈ ప్రక్రియ సాయంతో వ్యాధుల అవగాహన, చికిత్స, నివారణ వంటివి సులభమవనున్నాయి. ఈ ప్రక్రియకు పూర్వం మూలకణాల (స్టెమ్ సెల్స్)తో పరిశోధనలు జరిగేవి. అనేక కారణాల వల్ల ఆ దిశలో అభివృద్ధి సవ్యంగా జరగలేదు.

గత ఏడాది శాస్త్రీయ రంగం సాధించిన విజయాలలో మరో చెప్పుకోదగ్గ అంశం బహిర్ గ్రహాలను (ఎక్సో ప్లానెట్స్) కనుగొనటం. ఆ ఏడాది మొట్టమొదటి సారి శాస్త్రవేత్తలు మన సౌరకుటుంబానికి ఆవల, ఇతర నక్షత్రాల చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలను కనుగొనగలిగారు. పరోక్షంగా కాకుండా ప్రత్యేక టెలిస్కోపుల సహాయంతో వాటిని నేరుగా చూడగలగటం విశేషం.

రెండు వేల ఎనిమిదవ సంవత్సరంలో భౌతిక శాస్త్రంలో కూడా గొప్ప విజయాలు లభించాయి. ఒకటి ప్రోటాన్లు న్యూట్రాన్లలో ద్రవ్యరాశిని కచ్చితంగా లెక్కకట్టడం. తద్వారా భూగోళ బరువునీ కచ్చితంగా లెక్కగట్టడం. మరొకటి పర్యావరణానికి తోడ్పడే పరిశోధన. సౌర వాయు వంటి సాంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా ఉత్పత్తి చేయబడ్డ విద్యుత్‌ని సమర్థవంతంగా నిలువ చేయటం. సులభంగా లభ్యమయ్యే కోబాల్ట్ - ఫాస్ఫరస్ కాటలిస్ట్‌ని ఉపయోగించి నీటిలోని హైడ్రోజన్‌ను వేరు చేసి దానిని ఫ్యూయల్ సెల్స్‌లో ప్రవేశపెట్టి, తిరిగి విద్యుత్‌ని ఉత్పత్తి చేయవచ్చు.



గత సంవత్సరమే భూమి అంతరించి పోవచ్చునన్న ఆందోళన ఉదయించింది. లార్జ్ హాడ్రాన్ కొల్లిడర్ అవే 17 మైళ్ల పొడవున్న వలయాకారపు పార్టికిల్ యాక్సెలిరేటర్ ద్వారా బిగ్ బ్యాంగ్ తరహా పరిస్థితులను కల్పించే ప్రయోగం ప్రారంభమైంది. ఆ కారణంగా మహా విస్ఫోటనం ఏర్పడకపోయినా, శ్యామబిలం ఏర్పడి భూగ్రహాన్ని పీల్చేసుకునే ప్రమాదం మాత్రం ఉందన్న వదంతులు ప్రపంచాన్ని ముంచెత్తాయి. శాస్త్రవేత్తలు కొంతమంది అటువంటి ప్రమాదం లేదన్నా, తెలిసీ తెలియని వారి మాటలకే ప్రజలు విలువనిచ్చి, ఆందోళన చెంది తృప్తి పొందారు.

జపాన్ శాస్త్రవేత్తలు 16ఏళ్లపాటు శీతలీకరించబడ్డ చనిపోయిన ఎలుకనుండి క్లోనింగ్ ప్రక్రియలో 13ఎలుకల్ని పుట్టించిందీ గత సంవత్సరమే. ఇప్పటికే అంతరించిపోయిన జీవులను తిరిగి ప్రాణ ప్రతిష్ట చేయగల అవకాశాలను సానుకూల పరుస్తుందీ విజయం.

భూమికి 213 మైళ్ల పైన, అంతరిక్షంలో గత సంవత్సరం ఒక చైనాదే తప్ప వ్యోమగామి 15 నిముషాల పాటు 'నడిచాడు'. అంతరిక్షంలో మానవులను పంపడం చైనాకి అది మూడవసారి. మరో దశాబ్దకాలంలో చైనా తన స్వంత స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమౌతోంది.

ఇక, ఎప్పటినుండో వెంటాడుతున్న ప్రశ్న - అరుణ గ్రహం (మార్స్)పైన జీవం వుందా? కి సమాధానం కచ్చితంగా దొరక్కపోయినా, అందుకు తగ్గ ఆధారాలు గతేడాదే లభించాయి. మార్స్ ఉత్తర ధృవం దగ్గర మంచు, బంక లభ్యమయ్యాయి. అంటే ఆ గ్రహంపై నీరు ఉండేదనీ, అందువల్ల జీవం కూడా ఉండేదేమో నన్న అనుమానం బలపడుతోంది.

గత సంవత్సరం భారతదేశానికీ ఒక అద్భుత విజయం సమకూరింది - చంద్రయాన్‌తో. చంద్రుని అధ్యయనానికి భారతదేశం పంపిన తొలి పరికరం ప్రస్తుతం చంద్రునికి సమీపంలో ఉంది. సమాచారం అందిస్తోంది.

ఇంకా అనేక అద్భుతాలు శాస్త్రీయ ప్రపంచంలో గత ఏడాది జరిగాయి. వాటి ఆధారంగా ఈ ఏడాది మరెన్నో విశేషాలు వాస్తవాలుగా మారే అవకాశముంది. మానవ వివేకానికి విచక్షణ తోడై విజ్ఞానాన్ని విస్తృతంగా, ఉపయుక్తంగా అందించాలని నూతన సంవత్సరంలో అందరం ఆకాంక్షిద్దాం.

ఇంతకు ముందు ఎప్పుడూ లేనిస్పెషల్ ఆఫర్

ఈ అద్భుత అవకాశం 2500 మందికి మాత్రమే.

రూ.510/- ల ఇంగ్లీష్ కోర్సు రూ.200/- లకే

మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1		డివిజన్-2		డివిజన్-3		ఇవన్నీ
రూ.130/-	+	రూ.170/-	+	రూ.210/-	=	రూ.200/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ. 130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ. 170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ. 210/-

4 కోర్స్ గిఫ్ట్ పుస్తకాలు ఫ్రీ
(4 ఇన్ 1 పోకెట్ సైజులో)

1. వర్డ్ పవర్ (ఆంగ్ల పదాల అద్భుత శక్తి)
2. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ (ఇంగ్లీష్‌లో ఉత్తరాలు వ్రాసే పద్ధతి)
3. వెర్బ్స్ డిక్షనరీ (క్రియలు - వాటి రూపాలు)
4. సినానిమ్ & యాంటోనిమ్స్ డిక్షనరీ (ఆంగ్ల సమాన పదాలు & వ్యతిరేక పదాలు)

గిఫ్ట్ పుస్తకాల సైజు 9 cm X 11 cm లోనూ, కోర్స్ మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ, డైరీ సైజు 12 cm X 17.5 cm లోనూ (ఆఫ్‌సెట్ మల్టీకలర్ కవర్‌తో) ఉంటాయి. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతీ సంవత్సరానికి క్రొత్త డైరీగా ఉపయోగించుకునే విధంగా ప్రత్యేకంగా రూపొందించబడిన డైరీ. ఈ కోర్స్ తరువాత కూడా కొన్ని కోర్స్‌లు కలవు. వాటిని మీకు నియమిత నామ మాత్రపు ఫీజుతో పంపడం జరుగుతుంది.

కొత్త సంవత్సర కానుక



STUDENTS' ENGLISH INSTITUTE

Post Bag No. 8569,
New No. 203,(D) Habibullah Road, T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు, ఒక డైరీ మరియు 4 ఉచిత పుస్తకాలు ఇవన్నీ కలిపి కేవలం రూ. 200/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

(మీ చిరునామా స్పష్టంగా అర్థమయ్యేలా ఇంగ్లీష్‌లో వ్రాయండి. లేనిచో కోర్సును పంపుటకు వీలుపడదు)

1734

స్పెషల్ ఆఫర్ కూపన్.

Name: ....

Address: ....

....

.... Pincode: ☐☐☐☐☐☐

కథ

> "సారీ సార్, నాకు నావెంట ఉన్నవారికి నాటకం కిరాయికి వెడితేనే బువ్వ దొరికేది. సన్మానాలు చెవులకు ఇంపుగా ఉంటాయి తప్పితే కడుపు నింపవు. మీరు పదివేలు నాటకానికి ఇవ్వగలిగితే మీవేదిక వద్ద నాటకం వేస్తాం. సన్మానంలో నాకు చెక్కు ఇవ్వవద్దు. క్యాష్ మాత్రమే ఇవ్వాలి. నాతోబాటు నాతోటి కళాకారులకు ఏదో బహుమతి రూపంలో ఇవ్వాలి. మీరు వెడుతున్న కారును వెనిక్కి తిప్పి నాటకానికి అడ్వాన్సు మాఅమ్మకు ఇవ్వండి. ఒకగంటలో అమ్మ నుంచి ఫోన్ రాకుంటే నేను కిరాయికి ఆరోజు వేరేచోట నాటకం వేసుకుంటాను"



సన్మానం

వై. కుసుమకుమారి

కాంతం స్టేజీమీద పద్యాలు పాడితే పామరజనాలే కాదు పండితులు కూడా పారవశ్యంతో తలలూపక తప్పదు. ఆమెకు పద్యం, ఆలాపన, నటన ఇవన్నీ తెచ్చిపెట్టుకుంటే రాలేదు. ఆమెలో నటన, ఆలాపన వంశపారంపర్యంగా పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చింది. ఆమె తాతగారు కిళాంబాచార్యులు అంటే సాక్షాత్తు యముడే దిగివచ్చాడా అనేట్టుండేవారు.

"సావిత్రీ నీపతి కోసం నీవు పడుతున్న తపన ప్రశంసనీయం. నీపతి ప్రాణములు దక్క ఏదైనా వరం కోరుకో! ప్రసాదింతును" అని యముడు సావిత్రిని వరం కోరుకోమన్న తీరు కాంతం యముడు రూపంలో చేసిన హావభావ ప్రకటనలు నభూతో నభవిష్యతి అని ఒకదినపత్రికలో అచ్చయ్యింది.

అది చదివిన స్నేహ సామాజిక సంస్థ అధ్యక్షుడు రామగోపాల్. "ఇలాంటి ఆణిముత్యం మనూళ్లో ఉందా? ఈసారి మన సామాజిక సంస్థ తరపున ఆమెకు సన్మానం చేద్దాం" అని తన నిర్ణయాన్ని అనుయాయులకు చెప్పాడు. ఆయన ఏమంటే దానికి వంతగా తలలూపారు. ఆమెకు ఉన్న ఊళ్లో చేయడం మనకే గర్వకారణం అన్నారు.

స్టేజి నటి కాంతానికి సన్మానం చేయడానికి రంగం సిద్ధం అయ్యింది. అందుకు కలక్టర్ గారిని కలుసుకుని తమ చేతులమీదగా ఒక కళాకారిణికి సన్మానం చేయాలని కోరారు. కలక్టర్ గారు ఎంతో బిజీలో ఉండి కూడా తప్పక వస్తానని మాటిచ్చారు.

సన్మానగ్రహీతతో మాట్లాడేందుకు కారులో బయల్దేరాడు రామ్‌గోపాల్. కాంతం ఇల్లు పాతకాలం పెంకుటిల్లు. అక్కడకి వెళ్లగానే కన్పించే వాతావరణం చూసి రామ్‌గోపాల్ కళ్లు పెద్దవయ్యాయి. ఇల్లు శిధిలావస్థలో ఉంది. కుక్కిమంచంలో పడుకుని ఒకముసలామె వాసాలు లెక్కిస్తున్నట్టుగానే చూపులు నిలిపింది.

"బామ్మా ఎవరో వచ్చారు. కాంతం పిన్ని లేదు. నువ్వే మాట్లాడు" ఒక కుర్రాడు చెప్పి కారులో ఎంతమంది దిగారో అందరిని లెక్కించుకుని పాతకాలం ప్లాస్కుతో తుర్రుమన్నాడు.

బామ్మలేచి ప్లాస్టిక్‌కుర్చీలు ఓపిగ్గా సర్ది "రండి నాయనా పిల్ల లేదు. పోగ్రామ్‌కి పోయింది. నాటకాలు వరుసగా ఆడాలి. ఎల్లుండికిగాని దిగదు. ఎన్నిపోగ్రాలు ఆడినా దానికి కష్టమే కాని సుఖము లేదు. దాని రెక్కల కష్టాన్ని మేము తిని కూర్చోవాలని రాసుంది" చెప్పి వారికెదురుగా నిలబడింది.

రామ్‌గోపాల్ అతడివెనుక మరి ముగ్గురు కూర్చున్నారు.

"కాంతం నాకూతురు. యమాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణ కుచేల శ్రీరామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర, సతీ సావిత్రి నాటకాలు వేస్తుంది. అందులో ఎక్కువగా వెళ్లేది శ్రీకృష్ణపాత్రలకు, యముడుగా సతీసావిత్రి నాటకాలు వేస్తుంటుంది. మీకు ఏరోజుకావాలో చెబితే నేను డేటు రాసుకుంటాను. అడ్వాన్సు ఇస్తే అమ్మాయి వచ్చినట్టే" బామ్మ చెప్పాల్సింది సూటిగా చెప్పి ఒక నోటుబుక్కు తీసుకుని పెన్‌తో రాద్దామని నిలబడే బస్సు కండక్టర్‌లా సిద్ధపడింది.

"అమ్మా మీరు చదువుకున్నారా?" రామ్‌గోపాల్ అడిగాడు.

"మాకాలంలో చదువులు ఎక్కడివి నాయనా, అమరం ఆంధ్రం చదువుకున్నాను. సంస్కృతగ్రంథాలు నాకు అర్థమవుతాయి. ఇప్పుడు నాబిడ్డ కాంతం వేసే నాటకాలలో కొన్ని సన్నివేశాలు నేను తయారు చేసినవే. అందులో రామాంజనేయయుద్ధంలో కవులు బదిరెడ్డి, తాండ్ర రాసిన ద్వాన్ని కలిపి ఎవరైనా నాటకాన్ని వేసుకుంటారు. మేము అంతే కానీ, పెద్దకన్నులున్న నాకూతురుకు వేరేగా సన్నివేశం క్రియేట్ చేశాను. భక్తుడైన యయాతిపై యుద్ధానికి వెళ్లినపుడు శ్రీరాముడు మానసికంగా బాధపడే సీను పదినిముషాలు స్టేజి మీద అభినయించడానికి నావంతు తయారుచేశాను. ఆసీను ప్రతి చోటా పండుద్ది"

రామ్‌గోపాల్ బృందం బిక్కముఖాలు వేశారు. ఆమెలో ఒక కుమ్మరి మొల్లను చూసుకున్నారు. ఆమెకు కదిపితే తామూహించని విధంగా చాలా ఇంట్రస్టుగా చెబుతోంది. మట్టిలో మాణిక్యాలు

ఎందరో ఇలా మురికివాడలకే పరిమితమయ్యారు అని ఎవరికివారే అనుకున్నారు.

ఆగదిలో కాంతం ఫోటోలున్నాయి. వాటిల్లో యముడు, శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, సత్యహరిశ్చంద్రుడు ఉన్నాయి. వాటిని చూస్తూ చేతిలోఉన్న దినపత్రికలో వచ్చిన కళామతల్లి ముద్దుబిడ్డ అనే వ్యాసాన్ని చూపిం చాడు. బొమ్మ చూసి ఆవెంటనే పక్కన పడేసింది.

"అదేమిటి ఇలా చూసి అలాపడేశారు. మీఅమ్మాయి కాంతం గారి గురించి రాశారు. చాలా బాగా వచ్చింది.అదిచూశాక ఆమెకు మాసామాజిక సేవాసంస్థతరపున ఘనసన్మానం చేయాలనుకుంటున్నాం. ఈవిషయం మాట్లాడ్డానికి వచ్చాం"

"ఏమిటి సన్మానమా? మీరు కాంతం నాటకం బుక్ చేద్దామని రాలేదా?" నిట్టూర్చింది.

"మేము ఆమధ్య ప్రముఖులకు ఘనసన్మానం చేశాం. కాంతం గారికి అలాంటి సన్మానం చేయాలనుకున్నాం. ఇక్కడికి వచ్చాక మీతో మాట్లాడాక మరింత ఘనంగా చేయాలనుకుంటున్నాను"అని రామ్‌గోపాల్ చెప్పాడు.

అంతలోనే టీలు పట్టుకుని వచ్చాడు మనవడు. తలా ఒకగ్లాసు అందుకుని తాగారు. కాంతమ్మ లోపలకి వెళ్లి మిగిలిన తనకుటుంబ సభ్యులతో మాట్లాడి వచ్చి "సన్మానం ఏరోజు అనుకుంటున్నారు" అని అడిగింది.

తేది చెప్పారు. తనవద్ద ఉన్న నోట్‌బుక్కులో తేదీలు చూసుకుని ఖాళీఉంది. నాబిడ్డ వచ్చాక చెబుతాను. ఈలోగా ఫోన్‌చేసినా చెబుతాను. మీఏర్పాట్లు మీరు చేసుకోండి. ముందురోజు చెబితే ఎక్కడికంటే అక్కడికి వస్తుంది. మీ సెల్‌నెంబర్లు ఈబుక్కులో రాయండి" అని నోట్‌బుక్కు అందించింది.

రామ్‌గోపాల్ తిరిగి కారెక్కాడు. అతడి ఆలోచనలు పరిపరి విధాలుగా ముసిరాయి. కారు ఆ మట్టిరోడ్డు కాలనీ వదిలేసింది.

"కాంతం మంచినటి. మనం ఊరకనే సన్మానం చేసేకంటే ఆరోజు ఆమెచే ఒక నాటకం వేయించేసి చివరాఖరిలో సన్మానం చేసి వెయ్యినూటపదహార్లు, ఒక దుశ్శాలువ కప్పేసి పూలగుత్తి ఒకటి చేతిలో పెట్టేసి నటశిరోమణి లేదా నటతేజం అని ఒకబిరుదు కూడా ఇచ్చేద్దాం"తన ఆలోచనను తన వెనుకవారికి చెప్పాడు.

ఆమె వేసిన నాటకం ఏఒక్కటి ఐదువేల రూపాయలకు తక్కువలో లేదు. మనం నాటకం వేసినందుకు ఇవ్వాల్సినది ఇవ్వాలికదా!" చిన్నకొర్రీ వేసాడొకడు.

"అందుకే సన్మానం చేస్తున్నాం కదా!అదీ కలక్టర్‌గారి చేతుల మీదుగా బిరుదు ప్రధానం చేస్తాం. ఊరిప్రముఖులు అందరిమధ్యలో జరుగుతుంది. కాంతంలాంటి మురికివాడలో బ్రతికేదాన్ని, ముక్కు ముఖంలేని దాన్ని అందలం ఎక్కిస్తున్నాం"చిరాగ్గాచెప్పాడు.

అతడితో ఉన్న వారు ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు. "ఓరెదవా ఇలాంటి ఆలోచన నీకు ఆకళాకారిణిమీద ఉందా? ఎంతటి కమర్షియల్ ఆలోచన చేస్తున్నాడు" అని ఎవరికి వారే అనుకున్నారు.

అంతలోనే సెల్‌లో మిస్సుడ్ కాల్ చూసి ప్రతివెధవకి మిస్డ్‌కాల్ ఇచ్చి మనకాల్‌కోసం ఎదురుచూడ్డం అలవాటయిపోయింది" మరింత చిరాకు కనబరిచాడు.

"ఇకమీదట ఈరామ్‌గోపాల్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వకూడదు. ఇలానే తిట్టిపోస్తాడు"అనుకున్నారు కారులో కూర్చున్న అనుయాయులు

మళ్లీ మళ్లీ రింగ్ వస్తూనే ఆగిపోతోంది. ఊపిరిబిగబట్టి ఈసారి రింగ్ వస్తే లైన్‌లోతెచ్చి అవతలివాడిని నిలదీద్దామని కోపంతో సిద్ధపడిపోయాడు. వచ్చింది రింగ్ వెంటనే కిసుక్కుమని నొక్కేసి "హలో ఎవరూ ఏమిటి మిస్సుడు కాల్సు" అని చిరాగ్గా అడిగాడు.

"మీరెవరు రామ్‌గోపాలేనా? కలక్టర్ ఆఫీసు నుంచి మాట్లాడు తున్నాను.పి.ఏ.ని"

"సార్‌సార్ చెప్పండి" అని సర్దుకున్నాడు.

"కొంచెం నోరు అదుపుచేసుకోండి.సరే మీరు ఏవో సన్మానాలున్నాయని కలక్టర్‌గారిని ఆహ్వానించారు. అయితే వేరే ప్రోగ్రామ్ మంత్రి గారితో ఉండేది. ఇప్పుడది కాన్సిల్ అయ్యింది. కలక్టర్‌గారు మూడు గంటలుపాటు మీవేదికమీద ఆవరణలో ఉంటారు. నాటకాల నటి కాంతం గురించి కలక్టర్‌గారు ఆమధ్య పత్రికలలో చదివారు. ఆయనకు కళాభిమానం ఎక్కువ"

"చాలాసంతోషం సార్! నాఏర్పాట్లు నేను చేసుకుంటాను సార్" రామ్‌గోపాల్ కారులో హోరెత్తిపోయి అరిచి చెబుతుంటే పక్కనేఉన్న వారు వింతగా చూశారు.

"కాంతం ప్రోగ్రామ్ ఇప్పుడు అనివార్యం అయ్యింది. ఆమెకు మనం ఇవ్వవల్సినది వెయ్యినూటపదహార్లు కాకుండా రెండువేలపదహారులు ఇద్దాం అదీ చెక్కు రూపంలో ఇచ్చేస్తే ఒకటిరెండుసార్లు బౌన్సు అయినా వీలు చూసుకుని ఇచ్చేయొచ్చు. ఇలాంటి బౌన్సు చెక్ కేసును కోర్టుతీసుకోదు. కలక్టర్‌గారు వస్తున్నారు స్టేజికి ఏదో ఒకటి చేయాలి. ఎలా లేదన్నా వెయ్యి, రెండువేల ఖర్చవుతుంది. వీటికి చెక్కులు ఇవ్వలేం కదా!" ఇలా రకరకాల లెక్కలు వేయసాగాడు.

"కాంతం నాటకం వేస్తే రెండు గంటలు కలక్టర్ ఆనాటకంలో పడిపోతారు లేకుంటే మీ సామాజిక సంస్థ చేసిన నిర్వాకాలు ఇంతవరకు ఏమేమి చేసారో రికార్డులు చూపండి. మీరు నిర్వహిస్తున్న బాలకార్మికుల పాఠశాల పరిస్థితి ఏమిటి అని అటుగాని ఉరికేయగలరు. అక్కడ పిల్లలు చారల గుర్రాల్లా ఎముకులు తేలి దర్శనం ఇస్తారు. అసలకే మోసమవుద్ది" ఇదేఅదను అని చెప్పాడొకడు.

"బాగానే గుర్తుచేశావు.కాంతం కోసమే కలక్టరు వస్తున్నాడం టాడేవిటి. కలక్టర్లుకు ఈకళాకారులమీద ఇంత అభిమానం ఉంటే ఆమెకు ఒకిల్లు కట్టుకోవడానికి సాయపడాల. అలాంటిదేమి లేకుండా మన లాంటోళ్లంచేస్తే వచ్చి చేస్తానంటారు. ఏమిటో ఒక్కొక్కరు ఒక్కొక్క తీరులో ఉంటారు" అని వేదాంతంలోకి వెళ్లిపోయాడు.

అప్పుడే సెల్ మోగింది. చెవికి అదిమాడు "నేనే రంగస్థలం కాంతాన్ని. మీరు సన్మానం చేస్తామన్నారంట. మాఅమ్మ తేది ఖరారు చేసింది. అయితే నాకు ఆరోజు నాటకం తగిలింది. మీరు మరో రోజు పెట్టుకుంటారా సన్మానం?"

రామ్‌గోపాల్ గుండెలు గుటుక్కుమన్నాయి. "ఏమ్మో నీకు సన్మానం అంటే చాలాతేలిగ్గా ఉంది. కలక్టర్ చేతులు మీదుగా అందుకుంటావు. ఆయన ముందు నాటకం ప్రదర్శన చేస్తే నీపాత పెంకిటిల్లును కొత్తగా కట్టుకోవచ్చు. అప్పుడే నీకు కిరాయి పెరుగుతుంది. ఎన్నో ప్రోత్సాహకాలు లభిస్తాయి. అన్నీ కాలదన్నుకుని చేయికాలగానే కుండెత్తికమ్మా"

"రామ్‌గోపాల్‌గారూ లోగడ నాకు మంత్రులు సన్మానాలుచేశారు. వాటివలన ఒరిగేదిలేదు. ఇక సన్మానాల్లో చెక్కులు ఇస్తారు. అవి చెల్లిచావవు. అందుకే సన్మానాలంటే భయం. సరే విషయానికి వస్తాను నాముందు గ్రామపండుగలకు నాటకం కావాలంటూ ఒకరు కూర్చున్నారు. మేము సతీసావిత్రి నాటకం పదివేలకు వేస్తుంటాం. అదీ అమ్మవారి సంబరాలకు వెడితే మాకు మరిన్ని బహుమతులు కూడా వస్తాయి. దీన్ని కాదనుకుని మీ సన్మానం అని నేను వస్తే మీరు ఇచ్చిన చెక్కు చెల్లిచావదు. మీరు కప్పిన దుశ్శాలువ బీరువాలో పెట్టుకోవ డానికితప్ప దేనికి పనికిరాదు. నా నాటకం కిరాయి నాకు ముఖ్యం. ఆతరువాతే మీలాంటివారు చేసే సన్మానం."

రామ్‌గోపాల్‌కు చెమటలు పట్టాయి "అన్నీ అనుకున్నాక ఇలా వద్దు అనేట్టు మాట్లాడుతున్నావు. ఇదేం బాగాలేదు. కలక్టర్‌గారు ఏమనుకుంటారు? సరే, ఎంతోకొంత నేనిస్తాను. నాటకం వేయండి. ముఖాలకు రాసుకునే రంగులకు మీభోజనాలకు ఏదో ముట్టచెబుతాను నువ్వు ఆరోజు ఎక్కడికి వెళ్లొద్దు."

"సారీ సార్, నాకు నావెంట ఉన్నవారికి నాటకం కిరాయికి వెడితేనే బువ్వ దొరికేది. సన్మానాలు చెవులకు ఇంపుగా ఉంటాయి తప్పితే కడుపు నింపవు. మీరు పదివేలు నాటకానికి ఇవ్వగలిగితే మీవేదికవద్ద నాటకం వేస్తాం. సన్మానంలో నాకు చెక్కు ఇవ్వవద్దు. క్యాష్ మాత్రమే ఇవ్వాలి. నాతోబాటు నాతోటి కళాకారులకు ఏదో బహుమతి రూపంలో ఇవ్వాలి. మీరు వెడుతున్న కారును వెనిక్కి తిప్పి నాటకానికి అడ్వాన్సు మాఅమ్మకు ఇవ్వండి. ఒకగంటలో అమ్మ నుంచి ఫోన్ రాకుంటే నేను కిరాయికి ఆరోజు వేరేచోట నాటకం వేసుకుంటాను" చెప్పి సెల్ ఆపేసింది.

రామ్‌గోపాల్‌కి తల తిరిగిపోయింది. పచ్చివెలక్కాయి గొంతులో అడ్డదిడ్డంగా పడిపోయింది. ముందు నుయ్యి వెనుక గొయ్యి లాంటి పరిస్థితిలో కారు వెనక్కి తిప్పించాడు. ఉన్న ముగ్గురు విషయం చెప్పించుకుని లోలోపల సంతోషించారు.

ఓ మంచి పుస్తకం

ఎట్టకేలకు ఆ అతి పొట్టి మనిషి హ్యా కోరుకున్న జున్ను గోడౌన్ చేరుకోగలిగాడు. అంత పుష్కలమైన, రకరకాల రుచులు గల జున్ను నిల్వలు అతనెప్పుడూ చూసి వుండలేదు! అక్కడ స్నిఫ్, స్కర్రీలు అతనికి స్వాగతం పలికి మనసారా ఆహ్వానించాయి. దొరికిన జున్నును ఆనందంగా ఆస్వాదిస్తూ అతను గతాన్ని నెమరేసుకున్నాడు. మార్పును పసిగట్టలేకపోవడం, జరిగిన తర్వాతైనా దానికి సిద్ధం కాలేకపోవడం, నిష్కారణమైన భయంతో ఇష్టమైంది కోల్పోవడం ఎంత పొరబాటో తల్చుకుని తనలో తను నవ్వుకున్నాడు.

- తెర

మార్పులో నేర్పు

ఏదీ వున్న స్థితిలో వుండదు. ముందుకో వెనక్కో పోవలసిందే. సంపద, స్థానం, సౌఖ్యం, సంబంధాలు, ఏవైనా సరే. శాశ్వతం అనుకున్నవి అరక్షణంలో మాయమై పోవచ్చు. నిలిచేవి కావనుకున్నవే నిలకడగా వుండిపోనూ వచ్చు. తరగనివనుకున్న ఖజానాలు ఖాళీ కావచ్చు. జీవితంలో శాశ్వతమైంది మార్పు ఒక్కటేనన్నారు.. గతి శీలమైన కాలాన్ని తర్కబద్ధంగా అర్థం చేసుకోవడమే జీవితం. ఆ మార్పుకు అనుగుణంగా మనను మనం మల్చుకోవడంపైనే పురోగమనం ఆధారపడి వుంటుంది. యథాతథ వాదులు వున్నది వున్నట్టు కాపాడుకోవాలనుకుంటారు. గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్ అని తత్వాలు చెబుతారు. కాని మంచి గతమున కొంచెమేనోయ్ మందగించక ముందుకడుగెయ్ అన్న గురజాడ వంటి వారు ముందుకు ఇంకా ముందుకు చూడమంటారు. అందరికీ తెలిసిన ఈ ప్రాథమిక సత్యం ఆచరణలో మాత్రం అంత తేలిగ్గా అర్థం కాదు. అర్థమైనా అమలు పర్చడం తేలికకాదు.

మార్పును ఆహ్వానించడంలోనే మనిషి పురోగతి దాగి వుందన్న పరమ సత్యాన్ని ఏ చదువరి హృదయానికైనా హత్తుకుపోయేంత చక్కగా చెప్పే పుస్తకం 'హూ మూవ్డ్ మై చీజ్?' (నా వస్తువు లేకుండా చేసిందెవరు?) ప్రపంచ వ్యాపితంగా పెద్ద సంచలనం కలిగించిన చిన్న పుస్తకం మీ జీవితంలోనూ పనిలోనూ మార్పులను ఆహ్వానించేందుకు మహత్తర మార్గం అని రచయిత ట్యాగ్‌లైన్ జత చేశారు రచయిత స్పెన్సర్ జాన్సన్.ఇంతకు ముందు ఈ శీర్షికలో చెప్పుకున్న 'వన్ మినిట్ మేనేజర్' అనే ప్రసిద్ధ పుస్తక రచయితలలో ఒకరు. విషయం ఎంత సర్వసాధారణమైందో రచనా శైలి అంత సులభంగా సూటిగా వుంటుంది. చీజ్ అంటే జున్ను లేదా పాలతో వెన్నతో తయారయ్యే మరేదైనా పదార్థం. ఈ మాటకు వస్తువు, కావలసినది అని కూడా అర్థం వుంది. హిందీ భాషలోనూ ఈ మాటను ఇలాగే వాడుతుంటారు.

హూ మూవ్డ్ మై చీచ్ కథ వెనక కథ కూడా చాలా ఆసక్తి కరంగా వుంటుంది. తన జీవితంలో మార్పులను ఆహ్వానించి అవరోధాలను ఎలా అవకాశాలుగా మల్చుకున్నానో చెప్పడానికి స్పెన్సర్ ఈ కథను సృష్టించారు. చాలా ఏళ్ల పాటు దీన్ని



స్నేహితులకు చెబుతూ వచ్చారు. ఈ కథ తమ ఆలోచనా ధోరణిలో గొప్ప మార్పు తెచ్చిందని వారు ఆయనను అభినందిస్తూండేవారు. అలా కొంత కాలం గడిచిన తర్వాత 'వన్ మినిట్ మేనేజర్' సహరచయిత కెన్‌బ్లాంచర్డ్ దానికి పుస్తక రూపం ఇవ్వాల్సిందిగా వెంటపడ్డాడు. అలా పుస్తక రూపం తీసుకున్న ఈ కథ కొద్ది కాలంలోనే ప్రపంచ వ్యాపిత సంచలనమైంది.లక్షలాది ప్రతులు అమ్ముడైంది. అమెరికాలో ఇళ్లలో కార్యాలయాల్లో దీని గురించి అదేపనిగా చెప్పుకున్నారట. సమస్యను చాలా సులభశైలిలో వివరించిందని చాలామంది మెచ్చుకున్నారు.పత్రికలు ప్రశంసలు కురిపించాయి. ఇందులో తెలియంది ఏముందని కొందరు విమర్శకులు పెదవి విరిచారట.అయితే రచయిత జాన్సన్ అదీ ఒక అభినందనగానే స్వీకరించారు. అందరికీ తెలిసిందే మరింత బాగా తెలియజేయడం తన ఉద్దేశమని వివరించారు.

ఇంతకూ ఈ పుస్తకం చదువరులపై గొప్ప ప్రభావమే చూపించింది. బ్లాంచర్డ్ అలాటి ఒక ఉదాహరణను 'ముందుమాట'లో పొందుపర్చారు. చార్జీజోన్స్ ఎన్‌బిసి- టివిలో ఒలింపిక్స్‌కు సంబంధించిన ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్‌ను కవర్ చేసేవాడు. అనుకోకుండా అతన్ని యాజమాన్యం ఈత పోటీల కవరేజికి పంపించింది. వాటి గురించి తనకు సరిగ్గా తెలియదన్న భయంతో అతను నిరాశలో మునిగిపోయాడు. ఆగ్రహం, అనాసక్తి ఆవరించాయి. అలాటి తరుణంలోనే 'హూ మూవ్డ్ మై చీజ్' చదివాడు. వెంటనే తనను చూసి తనే నవ్వుకుని కొత్త బాధ్యతలకు సిద్ధమై పోయాడు. తర్వాత అతను ఎంతగా రాణించాడంటే వేర్వేరు పదవులు వెతుక్కుంటూ వచ్చాయి. ప్రసిద్ధ క్రీడా విలేకరుల సరసన అతని ఫోటో చేరింది. అనుకోని సంక్షోభాలు ఎదురైె తల్లడిల్లిపోతున్నప్పుడు ఆత్మీయంగా భరోసా ఇచ్చే అతి సన్నిహిత నేస్తం వంటిది ఈ పుస్తకం అంటాడు బాల్చర్డ్.

ఇక పుస్తకంలోకి వస్తే - చికాగో నగరంలో ఒక ఆదిత్యుని ఆదివారం (సన్నీ సండే అంటాడు రచయిత. అదే ఆయన శైలిలో మాధుర్యం) ఆప్తమిత్రులందరూ మధ్యాహ్నపు విందుకోసం కలుసుకుంటారు. చిన్నప్పటితో పోలిస్తే జీవితం చాలా మారిపోయిందంటూ ఏంజెలా సంభాషణ మొదలెడతాడు. కుటుంబ వ్యాపారం తీసుకుని బాగా సంపాదిస్తున్న నాథాన్: కూడా ఎప్పుడూ ఏవేవో మార్పులు మలుపులతో పోరాడవలసి వస్తుందంటాడు. మనందరం మార్పు అంటే భయపడిపోతామంటాడు ఫుట్‌బాల్ ఆటగాడు కార్లోస్. ఇవన్నీ విన్నాక మైకేల్ మార్పులకు భయపడనవసరం లేదని తను విన్న కథ ద్వారా తెలుసుకున్నానంటూ అసలు కథ చెప్పడం మొదలెడతాడు.

ఈ కథలో నాలుగే పాత్రలుంటాయి. అందులో రెండు చిట్టెలుకల వంటి ప్రాణులు. ఒకదాని పేరు స్నిఫ్అంటే బాగా వాసన పసిగట్టగలది). మరో దాని పేరు స్కర్రీ(వేగంగా పరుగెత్తేది). తక్కిన ఇద్దరూ వేలడంత మనుషులు. వారిలో ఒకడి పేరు హెమ్. మరొకడి పేరు హ్యా. బాగా చిన్నగా వుండటం చేత ఈ నలుగురు ఏం చేసేది ఇతరులకు కనపించదు. కాని ఈ అతి పొట్టి జీవులు అద్భుతమైనవేవో చేస్తూనే వుంటారు. రోజూ ఒక విశాలమైన స్థలంలో ప్రవేశించి తమకెంతో ప్రియమైన పదార్థం ఆస్వాదిస్తూ వుంటారు. రెండు బుల్లి ప్రాణులూ, ఇద్దరు అల్ప జీవులూ కలసి 'సి' అనే గోడౌన్‌లో సమృద్ధిగా వున్న జున్నును తింటుంటారు. ఆ స్థలానికి చేరుకోవడం సులభమేమీ కాదు. అనేక దోవలు తిరిగి దొంతరలు దాటితే గాని రుచికరమైన ఆ పదార్థం లభించదు. అక్కడ ఒకసారి తప్పిపోతే బయటకు రావడం కూడా కష్టమే. అయినా నాలుగు జీవులూ ఒకసారి ఆ ప్రదేశాన్ని గుర్తించిన తర్వాత రోజూ ఠంచనుగా వెళ్లి హాయి హాయిగా నంజుకు తినేవారు. మొదట స్నిఫ్ వాసన పసిగట్టి

దారి చూపించాక రెండూ రంగంలో దిగిపోయేవి. ఇద్దరు అల్ప మానవులు మాత్రం తమ తెలివైన బుర్రలతో అతిగా ఆలోచించి ఆలోచించి అక్కడకు చేరేవి. ఇలా ఒకసారి 'సి' అనే గోడౌన్ వంటి ప్రదేశాన్ని చూశాక వాటి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. 'ఇంత జున్ను దొరికితే మహదానందం' అని అక్కడ గుర్తు రాసిపెట్టుకున్నాయి. చిట్టెలుకల వంటి అల్పప్రాణులకు ఈ గొడవలేమీ లేవు. అవి రోజూ తమ పద్ధతిలో తాము సహజ సిద్ధంగానే చాలా త్వరగా లేచి సి గోడౌన్‌లో చేరిపోతాయి. కాని హెమ్, హ్యాలు బద్ధకంగా లేచి ఆవులించుకుంటూ ఆలస్యంగా ఎప్పుడో అక్కడకు చేరుకుంటారు. జున్ను నిల్వలు ఎప్పటికీ తరగవనే ధీమాతో తమ కాళ్లకున్న చెప్పుల వంటి పరికరాలు కూడా విసిరేశారు.

సాగినంత కాలం ఇదంతా బాగానే వుంది... కాని ఒకరోజు స్నిఫ్, స్కర్రీలు వచ్చే సరికి అక్కడ జున్నుస్టాక్ లేదు. అంతా ఖాళీగా కనిపించింది. వాటికి పెద్ద తెలివి తేటలు లేవు. విపరీతమైన విశ్లేషణలు వాటికి చేతకావు. కాస్సేపు చూసి వెంటనే జున్ను దొరికేచోటు వెతుక్కుంటూ కదలిపోయాయి. హెమ్, హ్యాలు ఆలవాటు ప్రకారం ఆలస్యంగా లేచి కులాసాగా పాటలు పాడుకుంటూ వచ్చేసరికి జున్ను స్టాక్ లేకపోవడంతో గుండె ఆగిపోయింది. నా హెమ్ జున్ను తీసేసింది ఎవరు అని అరిచాడు. ఇది చాలా అన్యాయం అని ఆక్రోశించాడు. హ్యాకు కూడా అలాగే వుంది గాని అతను ఆలోచనలో పడ్డాడు. ఇద్దరూ ఊరికే బాధపడుతూ కాలం గడిపేశారు. వారికి ఆ జున్ను ప్రాణ ప్రదం. అది వారి ఆశలకూ ఆకాంక్షలకూ సంకేతం. కొందరు సంపద కోరుకోవచ్చు. మరికొందరు ఆరోగ్యం ఇంకా కొందరు అధికారం ఏదైనా కోరుకోవచ్చు. అలాంటిది తప్పిపోయిందంటే వారిలో విపరీతమైన బాధ వేదన పెల్లుబుకుతాయి. అందుకే జున్ను లేకుండా పోయిందంటే తట్టుకోలేక పోతున్నారు. తమకు ఇంత అన్యాయం జరిగిందేమిటని చిందులేస్తున్నారు. తలబాదుకుంటున్నారు. చివరకు హ్యా తేరుకున్నాడు. గోడ మీద ఇలా రాశాడు. 'మీకు జున్ను ఎంతో ముఖ్యం కనక మీరు దానికే అంటిపెట్టుకోవాలనుకుంటారు' తర్వాత కొద్ది రోజుల పాటు వారు అక్కడకు వస్తూ పోతూ వున్నారు. కొద్ది రోజులు గడిచిన తర్వాత హ్యా వాస్తవ ప్రపంచంలోకి వచ్చాడు. ఈ రెండు చిట్టెలుకలు స్నిఫ్ స్కర్రీ ఎక్కడకు పోయాయని ప్రశ్నించాడు. 'తెలివి లేని ఆ ప్రాణులు ఏమైపోయాయో వాటి గొడవెందుకు' అని కస్సుమన్నాడు హెమ్. ఈ లోగా స్నిఫ్ స్కర్రీలు బాగా తిరిగీ తిరిగీ 'ఎన్' అనే గోడౌన్‌లో కొత్త జున్ను స్టాక్ వుందని పసిగట్టాయి. ఆనందంగా దాన్ని ఆరగించడంలో మునిగిపోయాయి.

హెమ్,హ్యాలు మాత్రం ఇంకా విచార పర్వంలోనే వున్నారు. ఇక్కడ నుంచి వెళ్లడం సులభం కాదు. నేను అంత సాహసం చేయలేను అంటూ హెమ్ భీష్మించి కూచున్నాడు. దాంతో హ్యా కూడా చేయగలిగింది లేకపోయింది. ఇద్దరూ కొన్ని రోజుల పాటు రోజూ అక్కడకే రావడం, నిరాశగా తిరిగిపోవడం... క్రమేణా నీరసం వచ్చింది. కదలలేనంత బలహీనమై పోయారు. నిద్ర పట్టడం లేదు. ఇలా చాలా కాలం గడిచాక హ్యా లో కొత్త ఆలోచన మొదలైంది. 'మన చెప్పులు ఎక్కడున్నాయి' అని అడిగాడు. చూడబోతే నీవు మరోచోటికి పోవాలనేట్టున్నావే అని సందేహంగా ప్రశ్నించాడు హెమ్. 'తప్పదు. మనం మారకపోతే మనుగడే వుండదు' అని గోడపై రాశాడు హ్యా. కాని హెమ్ దాన్ని చూడటానికి ఇష్టపడలేదు. చివరకు హ్యా ఒక్కడే మళ్లీ ఆ విశాల క్షేత్రంలో వెతుకులాటకు బయిల్దేరాడు. అతనికీ భయంగానే వుంది. అయితే ఆలోచించి 'నీకు భయమే లేకపోతే ఏం చేసి వుండేవాడివి' అని గోడపై రాసి ప్రశ్నించుకున్నాడు. నిర్భయంగా అన్వేషణ సాగించాల్సిందేనని అర్థమైంది. అసలు జున్ను మొత్తం ఒకేసారి అదృశ్యం కాలేదని, అందుకు సంబంధించిన సూచనలు కన్పిస్తున్నా నిర్లక్ష్యం చేశామని గుర్తు చేసుకున్నాడు. (చిట్టెలుకలు మాత్రం ముందే పసిగట్టి వెళ్లిపోయాయి) నిజంగా ఆ మార్పులను తను సకాలంలో గుర్తించి వుంటే ఇంతగా కదిలిపోయి వుండేవాణ్ని కాదనుకున్నాడు. కాని అలాంటి సూచనలు కనిపిస్తే భరించలేనన్న భయమే తనను వెనక్కు లాగిందని గ్రహించాడు. తన స్నేహితుడికి దారి తెలుసుకోవడానికి కూడా పనికి వస్తుందనుకుంటూ తర్వాత గోడపై మరో వాక్యం రాశాడు. "కొత్త దారిలో పోవడం వల్ల నీకు మరింత కొత్త జున్ను దొరుకుతుంది 'భయం నుంచి బయిటపడి కోరుకుంటున్నది దొరికిందనుకుంటే ఎంత సంతోషంగా వుంటుందో ఒకసారి వూహించుకున్నాడు. దొరకబోయే జీవామృతం గురించిన ఆలోచనే మహదానందం కలిగించింది. ఆ నూతన శక్తితో వడివడిగా ప్రయాణించి ఒక చోటికి చేరాడు. అక్కడ కొద్దిపాటి జున్ను వుంది గాని అంతకు ముందే ఎవరో తినేశారు. తాను వెనక బడిపోయాయని త్వరగా వెళితే వేరొకచోటైనా తన కోర్కె సిద్ధించవచ్చునని విశ్వాసం కలిగింది. కష్టపడి హెమ్ దగ్గరికి వెళ్లి కొద్ది జున్ను ఇచ్చి తనతో రమ్మన్నాడు గాని అతను వినలేదు. 'నేను ఇక్కడే వుంటాను. ఎందుకు దొరకదో చూస్తాను' అన్నాడు మొండిగా. విధిలేక హ్యా తన దారిన తను ముందుకు సాగాడు.

ఎట్టకేలకు ఆ అతి పొట్టి మనిషి హ్యా కోరుకున్న జున్ను గోడౌన్ చేరుకోగలిగాడు. అంత పుష్కలమైన, రకరకాల రుచులు గల జున్ను నిల్వలు అతనెప్పుడూ చూసి వుండలేదు! అక్కడ స్నిఫ్, స్కర్రీలు అతనికి స్వాగతం పలికి మనసారా ఆహ్వానించాయి. దొరికిన జున్నును ఆనందంగా ఆస్వాదిస్తూ అతను గతాన్ని నెమరేసుకున్నాడు. మార్పును పసిగట్టలేకపోవడం, జరిగిన తర్వాతైనా దానికి సిద్ధం కాలేకపోవడం, నిష్కారణమైన భయంతో ఇష్టమైంది కోల్పోవడం ఎంత పొరబాటో తల్చుకుని తనలో తను నవ్వుకున్నాడు. తమలా 'గొప్ప తెలివి తేటలు' లేని స్నిఫ్ స్కర్రీలు అలవోకగా వాస్తవ పరిస్థితికి అలవాటు పడ్డాయి తప్ప లోతైన విశ్లేషణల్లో కూరుకుపోలేదు. వాటికన్నా తెలివి ఎక్కువున్నందువల్ల ఎక్కువ సుఖపడాల్సిన తను అతిగా ఆందోళన పడి ఇక్కట్లను తెచ్చిపెట్టుకున్నాడు.

జీవితంలో మార్పులు ఎప్పుడూ వస్తూనే వుంటాయి. వాటిని ముందుగా పసిగట్టాలి. వాటిని ఎదుర్కోవడానికి సానుకూలంగా ఉపయోగించుకోవడానికి సిద్ధం కావాలి. అంతేతప్ప మార్పు రానేకూడదనుకోవడం, మార్పులను చూసి తల్లడిల్లిపోవడం, తలకిందులై పోయిందనుకోవడం బుద్ధిశాలులు చేయవలసింది కాదు. మార్పును వూహించగలిగితే ఆహ్వానించడం, ఆపైన దానికి ఆనందించడం సుసాధ్యమవుతుంది. అవరోధాలనుకున్నవి అవకాశాలుగా అలరిస్తాయి. ఇప్పుడు దొరికిన జున్నును ఆరగిస్తూనే తర్వాత ఎక్కడ దొరుకుతుందా అని వెతకడం మొదలెట్టాడు. ఇవన్నీ అయ్యాక హ్యా తన స్నేహితుడికోసం మరో వాక్యం రాశాడు 'నీ కిష్టమైన దానితో పాటు ముందుకు వెళుతూ ఆస్వాదించు'

కథ చెప్పిన మైకేల్ విందులో మిత్రులను 'అంతా విన్నాక మీకు ఏమనిపిస్తుంది అని అడిగాడు. ఏంజిలో ఇంకా సూటిగా' ఇందులో స్నిఫ్, స్కర్రీ, హ్యా, హెమ్‌లలో ఎవరిలో మీరు కనిపిస్తున్నారు అని అడిగాడు. మిత్రులలో ఎక్కువమంది తాము మార్పును ముందే వూహించి సిద్ధం కాలేకపోయామని అంగీకరించారు. తమ తమ అనుభవాలు వివరించారు.. హెమ్ నీరసిస్తూ అక్కడే వుండిపోయాడా లేక ఎప్పటికైనా తన మరో మిత్రుని దగ్గరకు చేరగలిగాడా అని తర్కించుకుని మార్పును ఆహ్వానించలేని వారు శూన్యస్థితిలోనే నలిగిపోతారని నిర్ధారణకొచ్చారు. తమలోనూ ఆ లక్షణాలు రకరకాల రూపాల్లో వున్నాయని గుర్తించి నవ్వుకున్నారు. ఈ కథ కుటుంబాలకూ అన్ని రకాల సంస్థలకూ వర్తిస్తుందని, ఇది ముందే వినివుంటే ఇంకా బాగుండేదని చెప్పుకున్నారు.

మార్పును ముందుగా వూహించు. మార్పుకు తగినట్టు త్వరితంగా జీవితం మల్చుకో. మార్పును ఆస్వాదించు. ఎప్పటికప్పుడు మారడానికి సిద్ధంగా వుండు అన్న నాలుగు సూత్రాలతో పుస్తకం ముగుస్తుంది. చిన్న సైజులో పెద్ద అక్షరాలతో మధ్య మధ్య చాలా ఖాళీతో వంద పేజీలు కూడా లేని ఈ పుస్తకం వందేళ్ల జీవితానికి కావలసిన వాస్తవిక దృక్పథాన్ని అందిస్తుంది. చందమామ కథకన్నా తేలిగ్గా నడుస్తుంది. ఇంగ్లీషులో వున్నా తెలుగులాగే సులభంగా నడుస్తుంది. మార్పును తట్టుకోలేనివారు, నూతనత్వాన్ని ఆహ్వానించలేనివారు ఈ పుస్తకాన్ని చదివితే చాలా మేలు జరుగుతుంది. అమెరికా శైలిలో అతి తేలిక చేసినట్టు అనిపించినా అదే దీని బలం కూడా. లోతైన విషయాలు సులభంగా చెప్పడం ఎలాగో అర్థం కావడానికి రచయితలు పాత్రికేయులు కూడా చదవొచ్చు.

who moved my cheese?
Dr. spencer johnson
ps: 150/-, pages: 96.
for copies: prajasakthi book house.

ఆరోగ్యం

ఈనాడు పిల్లల సంరక్షణ విషయంలో వైద్యశాస్త్రం ఎంతో పురోగమనం సాధించింది. తల్లి గర్భం ధరించిన దగ్గర నుండి బిడ్డ పుట్టేవరకు...ఆ తర్వాత తగిన జాగ్రత్తలు తీసుకుంటే అంతా సాఫీగానే సాగిపోతుంది. అనారోగ్యం కలిగిన వెంటనే చికిత్స అందిస్తే ఏ బాధా ఉండదు. కావలసిందల్లా తల్లిదండ్రులకు శిశు సంరక్షణ గురించి అవగాహన. మరి ఆ విషయాలేంటో ఈ వారం తెలుసుకుందాం.

చిన్నపిల్లల్లో వచ్చే వ్యాధులు నివారణ

చిన్న పిల్లల్లో అతిసార వ్యాధి (డయేరియా) తరచుగా కనబడుతుంది. అతిసార వ్యాధి కొందరిలో తేలికగా తగ్గిపోతే మరికొందరిలో ప్రాణాంతకంగా కూడా మారుతుంది. 5 సంవత్సరాల లోపు పిల్లల్లో సాధారణంగా సంవత్సరంలో కనీసం 2-3 సార్లైనా ఇది కనబడుతుంది. రోజు 3 లేదా అంతకు మించి నీళ్ల విరేచనాలు అవడాన్ని అతిసార వ్యాధిగా గుర్తించవచ్చు. ఇది సాధారణంగా ఆకస్మాత్తుగా మొదలవుతుంది. విరేచనాలు గట్టిగా కాకుండా పలచగా, నీళ్లగా ఉంటాయి. సాధారణంగా ఈ వ్యాధి మూడు రోజుల నుండి 7 రోజులు ఉంటుంది. కొందరిలో ఈ వ్యాధి క్రానిక్‌గా కూడా ఉండవచ్చు. నీళ్ల విరేచనాలను డయేరియా లేదా అతిసార వ్యాధి అనగా, బంక విరేచనాలను డిసెంట్రి అంటారు. డిసెంట్రిలో విరేచనంతో పాటు జిగురు పడుతుంది. రక్తం కూడా వస్తుంది. పొత్తి కడుపులో నొప్పి అనిపిస్తుంది. విరేచనానికి వెళ్లినప్పుడు కాస్త ముక్కడం కూడా ఉంటుంది. డిసెంట్రినే 'కొలైటిస్' అని కూడా అంటారు. అతిసార వ్యాధిలో విరేచనం నీళ్లగా ఉన్నప్పటికీ కలరాలోని నీళ్ల విరేచనాలు మరింత నీళ్లగా ఉంటాయి. నీళ్ల విరేచనాలతో పాటు వాంతులు కూడా ఉంటాయి. విరేచనాలు పెద్ద మోతాదులో ఉంటాయి. డీహైడ్రేషన్ చాలా త్వరితంగా ఏర్పడుతుంది. అతిసార వ్యాధిలో నీళ్ల విరేచనాలతో పాటు వాంతులు కూడా కలసి ఉంటే గ్యాస్ట్రో ఎంటరైటిస్ అంటారు. దీన్నే అతి సామాన్యంగా జిఇ అంటారు.



డాక్టర్ బోడేపూడి శ్రీకాంత్
పిల్లల వైద్య నిపుణులు.
నిఖిల్ ఆసుపత్రి,
బాలాజీనగర్, ఖమ్మం
సెల్ నెం: 9849534443.

అతిసార వ్యాధి కారక క్రిములు

అతిసార వ్యాధి బాక్టీరియా క్రిముల వల్ల, వైరస్ క్రిముల వల్ల కలుగుతుంది. కొందరికి కడుపులో పాములు తయారవ్వడం వల్ల, ఎమీబియాసిస్ వల్ల విరేచనాలు అవుతాయి. చిన్నపిల్లల్లో వైరస్ ఇన్‌ఫెక్షన్ వల్ల అతిసార వ్యాధి కలగడం ఎక్కువ. అతిసార వ్యాధి కలిగిన పిల్లల్లో కొద్దిపాటి జ్వరం రావచ్చు. బిడ్డలో నలత కనబడవచ్చు. కొందరు పిల్లల్లో అతిసార వ్యాధి కనబడినప్పుడు ఫిట్స్ కూడా బయటపడవచ్చు.

గమనించాల్సిన లక్షణాలు

అతిసార వ్యాధికి గురైన బిడ్డలో అతిదాహం, కళ్లు గుంటలు కావడం, పెదాలు, నాలుక ఎండిపోయి ఉన్నాయా, నాడి వేగంగా కొట్టుకుంటోందా, నిదానంగా కొట్టుకుంటోందా, చేతి వేళ్లు పాలిపోయి ఉన్నాయా, బిడ్డలో బరువు తగ్గిపోయిందా, సాధారణ ఆరోగ్య పరిస్థితి క్షీణించిందా, చర్మం ముడతలుగా మారిందా, జ్వరం ఉందా, లేదా, ఇతర బాధలు ఏమైనా ఉన్నాయా అనేవి గమనించాలి.

అతిసార వ్యాధి నివారణ

అతిసార వ్యాధికి గురైన బిడ్డకి తాగడానికి నీరు ఎక్కువగా ఇవ్వాలి. తల్లిపాలు మానకూడదు. మామూలుగా ఆహారం పెట్టాలి. అతిసార వ్యాధికి గురైన బిడ్డకు నీళ్లు, తల్లిపాలు, ఆహారం ఈ మూడు అతి ప్రధానమైనవి. వీటిని ఇవ్వడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం కూడదు. డీహైడ్రేషన్ లక్షణాలు ఏర్పడితే నరానికి సెలైను పెట్టాలి. అతిసార వ్యాధికి గురైన బిడ్డకి తగిన మోతాదులో ఉప్పు, పంచదార కలిపిన నీరు అధికంగా ఇవ్వడమే తప్ప వేరు యాంటిబయాటిక్ మందులు అవసరం లేదు. కాచి చల్లార్చిన గ్లాసు నీళ్లల్లో చిటికెడు ఉప్పు, రెండు చెంచాల పంచదార కలిపి తాగించాలి. విరేచనాలు తగ్గడానికని ఓపియేడ్స్, కోడిన్, లోపరమైడ్ వంటి మందులు ఏవీ వాడకూడదు. అసలు యాంటిబయాటిక్ మందులు అవసరం లేదు.

ఉబ్బసం

ఉబ్బసాన్నే వాడుకలో 'ఆస్మా' అంటారు. చిన్న పిల్లల్లో ఉబ్బసం సాధారణంగా కనబడే వ్యాధి. ఉబ్బసం వచ్చిన వాళ్లల్లో శ్వాసకోశ నాళాల లోపల ఇన్‌ఫ్లమేషన్ పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితి ఏర్పడినప్పుడు శ్వాసకోశనాళాల లోపలి పొరల్లో నీరు చేరి ఉబ్బినట్లు అవుతుంది. దాంతో శ్వాసకోశ నాళాలు చాలా వరకు మూసుకుపోయినట్లు అవుతాయి. శ్వాసకోశ నాళాల మార్గం సన్నగా మారుతుంది. తేలికగా శ్వాసకోశాల్లోకి గాలి చేరడం, తిరిగి బయటకు రావడం జరగదు. ఇటువంటి పరిస్థితినే శ్వాసకోశ నాళాలలో ఇన్‌ఫ్లమేషన్ అంటారు. ఇన్‌ఫ్లమేషన్ దీర్ఘకాలంగా ఉండవచ్చు. లేదా కొంతకాలం లేకుండాపోవడం, మళ్లీ రావడం ఉండవచ్చు. శ్వాసకోశ నాళాలలో ఇన్‌ఫ్లమేషన్ ఏర్పడినప్పుడల్లా ఉబ్బసం బాధలు తలెత్తుతూ ఉంటాయి.

ఉబ్బసం ఎందుకు వస్తుంది?

ఉబ్బసం రావడానికి వంశపారంపర్య లక్షణం, ఇమ్యూనిటి లోపించడం కారణాలు. కొన్ని పదార్థాలకు, కొన్ని పరిస్థితులకు ఎలర్జీ ఏర్పడుతుంది. ఊపిరితిత్తులలోని గాలి గొట్టాలు ఇటువంటి ఎలర్జీ పరిస్థితులకి

సెన్సిటివ్‌గా ఉంటాయి. ఉబ్బసం పరిస్థితి లేనివాళ్లల్లో ఈ ఎలర్జీ పరిస్థితులు ఎటువంటి ప్రభావం చూపించవు. కాని ఉబ్బసం పరిస్థితి ఉన్నవాళ్లల్లో ఈ ఎలర్జీ పరిస్థితులు అతికొద్దిగా ఉన్నప్పటికీ శ్వాసనాళాల గొట్టాలు చాలా సెన్సిటివ్‌గా తయారవుతాయి. క్షణాల్లో శ్వాసనాళాల్లో పొరలు వాచిపోవడం, ఉబ్బిపోవడం, మూసుకుపోవడం జరుగుతుంది. ఉబ్బసం రోగుల్లో కొన్ని వైరల్, బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు, ఎలర్జిన్స్, దుమ్ము, ధూళి, వాయువులు, రసాయనికాలు, మందులు, మానసిక పరిస్థితులు ఉబ్బసాన్ని కలిగిస్తాయి. ఉబ్బసం అందరిలోను ఒకలాగా ఉండదు. అలాగే ఉబ్బసం ప్రతీసారి తీవ్రంగాను రాదు. చాలా తక్కువలో రావచ్చు. కొందరికి ఉబ్బసం అప్పుడప్పుడు వస్తూ ఉంటే మరికొందరికి విడవకుండా ఉంటుంది. ఇందువల్ల ఉబ్బసాన్ని నాలుగు రకాలుగా వర్గీకరించారు.

న్యుమోనియా

న్యుమోనియా వ్యాధి, బాక్టీరియా, వైరస్, ఫంగస్, పేరసైట్స్ వల్ల రావచ్చు. భారతదేశం లాంటి దేశాల్లో బాక్టీరియా క్రిములు వల్ల న్యుమోనియా రావడం ఎక్కువ. అభివృద్ధి చెందిన దేశాల్లో వైరస్ క్రిములు వల్ల న్యుమోనియా రావడం ఎక్కువ. బాక్టీరియా క్రిములలో స్ట్రెప్టోకోకస్ న్యుమోనియా, స్టెఫలోకోకస్ ఆరియస్, హీమోఫిలస్ ఇన్‌ఫ్లూయింజా ముఖ్యమైనవి. న్యుమోనియా వచ్చిన వాళ్లల్లో జ్వరం, దగ్గు, ఆయాసం అధికంగా ఉంటాయి. బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లలో న్యుమోనియా ఆకస్మాత్తుగా రాగా వైరల్ న్యుమోనియా నిదానంగా వస్తుంది. బాక్టీరియల్ న్యుమోనియాలో సరైన మందు పడితే తప్ప వ్యాధి త్వరగా లొంగదు. వైరల్ న్యుమోనియాలో దానికంతటికి అదే త్వరగా తగ్గుతుంది. బాక్టీరియల్ న్యుమోనియాలో జ్వరం ఎక్కువగా ఉంటుంది. టాక్సీమియా కూడా ఎక్కువగా ఉంటుంది. ఆయాసం, పిల్లికూతలు కూడా ఎక్కువగా ఉంటాయి.

చికిత్స

లోయర్ రెస్పిరేటరి ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లకి కారణం గుర్తించి దాని ప్రకారం చికిత్స చేయాలి. వైరల్ ఇన్‌ఫెక్షన్లకి మందులు లేవు. వైరల్ ఇన్‌ఫెక్షన్లతో పాటు బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు కూడా చోటు చేసుకుంటే వాటికి యాంటిబయాటిక్ మందులు వాడాలి. అప్పర్ రెస్పిరేటరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లలో అంతగా యాంటిబయాటిక్ మందులు అవసరం ఉండదు. కేవలం ఉపశాంతిగా మందులు వాడితే సరిపోతుంది. లోయర్ రెస్పిరేటరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లలో బిడ్డ పరిస్థితిని బట్టి సరైన వైద్య చికిత్స అందించాలి. బ్రోంఖియల్ స్పాజం ఉంటే నెబ్యులైజేషన్ అవసరం. కొన్ని సందర్భాల్లో ఆక్సిజన్ కూడా సప్లిమెంట్ చేయాలి. న్యుమోనియా విషయంలో కూడా జాగ్రత్తగా చికిత్స చేయాలి. ఎక్యూట్ రెస్పిరేటరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్ విషయంలో ఛాతి ఎక్సరే రక్తపరీక్ష, స్ఫూటం కల్చర్ పరీక్షలు అవసరం అవుతాయి. బిడ్డ పరిస్థితిని బట్టి మందులు ఉంటాయి. అవసరమైతే బిడ్డను ఆసుపత్రిలో చేర్చి సరైన చికిత్స అందించాలి.

నివారణా మార్గాలు...

ఈ రోజుల్లో ఉబ్బసానికి క్షేమకర మందులు, చికిత్సా విధానాలు ఉన్నాయి. ఎన్ని మందులు ఉన్నప్పటికీ ఉబ్బసాన్ని తెచ్చిపెట్టే పరిస్థితులను గమనించి వాటిని దూరం చేయడం అవసరం. ఉబ్బసం తీవ్రతను బట్టి చికిత్స ఉంటుంది. ఇది వరకు ఉబ్బసానికి చికిత్సగా ఇంజక్షన్లు, బిళ్లలు, సిరప్స్ వాడకం ఉండేది. ఆధునిక వైద్య ప్రగతిలో ఉబ్బసం, చికిత్సా విధానాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఇప్పుడు ఇంజక్షన్లు, బిళ్లలు, సిరప్స్ వాడకుండా ఇన్‌హేలర్స్, నెబ్యులైజర్స్, స్పేసర్స్ వాడుతున్నారు. ఇంజక్షన్లు, బిళ్లలు, సిరప్స్ కంటే ఈ విధమైన చికిత్స ఎంతో క్షేమకరమైంది. చాలా త్వరితంగా ఉబ్బసం నుండి ఉపశాంతి లభిస్తుంది. ఉబ్బసం ఉన్నవాళ్లు ఇన్‌హేలర్స్, నెబ్యులైజర్స్, స్పేసర్స్ ఎలా వాడాలో తెలుసుకోవాలి. ఇవి వాడుతున్నప్పటికీ ఉబ్బసం నుండి ఉపశమనం లభించడం లేదంటే చాలా వరకు వాటిని సక్రమంగా వాడకపోవడమే. వాటిని వాడే విధానం తెలియకపోవడమే.

గొంతు, శ్వాసకోశ వ్యాధులు

రెస్పిరేటరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లుగా పేర్కొనే వ్యాధులలో దగ్గు, జలుబు, ముక్కు వెంట నీళ్లు కారడం, జ్వరం, శ్వాస ఎక్కువసార్లు తీయడం ఉంటాయి. కొందరిలో ఆయాసం, ఛాతి కండరాలు లోపలకి గుంజుకోవడం, అకస్మాత్తుగా గొంతు బిగదీయడం, గాలి అందకపోవడం, పిల్లి కూతలు లక్షణాలుంటాయి. ఎక్యూట్ రెస్పిరేటరి ఇన్‌ఫెక్షన్లు ఉన్నవారిలో తల్లిదగ్గర పాలు తాగడం గాని, ఆహారం తీసుకోవడం గాని తగ్గిపోతుంది.

సాధారణంగా వచ్చే జలుబు, దగ్గు, జ్వరాలు అప్పర్ రెస్పిరేటరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లు అవుతాయి. అప్పర్ రెస్పిరేటరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లు తక్కువ బరువుతో పుట్టిన పిల్లల్లోనూ, నెలలు తక్కువ పుట్టిన పిల్లల్లోను, పౌష్టికాహారలోపంతో బాధపడుతున్న పిల్లల్లోనూ ఎక్కువ కలుగుతాయి. ఇంట్లో తండ్రి చుట్ట, బీడీ, సిగరెట్లు కాలిస్తే కూడా ఆ పొగ వల్ల చంటి బిడ్డలకి అప్పర్ రెస్పిరేటరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లు వస్తాయి. మురికివాడల్లోనూ జన సామర్థ్యం ఎక్కువగా ఉండే చోట, వాతావరణ కాలుష్యం ఉండే ప్రదేశాల్లో నివసించే పిల్లల్లో అప్పర్ రెస్పిరేటరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువుగా కలుగుతాయి.

ఎక్యూట్ రెస్పిరేటరి ఇన్‌ఫెక్షన్ల నివారణ ఎలా?

తల్లిపాలు తాగే బిడ్డలో ఎక్యూట్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్లు తక్కువ వస్తాయి. రోగనిరోధక వ్యాక్సిన్లు (ఇమ్యూనైజేషన్) పూర్తిగా వేయించిన పిల్లల్లో ఎక్యూట్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్లు కలగడం తక్కువ. విటమిన్ 'ఎ' సొల్యూషన్ ఇచ్చిన వారిలోనూ, పౌష్టికాహారం విషయంలోనూ శ్రద్ధ తీసుకున్న పిల్లలోనూ ఎక్యూట్ రెస్పిరేటరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లు తక్కువ.

వీరి వీరి గుమ్మడి పండు

జవాబు



వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరు సోనాలి బింద్రే

చుక్కలు కలిపేద్దాం

ఏమో!

స్వామీ మరమానంద శిష్య బృదంతో రామాపురంలో అడుగు పెట్టారు. భక్తిపేరిట ప్రజలను మోసం చేస్తున్న అతని గుట్టు ఎలాగైనా రట్టు చేయాలని రాజు అనే యువకుడు అనుకున్నాడు. కానీ దొరకలేదు. కనీసం ఆయన శిష్యుణ్ణి పట్టుకుంటే ఏమైనా తెలుసుకోవచ్చని ప్లాన్ వేశాడు.

జోక్స్.... జోక్స్

"మీ గురువు గారికి వెయ్యి సంవత్సరాలని చెపుతున్నారు నిజమేనా" అని అడిగాడు రాజు.

"ఏమోనండీ, నేను వచ్చి నాలుగొందల సంవత్సరాలే అయింది" అంటూ వెళ్లిపోయాడా శిష్యుడు.

ఆర్. అరుణ్ చంద్,
నర్సాపూర్.

దాగున్నవెక్కడ

హాయ్ నేస్తాలు... ఈ బొమ్మలో బోలెడు చేపలు, సముద్ర నక్షత్రం ఉన్నాయి కదూ. కానీ దీనిలో కొన్ని వస్తువులు కూడా ఉన్నాయి. వాటిని మీరు కనిపెట్టాలి. అవి ఏంటంటే... **స్పూను, యాపిల్, కారు, పెన్సిల్, అరటికాయ, షూ, గంట, టీ కప్పు, ఇల్లు బొమ్మ, కాడతో ఉన్న పువ్వు, ఎలుక తల.**



చిత్రంలో చిత్రాలు

హాలో ఫ్రెండ్స్... మీకు కనిపిస్తున్న ఖడ్గమృగంలో బోలెడన్ని జంతువులు కనిపిస్తున్నాయి కదూ. మీరు ఆజంతువుల పేర్లన్నీ చెప్పేస్తారా.

ఏంటివి?

పిడుగులూ... కింద ఒక జంతువుంది చూశారుగా! నిజానికది జంతువుకాదు. కొన్ని వస్తువులతో ఒక జంతువు ఆకారం చేశారంతే. మరి ఆ జంతువులో ఏఏ వస్తువులు దాగున్నాయో చూద్దామా. ఆ దాగున్న వస్తువులు కూడా దాని చుట్టూనే ఉన్నాయి. వాటిని కనిపెట్టి సున్నా చుట్టండి.





కలిపేద్దాం

హాయ్ పిల్లలూ... బాక్సును నాలుగు ముక్కలుగా చేసి పడేశారు కానీ, మీరు ఆ ముక్కలను అతికించేసి మళ్లీ బాక్సు చేయండి చూద్దాం.

దారి కనుక్కోండోచ్





రెండును మూడు చెయ్యగలరా?

హాలో నేస్తాలూ... అగ్గిపుల్లలతో రెండు చతురస్రాలను చేశారు కదూ. అయితే అవే అగ్గిపుల్లలతో మూడు బాక్సులను చేయగలరా? మీకో క్లూ కూడా ఇస్తున్నాం. వాటిలో మూడు పుల్లలను జరిపితే మూడు బాక్సులను చేయొచ్చు.


క్లూ



షెడ్యూల్డ్ కులాల సంక్షేమమే నా ఊపిరి

"సంక్షేమం ఒక పవిత్ర ఆశయం. చిత్తశుద్ధితో... ఆశయ సాధన కోసం పనిచేస్తూ... షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికై పాటుపడుతూ.. విద్యార్థులకు పెద్ద ఎత్తున స్కాలర్‌షిప్‌లు.. హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచడంతో పాటు పింఛన్లు, ఇందిరమ్మ గృహాలు, భూ పంపిణీ పథకం ఇందిర ప్రభ వంటి పథకాలు అమలుచేస్తూ.. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ.. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలపై ఆధారపడిన సమసమాజ స్థాపనకు కట్టుబడి పనిచేయడంలో నిజమైన తృప్తిని పొందుతాను..."

ఈ మాటలు చెప్పినది మరెవరో కాదు సాక్షాత్తు మన రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన డా. వై.యస్. రాజశేఖర రెడ్డి గారు. ఆచరణ సాధ్యమైన వాగ్దానాలతో, అనుచరణీయమైన విధానాల రూపకల్పనతో చెప్పినది చేసే ప్రభుత్వం అని షెడ్యూల్డ్ కులాల సంక్షేమం విషయంలో మరోమారు రుజువైంది. అభివృద్ధికి, సంక్షేమానికి అనిర్వచనీయమైన సంబంధం ఉందని గుర్తించిన డా. వై.యస్. రాజశేఖర రెడ్డి గారు సమాజంలోని అట్టడుగు వర్గాల వారిని ముఖ్యంగా ఎన్నో సంవత్సరాలుగా అసమానతలను ఎదుర్కొంటున్న షెడ్యూల్డు కులాల వారందరికీ సమాజంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకోవడానికి సంపూర్ణమైన చేయూతనందిస్తున్నారు. విద్యతో సాధికారత, ఉపాధితో మనోధైర్యం, ఆర్థిక స్వావలంబనతో సామాజికోన్నతి వంటి త్రిముఖ వ్యూహంతో ప్రతీ కార్యక్రమం దళితులకు ఓ వరప్రసాదం. సామాజికంగా ఎదగడానికి ఆధారం.

రూ.337 కోట్లతో ప్రత్యేక ప్రణాళికలు

రాష్ట్రంలో దళితుల సామాజిక ఆర్థికాభివృద్ధి కోసం రూ.337.22 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. 2008-09 ఆర్థిక సంవత్సరంలో అమలు చేయనున్న ఈ ప్రణాళిక వల్ల 1,48,405 మంది దళితులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్రణాళిక ద్వారా లబ్ధిదారులు తమ భూములను అభివృద్ధి చేసుకునేందుకు వీలుగా బోర్‌వెల్స్, విద్యుత్ పంపుసెట్లు, ఉద్యానవనాల పెంపకం, పాడిపరిశ్రమ, గొర్రెల పెంపకంతో పాటు స్వయం ఉపాధి కార్యక్రమాలు అమలవుతాయి. నిర్దేశించిన యూనిట్ విలువలో 50 శాతం లేదా రూ.30 వేలకు మించకుండా, ఏది తక్కువైతే ఆ కేటగిరీలో దళితులకు సబ్సిడీ రూపంలో సహాయం అందించబడుతుంది.

పావలా వడ్డీతో రుణాలు

దళితుల సహకార ఆర్థిక సంస్థ పరిధిలో గల లబ్ధిదారులందరికీ పావలా వడ్డీ (3 శాతం వడ్డీ) రుణ పథకం అమలుకానుంది. వాణిజ్య బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని, బకాయిలు సక్రమంగా చెల్లించే లబ్ధిదారులందరికీ ఈ పథకం వర్తిస్తుంది.

దళితులకు కూడా వివిధ సంక్షేమ సంస్థల ద్వారా ఒక లక్ష రూపాయల రుణం వరకు రుణ మాఫీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనుంది. లక్షకు పైచిలుకు రుణ బకాయిలు వున్నవారు ఆర్నెల్లలోగా ఒకే పర్యాయం చెల్లిస్తే, వారికి లక్ష రూపాయల వరకు రుణ మాఫీ వర్తిస్తుంది.

ఋణ మాఫీ

మార్జిన్ మనీ, జాతీయ షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి సంస్థ, జాతీయ సఫాయి కర్మచారీల ఆర్థికాభివృద్ధి సంస్థ ద్వారా షెడ్యూల్డ్ కులముల ఆర్థికాభివృద్ధికై వెచ్చించిన ఋణములు, లబ్ధిదారునకు లక్షలోపు ఉన్న అసలు, వడ్డీ మాఫీ చేశాం. దాదాపు 17.80 లక్షల మందికి ఋణ విముక్తి కలిగించాం. లక్ష రూపాయల లోపు ఋణాలను రూ.1176.82 కోట్ల వరకు ఈ ప్రభుత్వం మాఫీ చేసింది. లక్షపైన ఋణ గ్రహీతలకు కూడా వన్ టైమ్ సెటిల్‌మెంట్ క్రింద ఋణ మాఫీ.

విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట

హాస్టళ్ళలో వసతులు

రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టళ్ళలో చదివే విద్యార్థినులకు కాస్మోటిక్ ఛార్జీలను గణనీయంగా పెంచింది. ఈ ఛార్జీలతో పాటు ప్రతీ ఏటా దుప్పట్లు, ఏడాదికి రెండు జతలకు బదులు నాలుగు జతల దుస్తులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. అలాగే హాస్టళ్ళలో విద్యుత్, నీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోంది.

గత నాలుగేళ్ళలో రెట్టింపైన ఉపకార వేతనాలు

విద్యార్థుల ఉపకార వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం పెంచింది. దీని ప్రకారం హాస్టళ్ళలో వుండే వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు రూ.740/- నుంచి రూ.962/-కు, పి.జి. విద్యార్థులకు రూ.525. నుంచి రూ.682కు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రూ.400 నుంచి రూ.520కి ఉపకార వేతనాలను పెంచింది. అలాగే డేస్కాలర్ విద్యార్థుల్లో వృత్తి విద్యా, పి.జి. విద్యార్థులకు నెలకు రూ.33 నుంచి రూ.429కి, డిగ్రీ రెండవ, మూడవ సంవత్సరం వారికి రూ.185 నుంచి రూ.240కి, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం వారికి రూ.140 నుంచి రూ.180కి స్కాలర్‌షిప్ పెంచింది.

రూ.640 కోట్లతో 313 గురుకుల పాఠశాలల నిర్మాణం

విద్యార్థులకు మంచి విద్యా బోధన అందించే ఉద్దేశ్యంతో రూ.640 కోట్లతో 313 గురుకుల పాఠశాలల నిర్మాణానికి చర్యలు తీసుకోబడ్డాయి.

120 సమీకృత వసతి గృహాల నిర్మాణం

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్ళను 120 సమీకృత హాస్టళ్ళ సముదాయాలుగా అభివృద్ధి.

హాస్టళ్ళలో మెస్ ఛార్జీల పెంపు

సాంఘిక సంక్షేమ హాస్టళ్ళలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం 2008-09 సంవత్సరానికి బస్ ఛార్జీలను 40% పెంచింది. గత సంవత్సరం కంటే ఇది 25% అదనం.

- మూడవ తరగతి నుండి 7వ తరగతి వరకు 40 శాతం, 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు 30 శాతం పెంచింది.
- డైట్ ఛార్జీలను 7వ తరగతి విద్యార్థులకు రూ.270 నుంచి రూ.338 వరకు, 8వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు రూ.330 నుంచి రూ.535 వరకు డైట్ ఛార్జీలను పెంచింది.

వసతి గృహ యస్.సి. విద్యార్థులకు ఉన్నత విద్య అభ్యసించే పథకము

2008-09 సంవత్సరం నుండి 10వ తరగతి పరీక్షలలో ఎక్కువ మార్కులు సాధించిన యస్.సి. విద్యార్థులకు కార్పొరేట్ జూనియర్ కాలేజిలలో

అవకాశం కల్పించి ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.35,000/- చొప్పున ప్రభుత్వం 4500 విద్యార్థులకు ఉన్నత విద్య అందిస్తోంది. వీరి అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.15.75 కోట్లు ప్రతి సంవత్సరం ఖర్చు చేస్తోంది.

వసతి గృహ విద్యార్థులకు ఇన్సూరెన్స్ పథకం అమలు

సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో చేరిన ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతంగా ఉండటానికి ఇన్సూరెన్స్ పథకము ప్రవేశపెట్టబడినది. దీనివలన ప్రతి విద్యార్థికి ఆరోగ్య అవసరాల నిమిత్తం రూ.5000/- నుండి రూ.50,000/- వరకు ఖర్చు చేయడం జరుగుతుంది.

ఆర్థిక ప్రగతికి నిలువెత్తు సాక్ష్యాలు

భూపంపిణీ

సమాజంలో అసమానతలను పారద్రోలే లక్ష్యంతో భూపంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరంగా అమలుచేస్తోంది. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో పంపిణీ చేసిన భూమి వల్ల 1.26 లక్షల మంది షెడ్యూల్డ్ కులాల వారికి లబ్ది చేకూరింది.

ఇందిరప్రభ

భూ పంపిణీ ద్వారా పంపిణీ చేసిన భూమిని సాగులోకి తెచ్చేందుకు రూ.300 కోట్లతో ఇందిరప్రభ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది.

దీనికింద 3.85 లక్షల అసైన్డ్ భూములను సాగు యోగ్యంగా మారుస్తున్నారు. 2008-09లో రూ.100 కోట్లతో 1.59 లక్షల ఎకరాల అభివృద్ధిని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

స్వయం ఉపాధి

షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సంస్థ ద్వారా అర్హులైన, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులను గుర్తించి వారికి గుర్తింపు పొందిన సంస్థల నుండి శిక్షణను ఇప్పించి, స్వయం ఉపాధి పథకాలకు అతి స్వల్ప వడ్డీతో ఋణాన్ని అందజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

అంబేద్కర్ జీవనధార

దళితులు నివసించే ప్రాంతాలు, జనావాసాలలో ప్రభుత్వం అంబేద్కర్ జీవనధార పథకంతో త్రాగునీటి వసతులు కల్పించింది.

- కోట్ల రూపాయల ప్రణాళికా వ్యయంతో 22.40 లక్షల జనాభా గల దళిత వాడల్లో త్రాగునీటి సరఫరా.
- 18.50 లక్షల జనాభా లబ్ది పొందే విధంగా కోట్ల రూపాయల వ్యయంతో 23 CPWS ప్రాజెక్టులు పూర్తి చేసింది.

సామాజిక అంశం

సంక్షేమ బాటలో భాగంగా రూ.50 కోట్ల వ్యయంతో సాంఘిక సంక్షేమ హాస్టళ్ళు, వసతి గృహాలలో కొత్తగా స్నానం గదులు మరియు మరుగుదొడ్ల నిర్మాణం.

రాజ్యాంగ రూపశిల్పియైన భారతరత్న, బాబాసాహెబ్ డా॥ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా షెడ్యూల్డ్ కులాల సంక్షేమంలో ప్రస్ఫుష్టమౌతోంది. దేశంలోనే ఏ రాష్ట్రము చేపట్టలేనన్ని కార్యక్రమాలు షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికై మన రాష్ట్రంలోనే అమలవుతున్నాయి.

దళితుల సంక్షేమంలో కొన్ని మైలురాళ్ళు

రాష్ట్ర జనాభాలో 16.2 శాతంగా వున్న షెడ్యూల్డ్ కులాల జీవితాల్లో వెలుగులు నిండినప్పుడే రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకుపోగలదు. ముఖ్యమంత్రి డా. వై.యస్. రాజశేఖర రెడ్డి దళితుల అభ్యున్నతిపై ప్రత్యేక శ్రద్ధ సారించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్ళు, పెన్షన్లకు భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన దళితులను అభివృద్ధి పథాన నిలబెట్టేందుకు డా. వై.యస్. రాజశేఖర రెడ్డి ప్రభుత్వం పలు పథకాలను అమలుచేస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తోంది. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం దళితుల సంక్షేమానికి పాటుపడుతూ, సాంఘిక సంక్షేమానికి రూ.2251.03 కోట్ల వ్యయంతో వినూత్న పథకాలను అమలుచేస్తోంది.

- రాష్ట్రంలో 123.39 లక్షలు ఉన్న షెడ్యూల్డ్ కులాలకు ప్రభుత్వం తన మొత్తం వ్యయంలో 16.2% కేటాయింపు
- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో రూ.2,258 కోట్లు (12.63 శాతం), 2007-08 బడ్జెట్‌లో రూ.3,660 కోట్లు (13.61 శాతం ఖర్చు)
- ఇందిరమ్మ పథకం కింద పేదవారి ఇండ్ల స్థలాల కోసం సేకరించే భూమి కోసం నిధులను రూ.10 కోట్ల నుండి రూ.500 కోట్లకు పెంచడం జరిగింది. దీని వలన ఇప్పటి వరకు 9 లక్షల మంది లబ్దిదారులకు ఇండ్ల స్థలాలు పంపిణీ
- రూ.489.10 కోట్లతో షెడ్యూల్డ్ కులాల హాస్టళ్ళకు 426 కొత్త భవనాలు
- 2003-04 సంవత్సరంలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల బడ్జెట్ రూ.134 కోట్ల నుండి 2008-09కి రూ.603 కోట్లకు పెంచడం జరిగింది. ఇప్పుడు దీనివలన 5,56,000 విద్యార్థులకు లబ్ది చేకూరింది.
- 2008-09లో హాస్టల్ విద్యార్థులకు రూ.7.60 కోట్లతో 2,53,413 జతల దుప్పట్లు, బెడ్‌షీట్‌లు సరఫరా. ఇక నుంచి ప్రతి సంవత్సరం బెడ్డింగ్ సామాగ్రి సరఫరా చేయబడుతుంది.
- రికార్డు స్థాయిలో 2,75,000 మంది విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం.

రుచి

పచ్చిపులుసు

కిచిడీ

కావలసినవి

బియ్యం - రెండు కప్పులు
పెసరపప్పు - సగం కప్పు
నెయ్యి తగినంత
పచ్చిమిర్చి - నాలుగు (రెండుగా చీల్చాలి)
కరివేపాకు - ఒక రెబ్బ
కొత్తిమీర - రెండు స్పూన్లు
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 స్పూను
ఉల్లిపాయలు - రెండు
పసుపు - తగినంత
ఉప్పు - తగినంత
క్యారెట్, బంగాళా దుంప ముక్కలు - కొన్ని

తయారుచేసే విధానం

పెసరపప్పును దోరగా వేయించుకోవాలి. వేయించుకున్న పప్పును, బియ్యాన్ని అరగంట ముందు కడిగి నానబెట్టుకోవాలి. స్టౌ మీద గిన్నె పెట్టి అందులో సరిపడా నెయ్యివేసి పచ్చిమిర్చి, కరివేపాకు, కొత్తిమీర, ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, వసువు, ఉప్పు, క్యారెట్, బంగాళాదుంప ముక్కలు వేసి మగ్గనివ్వాలి. తరువాత సరిపడా ఎసరు పోయాలి. ఎసరు కాగిన తరువాత బియ్యం పోసి బాగా వుడకనివ్వాలి. కిచిడీ తయార్. దీన్ని పచ్చి పులుసుతో తింటే బాగుంటుంది.

కిచిడీ

పచ్చిపులుసు

కావలసిన వస్తువులు

చింతపండు -200 గ్రాముల
పచ్చిమిర్చి ముక్కలు - నాలుగు
కారం- కొద్దిగా
పసుపు -తగినంత
ఉప్పు - తగినంత
కరివేపాకు, కొత్తిమీర -కొంచెం
పుట్నాలపొడి - 100 గ్రాములు
నువ్వుల పొడి - 100 గ్రాములు
బెల్లం - కొద్దిగా

తయారుచేసే విధానం

ముందుగా చింతపండు రసం తీసి వుంచుకోవాలి. అందులో కొత్తిమీర, కరివేపాకు, బెల్లం, చిన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పుట్నాల పొడి, నువ్వుల పొడి, కొద్దిగా కారం, పచ్చిమిర్చి ముక్కలు, తగినంత పసుపు, ఉప్పు కలపాలి. గిన్నెలో పోపుకు సరిపడా నూనెవేసి జీలకర్ర, ఆవాలు, ఎండుమిర్చి వేసి పోపు పెట్టుకోవాలి. ఈ పోపును ముందుగా తయారు చేసుకున్న చింతపండు పులుసులో వేయాలి. కిచిడీ రైస్‌తో దీనిని వడ్డించుకొని తినాలి. సూపర్‌గా వుంటుంది.

శనగపప్పు పాయసం

కావలసిన వస్తువులు

శనగపప్పు - పావుకిలో
బెల్లం - పావుకిలో
బొంబాయి రవ్వ -150 గ్రాములు
నెయ్యి - 150 గ్రాములు
జీడిపప్పు - 100 గ్రాములు
కిస్‌మిస్- 100 గ్రాములు
యాలకులు - నాలుగు
పాలు - పావులీటర్
పచ్చికొబ్బరి తురుము - సగం టెంకాయ

తయారు చేసేవిధానం

ముందుగా శనగవప్పును అరగంటసేపు నానబెట్టుకోవాలి. గిన్నెలో కొద్దిగా నెయ్యి వేసి బొంబాయి రవ్వను దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే గిన్నెలో నెయ్యి వేసి జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు గిన్నెలో శనగపప్పు వేసి సరిపడా నీళ్ళ

శనగపప్పు పాయసం

పోసి బాగా ఉడికించుకోవాలి. పక్కన వేరే గిన్నెలో బెల్లం వేసి కొద్దిగా నీళ్ల పోసి బెల్లాన్ని కరిగించుకోవాలి. దీన్ని ఫిల్టర్ చేసి శనగపప్పు వున్న గిన్నెలో వేయాలి. బొంబాయి రవ్వను ఇందులో కొద్దికొద్దిగా వేస్తూ కలుపుకోవాలి. లేకపోతే ఉండలు కడ్తుంది. కొద్ది సేపు బాగా రవ్వ ఉడికిన తరువాత చివరిగా పాలు, యాలకులపొడి, నెయ్యి, కిస్‌మిస్, జీడిపప్పు, పచ్చికొబ్బరి తురుము వేసి కాసేపటి తర్వాత దించేయాలి.

వాము కారా

కావలసిన వస్తువులు

మైదాపిండి - పావుకిలో
వాము - 1 స్పూను
నెయ్యి - 3స్పూన్లు
కారం- కొద్దిగా
ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం

మైదాపిండిలో 3 స్పూన్లు నెయ్యి, ఒక స్పూన్ వాము, తగినంత ఉప్పు, కొద్దిగా కారం వేసి పూరీ పిండిలా కలుపుకోవాలి. పిండిని చిన్నచిన్న బిళ్ళలుగా తీసుకొని పూరీలా మందంగా ఒత్తుకోవాలి. ఆ పూరీని చిన్నచిన్న ముక్కలుగా చాకుతో కట్ చేసి బాండీలో నూనె వేసి బాగా వేపుకోవాలి. స్నాక్స్‌గా వీటిని తీసుకోవచ్చు.

హెచ్. విజయలక్ష్మి

వాము కారా

క్రైమ్ కథ

రెడీమేడ్ డ్రస్

జైలు నుంచి విడుదలయ్యాడు సంపత్. తన దుస్తులు చూసుకుని నవ్వుకున్నాడు.చినిగిన చొక్కా ప్యాంటుకు జిప్, గుండీలు అన్నీ వాంటింగే. అతనికి శ్రమించే గుణంలేదు. జైల్లో కాలు మీద కాలేసుకుని కూర్చుందామంటే అక్కడ సిబ్బంది చూస్తూ ఊరుకోరు. అందుకే ఒళ్లు వంచాడు. ఇప్పుడు స్వేచ్ఛాప్రపంచంలోకి వచ్చాడు. ఇక డబ్బుకు వెతుక్కోనక్కర్లేదు. ఎదుటివాడి పర్సు నిండుగా ఉంటే అతని జేబు నిండుతుంది. ఆ ధైర్యంతోనే నడుచుకుంటూ బస్టాప్‌లోకి వెళ్లాడు. ప్రతివాడు హీనంగా చూసుకుంటూ పోతుంటే ఒకసారి తన బట్టలవైపు తేరిపార చూసుకున్నాడు. అతనికే అసహ్యం వేసింది. ముందు వాటిని వదిలించుకోవాలనుకున్నాడు. కిక్కిరిసిన జనాలతో ఆగి ఉన్న బస్సులోకి వెళ్లాడు. ఈడోర్‌లోంచి వెళ్లి ఆడోర్‌లోంచి బయటికి వచ్చేసరికి రెండే రెండు బిళ్లకుడుముల్లాంటి పర్సులు కొట్టేశాడు. వాటితో బస్టాప్ వెనుకకు చేరి ఒకచెట్టుకింద రెండుపర్సులు ఓపెన్‌చేసి అందులో వున్న డబ్బును తన చింకి జేబులో కుక్కేసి ఖాళీ పర్సులను మూలకు విసిరేశాడు. తిన్నగా రెడీమేడ్ దుస్తులు షాపులోకి వెళ్లాడు.అక్కడ తన సైజ్ డ్రస్, వెడల్పాటి తోలుబెల్టు అక్కడే వేసుకుని టింగురంగడులా తయారై బిల్లు కట్టేశాడు. తన చింకి దుస్తుల్ని డస్టుబిన్‌లోకి విసిరేసి రోడ్డెక్కాడు. ఆ వెంటనే కంటికి ఖరీదైన చలువకళ్లద్దాలు పెట్టుకుని ఒకసెల్‌ఫోన్ కొన్నాడు. అందులో గుర్తున్న కేడీల సెల్‌ఫోను నెంబర్లు ఎక్కించి వరుసగా కొట్టాడు.ముగ్గురు ఫోన్‌లో తగిలారు. ఆరాత్రి దాబాలో కలిశారు.

- యర్నాగుల సుధాకరరావు

తిని, తాగి "ఈరాత్రికి పెద్ద ఇల్లు కొట్టేద్దాం. అందుకే పిలిచాను. రెండేళ్లపాటు జైలు పాలయిపోయాను.దొంగతనం చేద్దామని చేతులు తీటతీటగా ఉన్నాయి. వచ్చీరాగానే రెండేపర్సులు కొట్టాను. రెండూ కలిపి పన్నెండు వేలవరకు ఉంది. అందుకే ఒకసూట్‌కేసు అందులో నాలుగుడ్రస్సులు, దోచుకోవడానికి కత్తులు, రెంచీలు... అన్నీ సమకూర్చుకున్నాను"

"దోపిడీ కోసం ఇళ్లకు పోవద్దు. ఇక్కడో బ్యాంకు కొత్త శాఖ తెరిచారు. దానికి కన్నం వేద్దాం" ఒక కేడి చెప్పాడు.

"వర్కువుట్ కాదురా, ఐరన్‌సేఫ్‌లు తెరవలేం" సంపత్ పెదాలు విరిచాడు.

"ఆబ్యాంకును అద్దెకొంపకు మార్చడానికి చాలామంది పనివాళ్లతో బీరువాలు, స్టేషనరీ సర్దించారు. నేను వర్కర్‌లా వెళ్లి వారంరోజులు పనిచేశాను. ఏది ఎక్కడుందో నాకు తెలుసు. ఈమధ్య పోలీసులు మనాటలు సాగకుండా పూర్తి బందోబస్తుల్లో ఉన్నారు. అందుకే ఇలాంటి కాయకష్టం చేసేపనులకు వెళుతున్నాను" చెప్పాడు మరొక దొంగ.

"సరే మీరు అన్నట్టుగానే బ్యాంకు కొట్టేద్దాం"

అనుకున్నట్టే మూడుగంటలు శ్రమించి అర్థరాత్రివేళ బ్యాంకులోకి చొరబడి ఒక ఐరన్‌సేఫ్ తలుపు తెరవగలిగారు. ఇరవైలక్షలు వరకు ఉంది. అది ఆబ్యాంకులోనే పంచేసుకుని వెంటనే బ్యాంకులోంచి పారిపోయారు.

మరుసటిరోజు పోలీసులు దర్యాప్తు చేశారు. అక్కడ వాసనలు పసిగట్టిన కుక్కలు మూతపడిన ఊరికిదూరంగా ఉండే రెస్టారెంటు వద్దకు పోలీసుల్ని ఈడ్చుకు వచ్చి అరవసాగాయి. తాళాలు వేసిఉన్న రెస్టారెంటును చూసి అక్కడ జనాలను ఆరాతీశారు. నాలుగునెలలుగా మూతపడిందని చెప్పడంతో పోలీసులు వెనుదిరిగారు.

బ్యాంకువారు పోలీసులకు ఫిర్యాదుచేసిన చేత్తోనే ప్రయివేట్ డిటెక్టివ్ స్వరూప్‌ను కూడా నియమించుకున్నారు. స్వరూప్ పోలీసుకుక్కలతో అక్కడికి వచ్చాడు.అవి రెస్టారెంటు చుట్టూ తిరిగాయి. పదేపదే అవి తిరిగిన వైనాన్ని గుర్తుచేసుకున్నాడు.

డిటెక్టివ్ స్వరూప్ మరుసటిరోజు రాత్రి ఆ రెస్టారెంటు ప్రాంతానికి వెళ్లాడు. చీకటిలో రెస్టారెంటుమీద ఎక్కడో వీధిదీపం వెలుగుపడుతుంటే ఏదో ఉన్నానన్నట్టు కన్పించసాగింది. అక్కడికి వెళ్లి నిశితంగా పరిశీలించాడు. గతరాత్రి దోపిడీ అయ్యాక దొంగలు వచ్చిన దాఖలాలు కూడా అక్కడ కన్పించలేదు. నేలమీద రెడీమేడ్ దుస్తులు అమ్మే లేబిల్స్ కన్పించాయి. వాటిని ఏరుకుని ఆలేబిల్ అడ్రస్ వెతుక్కుంటూ వెళ్లి అడిగాడు. నలుగురు కలిసి పన్నెండు డ్రస్సులు కొన్నారు. వాళ్లు ఎందుకో కారులోంచి దిగిరాకుండా నెంబర్లు చెప్పి దుస్తులు కొన్నారు. తర్వాత నన్ను కారు ఎక్కించుకుని పెద్దబ్యాగులో డజన్లకొద్దీ రొట్టెలు, రెండు బుట్టలతో పండ్లు రెండుకేసులలో మద్యం ఇంకా తినే వస్తువులు, మూడు సెల్‌ఫోన్లు కొనుక్కుని ఒకరకంగా కారు నింపేశారు. ఆనలుగురులో ఒకడు డ్రయివ్ చేశాడు. నాకు బట్టల బిల్ ఇచ్చాక అన్నిరకాలు కొని పెట్టినందుకు అదనంగా ఐదొందలు ఇచ్చారు"

"ఆకారు నంబర్ గుర్తుందా?"

నెంబర్ జ్ఞాపకానికి తెచ్చుకుని మరీ చెప్పాడు రెడీమేడ్ షాపువాడు. స్వరూప్ వెంటనే మూతపడిన రెస్టారెంటు వద్దకు వచ్చాడు. ఆ ఎదురుగానే ఖాళీస్థలంలో పార్కు చేసి వుందా కారు.అంటే దొంగలు ఇక్కడెక్కడైనా ఉండొచ్చు. లేకుంటే కారు వదిలి పారిపోయి ఉంటారు అని ఊహించి అక్కడే తచ్చాడాడు.అప్పటికే ఆప్రాంతం నిర్మానుష్యమైంది. జేబులోంచి సుద్దముక్క తీసి కారు టైర్లు నేలకు ఆనుకునే చోట గీతలు గీసి అక్కణ్నించి వెళ్లిపోయాడు.

ఉదయం ఆరుగంటలకు తిరిగివచ్చి కారుటైర్లను చూశాడు. వాటి స్థానాలు మారిపోయిఉన్నాయి. దోపిడీ దొంగలు ఇక్కడే ఉన్నారు. అని నిర్ధారణ చేసుకున్నాడు సెల్‌లో పోలీసులకు పిలిచాడు. వ్యాన్ నిండా పోలీసులు దిగారు. అంతా కలిసి మూతపడిన రెస్టారెంటును చుట్టుముట్టారు. ఇన్‌స్పెక్టర్ అసహనంగా స్వరూప్‌వైపు చూశాడు. "ఈరెస్టారెంటులో ఏముంటారు? నీవేదో పొరపడిఉన్నావు. ఊపిరాడక చావాలి.ఏముంబాయో పారిపోయి ఉంటారు" చెప్పి తను వాన్‌లోకి ఎక్కికూర్చున్నాడు.

స్వరూప్ పోలీసులకు సూచనలు ఇచ్చి రెస్టారెంటు తాళాలు పగల కొట్టుకుని లోపలికి దూసుకుపోయాడు. లోపల దోపిడిదొంగలు సంపత్ నాయకత్వంలో తప్పతాగి పడుకుని ఉన్నారు. వారిని లేవదీసి అరెస్టు చేశారు. వారివద్ద డబ్బు స్వాధీనం చేసుకున్నారు. ఆప్రాంతంలో నివాసం ఉన్న జనాలు తారెత్తిపోయారు. 'మన ఇళ్లమధ్య దోపిడీదొంగలా! మూడురోజులపాటున్నారా? మనమీద పడితే ఏమిచేయగలం?' అని భయపడ్డారు.

స్వరూప్ తను ఎలా పరిశోధించినది మీడియా ముందు చెప్పాడు.

"పోలీసు కుక్కలు మూతపడిన రెస్టారెంటు వద్ద పదేపదే అరిచాయి. అక్కడ నేలను వాసన చూస్తూనే ఉన్నాయి. అక్కడేదో ఉందని అనుమానంతో ఆరాత్రివెళ్లి బయటే ఉన్న కరెంటు రీడింగ్ నోట్ చేసుకున్నాను. మరుసటిరోజుకు రెండు యూనిట్లు కౌంటయ్యింది.అలాగే నల్ల అంబాసడర్ కారు టైర్లమీద సుద్దముక్క గీతలు గీశాను. ఉదయానికి అవి స్థానభ్రంశం చెందాయి. దొంగలు ఇక్కడే ఉన్నారని నిర్ధారణ అయ్యింది" అని చెప్పాడు.

అట్టమీది కథ

అగ్రరాజ్యంలో అభాగ్యులు

అమెరికాలో రోడ్లు మన బాత్‌రూముల్లా ఉంటాయని మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు గతంలో ఒకసారి వ్యాఖ్యానించారు.

'అమెరికాలో రోడ్లు ఊడ్చేవారు కూడా కారు వేసుకొని వస్తారటరా' అంటూ తమ దుస్థితిని తలచుకొని దిగాలు పడే కార్మిక సోదరులు ఇప్పటికీ ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అలాంటి అమెరికాలో ఇళ్లు, ఉద్యోగాలు కోల్పోయిన కుటుంబాలు మన సులభ కాంప్లెక్సుల్లాంటి వాటిలో కూడా స్నానాలకు డబ్బు చెల్లించలేని దుస్థితిలో, అపార్ట్‌మెంట్ల కాపాలదారులకు తృణమో ఫణమో ముట్టచెప్పి రాత్రి చేరి తెల్లవారకుండా బయటకు వెళ్లే వారు అసంఖ్యాకంగా ఉన్నారంటే ఇప్పటికీ నమ్మని వారెందరో !! మన స్కూళ్లలో మధ్యాహ్న భోజనం తినాలని ఉన్నా వండి పెడుతున్నది మన కులపోళ్లు కాదని పిల్లల కడుపు మాడ్చే తల్లిదండ్రులను మనం చూస్తున్నాం. అమెరికాలో కూడా నిన్నా మొన్నటి వరకు ఉచిత భోజనం మనం తినటం ఏమిటనుకొనే వారు ఎందరో ఉన్నారు. ఇప్పుడు ఎలాంటి సిగ్గు, మొహమాటాలు లేకుండా మా పిల్లలకు ఉచిత భోజనం సాధ్యం కాకపోతే సబ్సిడీ ఆహారం అయినా కావాలని అడుగుతున్నారు. ఎంతలో ఎంత మార్పు !

ఎం. కోటేశ్వరరావు

రాజధాని వాషింగ్టన్ ప్రాంతంలోని స్కూళ్లకు అమెరికా వ్యవసాయశాఖ వారు ఉచితంగా పళ్లు, కూరగాయలు అందచేస్తారు. ఒక్కో విద్యార్థికి 2.57 డాలర్లకు రాయితీతో కూడిన భోజనం పెడుతున్నారు. ఒకవైపు తినే పిల్లలు పెరుగుతున్నారు, వంట ఖర్చు తడిసి మోపెడౌతోంది బడ్జెట్ పెంచాలని మధ్యాహ్నభోజన డైరెక్టర్ వాషింగ్టన్ ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. నలుగురు సభ్యులున్న కుటుంబ ఆదాయం 39,220 డాలర్లకంటే తక్కువ ఉంటే వారి పిల్లలు ఉచిత మధ్యాహ్న భోజనానికి అర్హులు. ఇప్పుడు ఆ మొత్తాన్ని 27,560 డాలర్లకు తగ్గించారు. ఉచిత భోజనం చేయకపోయినా సబ్సిడీతో అందచేసే భోజనాన్ని తల్లిదండ్రులు కొనుగోలు చేసినా ఇప్పుడు వారికి ఎంతో ఊరటగా ఉంది. నూటికి 80 స్కూళ్లలో ఉచిత భోజనం కావాలన్నవారి సంఖ్య ఈ ఏడాది గణనీయంగా పెరిగినట్లు ఒక సర్వే వెల్లడించింది. గత విద్యా సంవత్సరంలో ఇలాంటి పిల్లలు మూడుకోట్ల మంది ఉన్నారు. గత ఐదు సంవత్సరాలలో ఇలాంటి పిల్లలు ఐదుశాతం పెరిగితే ఈ ఒక్కఏడాదే ఐదుశాతం అదనంగా చేరారు. ఇదీ అక్కడి సంక్షోభానికి ఒక నిదర్శనం.



వినియోగదారులు తమ కొనుగోళ్లను తగ్గించుకోవటం గత ఐదు నెలలుగా పెరుగుతోంది. డిసెంబరు 13వ తేదీతో ముగిసిన వారంలో తమకు నిరుద్యోగ భృతి లేదా సహాయం కావాలని దరఖాస్తు చేసుకున్నవారి సంఖ్య ఐదు లక్షల 56వేలు. తదుపరి వారానికి మరో 30వేలు పెరిగింది. ఇలా దరఖాస్తు చేసుకున్నవారు 1982లో మాత్రమే గరిష్టంగా ఐదులక్షల 58వేల మంది ఉన్నారు. ఇప్పుడు ఆ రికార్డు బద్దలైంది. నవంబరు నెలలో 5లక్షల 33వేల ఉద్యోగాలు రద్దు కావటంతో గత 15 సంవత్సరాలలో గరిష్టంగా 6.7శాతానికి నిరుద్యోగుల శాతం పెరిగింది. ఇక్కడ మన ప్రభుత్వం పేదలకు సబ్సిడీ బియ్యం అందచేస్తున్నట్లుగానే అమెరికాలో పేదలకు ఆహారం అందచేస్తున్నారంటే కొందరికి నమ్మకం కలగకపోవచ్చు. అలాంటి వారు ఇప్పుడు మూడు కోట్ల 16లక్షల మంది లేదా ప్రతి పదిమందిలో ఒకరు ఉన్నారు. గతేడాది కంటే వీరి సంఖ్య 17శాతం పెరిగింది. గత మూడు నెలల్లోనే 12లక్షల ఉద్యోగాలు పోయాయి.

యువత ఆందోళన

అమెరికాలో పరిస్థితుల గురించి అక్కడి యువత ఎంతగా ఆందోళన చెందుతోందో ఒక్క ఉదంతం చూడండి. పిటీ లారెన్ హ్యాబర్ వయస్సు 27. రాబోయే రోజులు మరింత దిగజారతాయోమో అన్న ఆందోళనతో అనుకున్నదాని కంటే తన వివాహాన్ని ఏడాది ముందుగానే చేసుకోవాలని ఇప్పుడు ఆతృత పడుతోంది. ఆమెకు కాబోయే వరుడు తన ఆదాయం నానాటికీ పడిపోతున్నందున పెళ్లికి చేయాలనుకున్న ఖర్చు 35వేల డాలర్లలో దేన్ని తగ్గించుకోవాలా అని ఇప్పటి నుంచే లెక్కలు వేసుకుంటున్నాడు. పెళ్లికి 3,400 డాలర్లతో కొనుగోలు చేసిన గౌను బదులు తక్కువ రకంతో సరిపెట్టుకోవాలని హ్యాబర్ దాన్ని

అమ్మివేసింది. ఫొటో గ్రాఫర్ సమయాన్ని అరగంట తగ్గించుకొంటున్నట్లు చెప్పారు. పుష్పగుచ్ఛాల సంఖ్య, పరిమాణాన్ని కూడా గణనీయంగా తగ్గించారు. చివరికి రాత్రి వివాహ విందు ఐటమ్స్‌లో కేక్, మధ్యాహ్నం ఇవ్వదలచుకున్న బ్రంచ్‌ను రద్దు చేశారు. మరికొందరు పిలిచే అతిథులను పరిమితం చేస్తున్నారు. కొందరైతే ఇంతకు ముందే కుదుర్చుకున్న ధరలను తగ్గించుకోవాలని వ్యాపార్ధులతో బేరమాడుతున్నారు. ముందే అడ్వాన్సులు ఇచ్చినందున అవి తిరిగిరావు. అందువలన కొందరు అతిథుల సంఖ్యను తగ్గించుకొంటుంటే మరికొందరు విందులో కొన్ని అయిటమ్స్‌ను తగ్గించి సరిపెట్టాలని చూస్తున్నారు. కొందరైతే వివాహ క్రతువుల్లో కొన్నింటిని తరువాత చేసుకోవచ్చంటూ వాయిదా వేస్తున్నారు. సాదాసీదాగా వివాహం చేసుకున్న వారికి ప్రభుత్వం, కార్పొరేట్ కంపెనీలు ఇచ్చే ప్రోత్సాహకాల కోసం కొందరు వివాహాన్ని మమ అనిపించేస్తున్నారు. ఒక్క రోజు పెళ్లికోసం 30,40వేల డాలర్లు తగలేసుకోవటం ఏమిటని కొందరు ఆలోచిస్తున్నారు. వివాహాలు చేయటమే వ్యాపారంగా ఉన్నవారితో ఏదో ఉన్నంతలో సాదాసీదాగా వివాహం చేసుకుంటే ఎంత ఖర్చు అవుతుందో చెప్పమని అడుగుతున్నవారే అధికంగా ఉన్నారు. అండీ వాన్స్ అనే షికాగో యువతి 2009 సెప్టెంబరులో 15-20వేల డాలర్ల మధ్య ఖర్చుతో వివాహం చేసుకోవాలనుకుంది. అయితే ఇప్పుడు అంత ఖర్చు చేసి వివాహం చేసుకోవటం కంటే ఒక ఇల్లు కొనుక్కోవటం ముఖ్యం అని భావించింది. వివాహం అంటే ఒక్కరోజు వ్యవహారం, ఇల్లు జీవితాంతం ఉంటుందంటోంది. దాంతో ఐదువేల డాలర్లకు బుక్ చేసుకున్న ఒక హాలును రద్దు చేసుకొని 150 డాలర్లతో ఒక గదితో సరిపెట్టుకోవాలనుకుంది. వివాహ సమయంలో కొత్త డ్రెస్ బదులు మార్కెట్‌లో దొరికే సెకెండ్ హాండ్ గౌనును కొనుగోలు చేయాలని, బ్యాండ్ మేళం స్థానంలో ఐపాడ్‌ను స్పీకర్లకు అమర్చాలని నిర్ణయించింది. ఆర్థిక పరిస్థితులు దిగజారటంతో వివాహ క్రతువులు నిర్వహించే వారికి, వినోద కార్యక్రమాలు నిర్వహించేవారికి కూడా సెగ తగులుతోంది. గతేడాది మొత్తంలో తాను చేసిన వివాహాలు 197 అయితే ఈ ఏడాది నవంబరు నాటికే 299 చేశానని, వస్తున్నవారంతా ఈ వారంలో ఎట్టిపరిస్థితుల్లోనూ వివాహం కావాలని వత్తిడి చేసినవారే ఎక్కువ అని న్యూయార్క్‌లోని ఒక చర్చికి చెందిన రెవరెండ్ మేరీ ఏప్రిల్ గిస్‌మోండీ చెప్పారు. ఇలా తొందరపడటానికి ఆర్థిక పరమైన కారణం కూడా ఉంది. తాను వివాహం చేసుకుంటే ఏడాదికి ఐదువేల డాలర్లను ఆరోగ్యబీమా ప్రీమియంలో మిగుల్చుకోవచ్చని ఒక యువతి చెప్పింది.

సర్దుకు పోదాం రండి

పెళ్లి చేసుకోవటానికి కొంతమంది ఎలా తొందర పడుతున్నారో చూశాము. ఇప్పుడు విడాకులు పెద్ద సమస్యగా మారటాన్ని చూద్దాం. మెర్సీ నీడిల్ తన భర్తనుంచి విడాకులు తీసుకోవాలని గతేడాది జూన్‌లో అనుకుంది. వారికి అట్లాంటా, జాక్సన్‌విల్లేలో రెండు ఇళ్లు, ఇతర ఆస్తులు ఉన్నాయి. వాటిని పంచుకోవటం ద్వారా ఎవరిదారి వారు చూసుకోవచ్చని భావించారు. అయితే ఇళ్ల ధరలు కుప్పకూలి పోవటంతో వారికి దిక్కుతోచటం లేదు. ఇతర ఆస్తుల పరిస్తితి కూడా దాదాపు అంతే ఉంది. దాంతో ఇద్దరం ఎంత సఖ్యతగా ఉండాలనుకున్నా కుదరటం లేదు. "నా ఆస్తిని కొనుగోలు చేయమని అతడిని కోరుతున్నాను. ఎందుకంటే నా ఆదాయం అది ఒక్కటే. ఇది ఇద్దరికీ మంచిది" అని నీడిల్ వాపోతోంది. నీడిల్ కంటే ఎక్కువగా ఇదైపోతున్నవారు మరి కొందరున్నారు. గతంలో మాదిరి ఉదయం వివాహం చేసుకొని సాయంత్రానికి ఛీ పో అంటే ఛాపో అంటూ తెల్లవారి లాయర్ల వద్దకు వెళ్లే పరిస్థితి ఇప్పుడు లేదు. దాంతో విడాకుల లాయర్లు తమ కేసులు తగ్గుతున్నాయని వాపోతున్నారు. విడాకులు తీసుకోవటం ఎంతో ఖర్చుతో కూడినది కావటం వలన, విడిపోతే బతకటానికి ఆస్తులు లేకపోవటంతో అనేక మంది దంపతులు ఎలాగోలా సర్దుకు పోదాం అనుకుంటున్నారు. అమెరికాలో భార్యాభర్తలుగా ఉన్నవారు ఇల్లు, లేదా ఇతర ఆస్తులు కొనుగోలు చేసినపుడు ఇద్దరి పేర్లతోనూ రిజిస్టర్ చేసుకుంటారు. విడిపోవాల్సి వచ్చినపుడు వాటిని అమ్మి ఎవరి వాటా వారు తీసుకోవటమో లేదా ఒకరి వాటాను మరొకరు కొనుగోలు చేసి పరిష్కరించుకోవటమో జరుగుతుంది. ఇప్పుడు రెండూ కుదరటం లేదు. అసలే ఎడమొహం పెడమొహంగా ఉన్నవారికి అమ్ముడుపోని ఇల్లు, ఇతర ఆస్తులు మరింత సమస్యగా మారుతున్నాయి. అయిన కాడికి అమ్ముకొందామనుకొనే వారి పరిస్థితి కూడా అంత బాగాలేదు. జాన్, లారెల్ గోయర్కాలు విడిపోదామని చట్టపరమైన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో మా ఇంటి విలువ 23లక్షల డాలర్లు ఉంటుంది. దానిపై రుణవాయిదాలు చెల్లించగా కనీసం పదిలక్షల డాలర్లు మిగులుతుందని అనుకున్నాము. అయితే అమ్మే సమయానికి దాని విలువ ఆరులక్షల డాలర్లు తగ్గింది. రెండేళ్లుగా విడాకులు కేసు నడుస్తోంది వేలాది డాలర్లు ఖర్చవుతున్నాయి. చివరికి మాకు మిగిలేదేమీ లేకుండా పోతోంది. స్వంత ఇల్లుపోయి అద్దె కొంపల్లో ఇద్దరూ బతుకుతున్నారు. వారి పేరుమీద ఉన్న ఆస్తులు తమ ఫీజుకు చాలవంటూ లాయర్లు గొడవకు దిగుతున్నారు.

వార్ ఆఫ్ రోజెస్ అనే సినిమాలో విడిపోయిన భార్యాభర్తలు ఒకే ఇంట్లో ఉంటూ తమ కొత్త జోడీలతో రోజూ ఇంటికి రావటాన్ని చూపారు. న్యూయార్క్ వెలుపల ఇలాంటివి ఎప్పుడూ చూసి ఎరగం, ఇప్పుడు నిజంగానే అలాంటి జంటలను చూస్తున్నాం అంటున్నారు అట్లాంటాకు చెందిన ప్రభుత్వ గుర్తింపు పొందిన విడాకుల ఆస్తి విశ్లేషకురాలైన లిజా డెక్కర్. విడిపోయిన భార్యాభర్తలు తమ ఇంటిని అమ్ముకోలేకపోతున్నారు. దాంతో కింది అంతస్తులో ఒకరుంటే పై అంతస్తులో మరొకరు ఉంటున్నారు. సాయంత్రమయ్యేసరికి అమ్మడు ఒక అబ్బాయితో, అబ్బాయి మరొక అమ్మడితో ఇంటికి వస్తున్నారు. దారిలో ఎదురు పడితే హాయ్ అంటూ పలకరించుకోవటం చూస్తున్నామని చెబుతున్నారు.

కాలిఫోర్నియా విడాకుల లాయర్ జేమ్స్ హెన్నాన్ హెూఫర్ మరొక కొత్త విషయం వెల్లడించారు. ఇంటి వాయిదాల చెల్లింపును తప్పించుకొనేందుకు ఎంత కాలం కలిసి ఉంటే అంతకాలం ఒకటిగా ఉందామని కొన్ని జంటలు నిర్ణయించుకుంటున్నాయట. రుణవాయిదాలు చెల్లించని వారి ఇళ్లను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అప్పుడు ఏమైనా మిగిలితే తీసుకొని విడిపోదామని అనుకుంటున్నవారు కొందరైతే, అధికారులు బలవంతంగా ఖాళీ చేసేంతవరకైనా ఉందామని నిర్ణయించుకున్నవారు మరి కొందరట. మరికొందరు మహిళల నిస్సహాయతను ఆధారం చేసుకొంటున్నవారు కూడా లేకపోలేదు. ఇంటిని పాడుపెట్టి చివరకు అతి తక్కువ ధరకు సొంతం చేసుకుంటున్న భర్తల దుర్మార్గాలు కూడా వెలుగుచూస్తున్నాయి. దీనిని గమనించిన అనేక మంది 'ఆమె'లు 'అతడి'తో గొడవపడి విడిపోవటం మంచిది కాదని లౌక్యంగా వ్యవహరిస్తున్నారు. అనేక మంది తాము విడాకులు తీసుకోవాలంటే ఇప్పటికే బేరానికి పెట్టిన ఇళ్లు అమ్ముడుపోవాలి కదా అని ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే తమ ఇంటిని కొనేవారు రావాలి కదా.

పెళ్లి ఫ్రీ.....

పర్యాటకుల సంఖ్య తగ్గిపోవటంతో రిసార్టుల యజమానులు రాయితీలు ప్రకటించక తప్పటం లేదు. తమ రిసార్టులో దిగినవారికి ఉచితంగా వివాహం చేయిస్తామని ప్రకటించిన వారు కూడా ఉన్నారు. అంటే వివాహ సమయంలో అవసరమైన కేక్, పుష్పగుచ్ఛాలు, షాంపేన్ వంటివి రిసార్టుల యజమానులే ఉచితంగా ఇస్తారు.

బిల్లు చూస్తే గొల్లుమనాల్సిందే

ఆరోగ్య సంరక్షణ సంస్కరణకే తాను అగ్ర ప్రాధాన్యత ఇస్తానని ఈనెల 21న పదవీ బాధ్యతలు స్వీకరించనున్న నూతన అధ్యక్షుడు బరాక్ ఒబామా తన ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారు. కఠోర వాస్తవం ఏమంటే 4.6 కోట్ల మందికి అమెరికాలో ఆరోగ్యబీమా లేదు. అంటే వారికి జబ్బుచేస్తే అంతకు మించిన నరకం మరొకటి ఉండదు. అర్హులైన వారికి మన సర్కార్‌లు కనీసం రేషన్ కార్డులు కూడా ఎలా ఇవ్వటంలేదో అలాగే ఏదో ఒక సాకుతో అక్కడి ప్రభుత్వం వారికి బీమా సౌకర్యాన్ని ఎగవేస్తున్నది. ప్రభుత్వమే తక్కువ బీమా ప్రీమియం చెల్లించిన పేదలకు మన ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆసుపత్రులు ఎలాంటి అరకొర చికిత్స చేస్తున్నాయో అమెరికాలో కూడా అలాగే ఉంది. డాక్టర్లు వారిని చూడటానికి కూడా ఇష్టపడరు. అమెరికాలో కంటే కెనడా, ఐరోపా దేశాలలోని ప్రభుత్వ వైద్యం చాలా మెరుగని పరిశీలకులు పేర్కొంటున్నారు. అక్కడి ఖర్చు ఎలా ఉంటుందంటే రోగులు బిల్లు చూసి గొల్లుమంటారు. ఉదాహరణకు ఎవరికైనా కాలర్ బోన్ విరిగిందంటే కనీసం మన రూపాయల్లో 20లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. మనకు కొన్ని వేలరూపాయలతో సరిపోతుంది. ఎవరికైనా సహాయం కోసం ఒక మనిషిని పెట్టుకోవాలంటే న్యూయార్క్ నగరంలో వారానికి 1900 డాలర్లు చెల్లించాలి.అంటే దాదాపు లక్ష రూపాయలు.

ఉపాధి కోసం కోటి వేషాలు

ఉద్యోగాల కోసం యువతీ యువకులు నానా గడ్డీ కరుస్తున్నారు. విసిగిపోయి యజమానులను ఆకర్షించేందుకు విపరీత పోకడలు పోతున్నారు. హౌలిహన్ లోకె బ్యాంకు లేఆఫ్ ప్రకటించిన తరువాత జాషువా పెరస్కై పదకొండు నెలలపాటు పంపని ఇమెయిల్ లేదు. కలవని కార్యాలయం లేదు. స్నేహితులు, బంధువులు, మరిచిపోయిన పూర్వస్నేహితులు, తోటి ఉద్యోగులందరికీ తనకో ఉద్యోగం ఉంటే చూడమని చెప్పాడు. న్యూయార్క్‌లోని మానహట్టన్‌లో కుటుంబానికున్న అపార్ట్‌మెంట్ నుంచి బయటకు రావాల్సి వచ్చింది. తనకున్న మంచి ఇంటర్వ్యూ సూట్ వేసుకొని దానిపై 'అనుభవం గల ఎంఐటి గ్రాడ్యుయేట్ ఉద్యోగానికి సిద్ధం' అని రాసిన బ్యానర్ ధరించి వీధుల్లో తిరగటం ప్రారంభించాడు. ఈ దృశ్యం మీడియా కెమెరాలకు చిక్కింది. ఇంకేముంది ' అమెరికా ఆర్థిక వ్యవస్థ కొత్త ముఖం' ఇదీ అంటూ అతని గురించి పుంఖాను పుంఖాలుగా టీవీల్లో చూపారు. దాన్ని చూసిన వెయిమర్ అనే కంపెనీ అతనికి ఉద్యోగం ఇచ్చింది. ఇదంతా జూన్‌లో జరిగిన ఉదంతం. ఆ తరువాత ఉద్యోగాలకు మరింత కటకట ఏర్పడింది. పెరస్కైకి వచ్చిన అవకాశాలు అందరికీ రావటం లేదు.నవంబరు నెల నుంచి డిసెంబరు ఆఖరు వరకు ప్రభుత్వరంగం నుంచి రెండులక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు.

పెరస్కైని ఆదర్శంగా తీసుకొని తాజాగా జేవియర్ పుజాల్స్ అనే యువకుడు 'ఇంటర్వ్యూను కొంటారా' అని షికాగో మర్కెంటైల్ ఎక్స్ఛేంజ్ వద్ద ఒక బ్యానర్ పెట్టాడు. ఇదెక్కడి చోద్యమయ్యా బాబూ ఇంటర్వ్యూను కొనటమేమిటంటే అది మార్కెట్ సూత్రం అంటున్నాడు. ఉద్యోగాల కోసం చాలా మంది ఎదురు చూస్తున్నారు. ఇంటర్వ్యూలు చేయటాన్ని ఉన్నతాధికారులు అసహ్యించుకుంటున్నారు. వారికి సమయం ఉండదు. ఇంటర్వ్యూలకు షెడ్యూలు నిర్ణయించాలి, సమయం కేటాయించాలి, నేను చెప్పినదాని ప్రకారం అయితే 20 నిమిషాలు పట్టే దానిని మూడు నిమిషాల్లోనే తమకు నచ్చిన వారిని ఎంపిక చేసుకోవచ్చు అని చెప్పాడు. ఆశ్చర్యకరంగా అతని బ్యానర్ చూసి వెయ్యిమంది తాము ఇంటర్వ్యూకు డబ్బు చెల్లిస్తామంటూ ముందుకు వచ్చారు. ఇలాంటివి నిజానికి కొత్త కాదు.

బ్యాట్‌మాన్ రిటర్న్స్ అనే సినిమాలో నటించేందుకు సీన్ యంగ్ అనే నటి అతి తెలివి తేటలను ప్రదర్శించి అభాసుపాలైంది. క్యాట్ ఉమన్ డ్రెస్ వేసుకొని వార్నర్ బ్రదర్స్ స్టూడియోకు వెళ్లింది. వళ్లుమండిన డైరెక్టర్ టిమ్ బర్టన్ ఆ పాత్రను మిచెల్లీ పెఫిఫర్‌కు ఇచ్చాడు. క్రియేటివ్ గ్రూప్ కంపెనీ ఇటీవల ఒక ప్రకటన ఇచ్చింది. వినూత్నరీతిలో దరఖాస్తులు చేసి తమ తెలివి తేటలను ప్రదర్శించాలని కోరింది. దానికి అనేక మంది స్పందన చిత్రాతి చిత్రంగా ఉంది. ఒకరు ఒక ఆఫీసు భవనంపై తనకున్న అర్హతలన్నీ రాసి భవనమంత సంతకం చేసి ఉద్యోగం ఇచ్చుకోవచ్చన్నట్లు పేర్కొన్నాడు. మరొకడు కంపెనీ అధికారుల కార్ల పార్కింగ్ గ్యారేజ్‌పై నిలువెత్తు పోస్టర్లలో తన అర్హతలేమిటో ముద్రించి అంటించాడు. మరొక అమ్మడు తనపేరు, వివరాలను గోల్ఫ్ బంతులపై రాసి అధికారులు ఆడేటపుడు వారికి అందచేసింది. ఇలా దరఖాస్తులు అందచేసిన వారి విపరీత పోకడలు నవ్వులాటకు పనికి వచ్చాయి. యాభైరెండు శాతం మంది అసలు అవసరమైన ఉద్యోగాలకే పనికిరాని వారిగా తేలింది.

ఎవరిపై ఎంత ప్రభావం?

అమెరికాలో తలెత్తిన సంక్షోభానికి మహిళలే ఎక్కువ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. ముఖ్యంగా అల్పాదాయ తరగతుల వారు ప్రధానంగా ప్రభావితులయ్యారు. శ్వేతేతరులు కోల్పోయిన ఆస్తుల విలువ 164 నుంచి 213 బిలియన్ డాలర్లు ఉంటుందని ఒక అంచనా. వారిలో నల్లవారు 71నుంచి 92, లాటినోలు 75 నుంచి 98 బిలియన్ డాలర్ల వరకు పోగొట్టుకొని ఉంటారని తేల్చారు. అమెరికాలో ఇప్పటికే స్త్రీ-పురుష వేతన వ్యత్యాసాలు గణనీయంగా పెరిగాయి. ఒక పురుషుడు ఒక డాలరు సంపాదిస్తే అదే పని చేసిన మహిళకు కేవలం సగటున 77 సెంట్లు (డాలరుకు వంద సెంట్లు) మాత్రమే ఇస్తున్నారు. అదే నల్లజాతి స్త్రీలకు 62, లాటినో మహిళలకు 53 సెంట్లు మాత్రమే ఇస్తున్నారు. కనీస వేతనం, అంతకంటే తక్కువ వేతనాలు పొందే కార్మికులలో మహిళల సంఖ్య 68శాతం. తనఖా కుంభ కోణంలో ఇళ్లు కోల్పోయిన వారిలో లాటినో పురుషులు 24శాతం అయితే మహిళలు 34శాతం ఉన్నారు.

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

ఫోన్ నెం:9390044031

చక్కగా రాయాలంటే...

నేను బాగా చదువుతాను. కానీ నా చేతిరాత బాగుండడం లేదు. ఇది చాలా సమస్యగా ఉంది. నా సమస్య ఒక్కరిది కాదు. కొన్ని లక్షల మంది విద్యార్థుల సమస్య. సలహా ఇవ్వండి.

బాబుల్, పలాస.

చేతిరాత బాగోలేదని ఏ ప్రయత్నం చెయ్యకపోతే ఎప్పటికీ అలాగే ఉంటారు. వర్క్ బుక్స్ మార్కెట్లో దొరుకుతాయి. కొనుక్కుని ప్రతిరోజు అరగంటపాటు ప్రాక్టీసు చెయ్యి. రైటింగ్ మీద సెమినార్లు పెడుతున్నారు. వాటికి హాజరై ఎలా రాయాలో తెలుసుకుని ప్రాక్టీసు చేయండి. రైటింగ్‌కు సంబంధించి చాలా పుస్తకాలు వచ్చాయి. వాటిని చదవండి. మీరు ఎంత ఎక్కువగా ప్రాక్టీసు చేస్తే అంత బాగా రాయగలరు. ఆల్ ది బెస్ట్.

ఎం.ఏ ఇంగ్లీషు చదివితే ఉద్యోగాలు రావా!

నేను ప్రస్తుతం డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. ఎం.ఏ ఇంగ్లీష్ లిట్ చేయాలన్న నా ఆశయాన్ని ఇంట్లోను, స్నేహితులతోను చెప్పాను. 'ఈ రోజుల్లో ఎం.ఏ ఇంగ్లీష్ ఎవరు చేస్తున్నారు? ఉద్యోగాలు రావు, మళ్లీ

బాధపడతావు' అని నిరాశపరుస్తున్నారు. నేనేమో ఎం.ఏ ఇంగ్లీష్ చేసి ఇంగ్లీష్ లెక్చరర్ అవుదామని అనుకుంటున్నాను. నేను ప్రస్తుతం బి.ఎ. ఇంగ్లీష్ లిట్ ఓపెన్ యూనివర్శిటీ ద్వారా చేస్తున్నాను. నాకు సైన్స్ గ్రూపు ఇష్టం లేదు. దయచేసి మీరు మంచి సలహా ఇవ్వగలరు?

ప్రసాద్, ఖమ్మం.

విద్యాబోధన చేసే వృత్తికి ఎప్పటికీ డిమాండ్ తగ్గదు. ఎవరో ఏదో అన్నారని నీ ఆసక్తిని చంపేసుకుంటే దేనికి పనికి రాకుండా పోతావు. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో మంచి ర్యాంకు సంపాదిస్తే గవర్నమెంటు ఉద్యోగం వస్తుంది. ప్రైవేట్ కాలేజీల వాళ్లు మంచి సాలరీలే ఇస్తున్నారు. నీ ఆసక్తిని పెంచుకుంటూ దాని మీద దృష్టి పెట్టి మంచి నాలెడ్జిని, మార్కులు తెచ్చుకుంటే నీవు అనుకున్న విధంగా చక్కని లెక్చరర్ ఉద్యోగం వస్తుంది. నీ ప్రయత్నమే నీ లక్ష్యం వైపు తీసుకువెళుతుంది. ఆల్ ద బెస్ట్.

లావు పెరగాలంటే ఎలా?

నా వయసు 18 సంవత్సరాలు. నేను 1.60 హైటు ఉన్నాను. ఇంకా ఎత్తు పెరగాలంటే ఏం చేయాలి. ఎంత వయస్సు వరకు మనం హైటు పెరుగుతాం. లావు పెరగాలంటే ఏం చేయాలి. సన్నబడటానికి తెలిపారు కానీ అది సులభం. లావు పెరగాలంటే ఏం చేయాలి?

కుమార్ రెడ్డి, పలమనేరు.

మీరు 21 సంవత్సరాల వరకు హైటు పెరుగుతారు. మీ ఎత్తుకు తగిన లావు ఉంటే చాలు. లావు తగ్గటం చాలా కష్టం. కాబట్టి లావు గురించి ఆలోచించకుండా నీ కెరీర్ మీద దృష్టి పెట్టు. లావు అవ్వాలంటే ప్రొటీన్స్ ఎక్కువ ఉన్న ఆహారం బాగా తీసుకో. అప్పుడు లావు అవుతావు.

ఎన్నిగంటలు నిద్ర పోవాలి?

నేను ఇంటర్ ఫస్టియర్ ఎంపిసి చదువుతున్నాను. పదవ తరగతిలో నేను 323 మార్కులను సాధించాను. అయితే నేను యావరేజ్ స్టూడెంట్‌ని. ఇంటర్‌లో 458 మార్కులను టార్గెట్ చేసుకున్నాను. 458 మార్కులను తెచ్చుకోవాలని రోజుకు 5 గంటలే నిద్రపోతున్నాను. దీనివల్ల క్లాసుకు వెళ్లి పాఠాలు వినలేకపోతున్నాను. క్లాసులో నిద్ర వస్తుంది. అసలు చదువుకునే స్టూడెంట్ రోజుకు ఎన్ని గంటలు నిద్రపోవాలి. దీనికి పరిష్కారం చెప్పండి.

సంపత్, జనగాం.

ప్రతి వ్యక్తి తన జీవితం లోంచి ఎక్కువ పొందడానికే ఆశిస్తాడు. తాము వుంటున్న స్థితిగతులలో మెరుగైన జీవితాన్నే పొందాలని కాంక్షిస్తారు. కాబట్టి ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలనే ఆలోచన మంచిదే. కానీ ఆహారం, నిద్ర సరిగా లేకపోతే చదవలేరు. ఏపనీ చేయ్యలేరు. రోజుకు ఆరేడు గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి. అప్పుడు క్లాసులో నిద్ర రాదు. చక్కగా పాఠాలను వినగలుగుతావు. మార్కుల కోసం కాకుండా నాలెడ్జ్‌ను పెంచుకోడానికి చదవాలి. చదవాలనే తపన, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థం, వేగంగా చదవటం, రాయటం. ఇవే మార్కుల్ని ర్యాంకుల్ని నిర్ణయిస్తాయి. అందుకే వాటిని సమర్థవంతంగా నిర్వర్తించు. సవాళ్లను ఎదుర్కొంటూ విజయాన్ని సాధించిన సంఘటనలను సదా మననం చేసుకొంటుండాలి. ఆ అనుభవాలే మీలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి.



చూద్దామా

ఫతేపూర్ సిక్రి, ఆగ్రాకు పడమటి వైపు 42 కిలోమీటర్ల దూరంలో వుంది. అక్బర్ కాలంలో ఇక్కడొక విస్తారమైన నగరాన్ని నిర్మించారు. రాజధానిని ఆగ్రా నుంచి ఇక్కడకు తరలించి 16 సంవత్సరాలపాటు ఇక్కడినుంచే సువిశాల మొఘల్ సామ్రాజ్య పరిపాలన సాగింది. అసలు ఇక్కడ ప్రధానమైన కట్టడాలేవి? వాటిని ఎవరు ఎందుకు ఉపయోగించారు? వాటి ప్రాధాన్యత ఏంటి? వాటి శిల్పకళా కౌశలం గురించి... ప్రత్యేకతల గురించి ఈ వారం మీ కోసం...



బులంద్ దర్వాజా

ఫతేపూర్ సిక్రి

మొట్టమొదట మనకు ఎదురయ్యే కట్టడం నౌబత్‌ఖానా. ఇందులో గంటలు మోగిస్తూ సమయాన్ని తెలియజేసేవారు. చక్రవర్తి దర్బారు నిర్వహించే సమయాన్ని కూడా ఇదే పద్ధతిలో చెప్పేవారు. దీనికి కొద్ది దూరంలో టంకశాల, ధనాగారాలుండేవి. ప్రస్తుతం ఇవి కొద్దిగా శిథిలమైనాయి.

దివానీ ఆమ్

ఈ ప్రజా దర్బారు 368 అడుగుల పొడవు 181 అడుగుల వెడల్పుతో నున్న బృహన్నిర్మాణం. మహామంత్రి ప్రజల కోర్కెలను, సమస్యలను వివరిస్తే చక్రవర్తి పరిష్కరించేవాడు. ఇలా ప్రతిరోజు ఉదయం మూడు గంటలపాటు సాగేదీ దర్బారు. ఈ వేదిక కిందనున్న గదిలోనే మహారాజు విశ్రాంతి తీసుకునేవారు. దీనికెదురుగా వున్న సువిశాల భాగంలో రాజ నివాస భవనాలున్నాయి. ఇక్కడ చిన్న ఉద్యానవనం, దానికవతల పాచికల ఆటకు విశాలమైన అరుగు మీద తెల్లని, నల్లని రాళ్లతో పెద్ద పెద్ద గడులు ఏర్పాటుచేశారు. ఇక్కడ మహారాజు తన రాణితో పాచికలాడేవారు. ఈ ఆటలో పావులకు బదులు, రాణివాసపు సేవికలను ఈ గడులలో నిలబడితే, ఆట క్రమాన్ని బట్టి వారా గడులు మారుతూ ఈ ఆట ఒక సజీవ విన్యాసంగా సాగేదట.

దివాన్ ఖాస్

ఇది ప్రముఖుల సభామండపం. ఉత్తరదిశగా నాలుగువైపులా మినార్లు వుండేవి. ఒక్కోటి నాలుగు స్థంబాలమీద అమర్చారు. ఈ హాలు లోపలి కట్టడం అతి మనోహరంగా వుంటుంది. హాలు మధ్యలో అష్టభుజాకృతిలో ఒక దిమ్మ ఆరడుగుల ఎత్తుంది. అక్కడ నుంచి వంపులు తిరుగుతూ 36 బ్రాకెట్లతో అన్ని వైపులకూ చీలి, పన్నెండు అడుగుల ఎత్తున ఒక వృత్తాకారం ఏర్పడి, దానిని హాలు నాలుగు మూలలకూ కలుపుతూ దారులు గ్యాలరీ లోనికి ఉన్నాయి. ఇలా హాలు రెండతస్థులుగా ఏర్పడితే క్రింది నుంచి గాలరీలలోకి మెట్లున్నాయి. ఈ గేలరీలకు జాలీలు అమర్చి వాటిలో 9 ఆర్చీలు ఏర్పరచారు. అక్బర్ యొక్క తొమ్మిదిమంది మంత్రులు ఈ ఆర్చీలలో ఆసీనులైతే, ఈ వృత్తాకారపు వేదిక మీద ఆశీనుడైన చక్రవర్తి వారితో చర్చలు జరిపేవాడట. ఈ అమాత్యులను నవరత్నాలనేవారు. యిక్కడే అనేక మతాల వారితో మతైక విషయాలు చర్చించి, ఏ మతంలోనైనా మూల సిద్ధాంతం ఒకటేనని 'దిన్-ఇ- ఇలాహి'ను ప్రతిపాదించాడు అగ్బర్.

జోదాబాయి మందిరం

ఇది జోదాబాయి నివాసగృహం. ఈ ప్రదేశాల్లో ఉన్నవాటన్నింటికంటే ఇదే అందంగా ఉంటుంది. ఈమందిరంలో స్థంభాల మధ్య భాగంలో ఏనుగు తలను మలిచారు. అక్కడినుంచి పైకి దాని తొండంతో స్థంభాన్ని చుట్టుకుని ఉన్నట్లు, అలా స్థంభాన్ని తొండంతో



జమా మసీదు



దివాన్ ఖాస్ మధ్య స్తంభం

అనూప్ తలావ్



పంచమహల్

పైకెత్తి పట్టుకున్నట్లు ఉంటుంది.

దౌలత్‌ఖానా- ఎ-ఖాస్

దీనిలోనే అక్బర్ నివసించేవాడు. ఈ భవనాన్ని ఇతర భవనాల నుంచి వేరు చేస్తూ రాతి జాలీలను అమర్చారు. ఇక్కడినుంచి కారిడార్లు, టర్కీ సుల్తానా, మరియం, జోదాభాయి మందిరాలను పంచమహల్‌ను కలుపుతుంటాయి. ఇక్కడ పరిచారికలకూ నపుంసకులకూ మాత్రమే ప్రవేశార్హత వుండేదంటారు.

టర్కీ సుల్తానా మహల్

దీనిలోని స్థంభాలు, గోడలు, పైకప్పు అన్నీ కూడా చక్కటి శిల్పాలతో నిండి ఉంటుంది. కానీ ఇప్పుడు వాటిలో చాలా భాగం రాలిపోయి ఆనాటి చిత్రకళకు ఆనవాళ్లుగా మాత్రమే మిగిలివుంది. ఇది అగ్బర్ మొదటి భార్య జ్ఞాపకార్థం నిర్మించిన కట్టడం. వీటి గోడలకు అందమైన చిత్రకళ, రంగులు కరిగించిన బంగారంతో చిత్రించారు. మొఘల్ సామ్రాజ్యపు అవసాన దశలో దొంగలు ఈ గదులలో పెద్ద పెద్ద మంటలు పెట్టి బయట తాళాలు బిగించి అలా కరిగిన బంగారాన్ని పట్టుకుపోయారంటారు. ఈ చిత్రాల అవశేషాలు మాత్రమే నేడు మిగిలాయి.

అనూప్ తలావ్

ఇది ఆనాటి ఎయిర్ కండిషన్ రూం. అంటే వేసవిలో విశ్రాంతి మందిరంగా ఈ మందిరాన్ని ఉపయోగించేవారు. ఒక గది మధ్యలో నీటి తటాకంలా ఏర్పాటు చేశారు. దానిలో నీరు ఉండటం వల్ల అంత చల్లగా ఉంటుంది. ఇక్కడ కూర్చునే తాన్‌సేన్ కొత్త కొత్త రాగాలను పాడేవారట.

చక్రవర్తి దర్శన వేదిక

అనూప్ తలాప్ పక్క భవనం పై అంతస్థులో దక్షిణంగా పెద్ద కిటికీ వంటి ప్రదేశంలో సూర్యోదయపు వేళ చక్రవర్తి ఆశీనుడై ప్రజలకు దర్శనమిచ్చేవారు. చుట్టూ ఎటువైపు నుంచి కూడా ఎండపొడ తగలకుండా ఏర్పాటు వుంది. ఈ వేదిక మీద కూర్చుంటే చాలా చల్లగా వుంటుంది. వేసవిలో సేద తీరేందుకు ఆనాడు ఏర్పాటు చేసిన ఎయిర్ కండిషనింగ్ అనుకోవచ్చు. ఇక్కడ కూర్చునే తాన్‌సేన్ తన సంగీత ప్రపంచంలో మునిగితేలుతూ అనేక వినూత్న రాగాలకు రూపకల్పన చేశాడంటారు.

పంచమహల్

దీని పేరులో ఉన్నట్లుగానే ఇది ఐదంతస్తుల కట్టడం. అంతేకాదు ఇక్కడి అన్ని కట్టడాల్లోకెల్లా ఇదే ఎత్తైనది కూడా. దీనిలో మొదటి అంతస్థుని 84 స్థంబాలపైన, రెండవ అంతస్థుని 65 స్థంబాలపైన, మూడవ అంతస్థుని 24 స్థంభాలపైన, నాల్గవ అంతస్థుని 12 స్థంభాలపైన, ఐదవదైన చివరి అంతస్థుని 4 స్థంబాలపైన నిర్మించారు. ఇక్కడి కట్టడాలలోకెల్లా పంచమహల్ ఎత్తైనది. పై అంతస్థులో నిలడితే సుదూరంగా వున్న పరిసరాలు, నగర ప్రాకారం దూరంగా బద్రౌలి కొండలు అక్కడ నిర్మించిన ఆనకట్ట, హిరన్ మినార్ కూడా కనిపిస్తాయి. దీని మొదటి మట్టం 72 అడుగుల చదరంలో పది అడుగుల ఎత్తుంటుంది. దీనిపైన 38 అడుగుల వ్యాసంతో అష్టభుజాకారపు కట్టడం 4 అడుగుల ఎత్తుంటుంది. దీని మీద 66 అడుగుల ఎత్తున్న కట్టడం దానిపైన డోమ్ వుంటాయి. అక్బర్‌కు అభిమాన పాత్రమైన ఏనుగు చనిపోతే దానినిక్కడే ఖననం చేసి ఈ స్మారక చిహ్నాన్ని నిర్మించారు.

మరియం మహల్

పంచమహల్ నుంచి దిగి వస్తే ఇక్కడ మరియం మహల్ వుంది. దీనిని సోన్ హరమకాన్ అంటారు. అంటే బంగారు లోగిలి. ఈ మరియం అనే పేరు వల్ల అక్బరుకు క్రిస్టియన్ భార్య వుండేదని కొందరు, ఇది ఆయన రాజపుత్ర భార్యకు పెట్టుకున్న ముద్దు పేరని కొందరూ చెప్తారు. అయితే ప్రస్తుతానికి దీనిలోపలి చిత్రకళ అంతా నాశనం అయింది.

బీర్బల్ మహల్

అక్బర్ సర్వ సైన్యాధిపతి బీర్బల్ గురించి తెలియనివారుండరుకదా. ఈయన ఎప్పుడూ అక్బర్‌కు తోడుగా వుండేవాడు. తన చతురోక్తులతో హాస్యం సృజిస్తూ అక్బర్‌ను నవ్విస్తుండేవాడు. ఈ భవనం చూసినవారెవరైనా ఇది హిందువులదో లేదా జైన మందిరమో అనుకునేట్టుగా ఉంటుంది.

చిస్తీ దర్గా

ఈ నగరాన్ని నిర్మించిన షేక్ సలీం చిస్తీ సమాధే ఈ చిస్తీ దర్గా. ఈ కట్టడం గోడలపై ఖురాన్‌లోని సందేశాలను చెక్కారు. అయితే పైకి కనిపించేది అసలు సమాధి కాదు. అసలు సమాధి భూగర్భంలో నిర్మించారు. మనకు పైకి కనిపించేది దాని నమూనా మాత్రమే.

జమా మసీదు

ఈ మసీదులో ఉన్న వర్ణచిత్ర పటాలు ఎంతందంగా ఉంటాయంటే ప్రకృతి సౌందర్యమంతా ఇక్కడే ఉందా అనేట్టుగా ఉంటుంది. మక్కా మసీదుకు ప్రతిరూపమే ఈ జమా మసీదు అని చెపుతారు.

బులంద్ దర్వాజా

ప్రపంచంలోకెల్లా అతి పెద్ద దర్వాజా ఇదేనంటారు. ఇది కోట దక్షిణంలో ఉన్నగోడకు ఉంటుంది. బయటకు వచ్చి ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే ఇది ఒక మహా సామ్రాజ్యానికి రాజధానిగా వున్నపుడెలా వుండేదోనని చిత్రమైన ఊహలు మదిలో మెదులుతాయి.

చిస్తీ దర్గా



సమ్‌థింగ్ స్పెషల్

ఆ మెరుపుల వెనుక...



అందమైన రోల్డుగోల్డు నగల తయారీకి కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రసిద్ధి. మగువల అందాలకు మెరుగులు దిద్దే రోల్డుగోల్డు నగల పరిశ్రమ రెండు దశాబ్దాల క్రితమే ఇక్కడ వేళ్లూనుకుంది. నేడు మచిలీపట్నంలోని ఏ గల్లీలో చూసినా నగలు తయారుచేసే కార్ఖానాలు దర్శనమిస్తాయి. బంగారానికి, నకిలీ బంగారానికి తేడాలేకుండా ఆభరణాలు తయారు చేయడమే రోల్డుగోల్డ్ ప్రత్యేకత. ఈ పరిశ్రమపై 60 వేల మంది జీవనోపాధి పొందుతున్నారు. కుటీర పరిశ్రమగా సాగుతున్న రోల్డుగోల్డు నగల తయారీకి సంబంధించిన రా మెటీరియల్‌ను కోయంబత్తుర్, కలకత్తా వంటి నగరాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇక్కడ తయారు చేసిన వివిధ రకాల ఆభరణాలను దేశ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అసలు ఈ రోల్డుగోల్డు పరిశ్రమ అక్కడ ఎప్పుడు ఆవిర్భవించింది? ఎలా తయారు చేస్తారు? ఆ కార్మికుల పరిస్థితులేంటి? వంటి వివరాలు చూద్దాం...

పి.వి. సుబ్రమణ్యం, విజయవాడ.

వంద సంవత్సరాల క్రితం మచిలీపట్నం కేంద్రంగా సారేపల్లి సాంబయ్య రోల్డుగోల్డ్ కవరింగ్ పరిశ్రమను ప్రారంభించారు. ఆయన తరువాత ఇండియా గోల్డ్ అనే పరిశ్రమను చిలంకుర్తి లక్ష్మీనరసయ్య, చిలంకుర్తి లక్ష్మయ్య, తోట రామస్వామి రోల్డుగోల్డు పరిశ్రమలను ఏర్పాటు చేశారు.

తయారీ ఇలా...

రోల్డుగోల్డ్‌ను రాగి, వెండి, బంగారం, కాపర్, మెరుపురాళ్లతో తయారు చేస్తారు. వీటి తయారీకి ఉపయోగించే ముడి సరుకు కలకత్తా, కోయంబత్తూర్ వంటి నగరాల నుంచి దిగుమతి అవుతోంది. మొదటగా కాపర్ వైరును తీసుకొని దాన్ని మనకు కావాల్సిన ఆభరణం సైజులో కట్ చేసుకోవాలి. కట్ చేసిన వైరును డైల్స్‌పై పెట్టి మనకు కావాల్సిన ఆకారంలో అమర్చుతారు. అలా అమర్చిన దాన్ని మెమొరి పేపర్‌పై ఫైల్ చేసి వేడిచేస్తారు. అలా చేసిన ఆభరణాన్ని నైటింగ్ యాసిడ్, నికిలింగ్, పాల్సబేర్ల, లక్స్‌సోప్ తదితర రసాయనాలలో శుద్ధి చేస్తారు. అలా శుద్ధి చేసిన ఆభరణంపై జిపిఎస్ (గోల్డు పొటాషియం సైనైడ్) వంటి రసాయనంలో శుద్ధి చేస్తారు. ఈ రసాయనాన్ని బొంబాయి నుంచి దిగుమతి చేసుకుంటారు. అలా శుద్ధి చేసిన ఆభరణానికి బంగారంతో లేమినేషన్ చేస్తారు. వెంటనే అది బంగారం కంటే కాంతివంతంగా కనిపిస్తుంది. ప్రతి రోజు రూ.40 నుండి రూ.50 లక్షల విలువ చేసే రోల్డుగోల్డు నగలను ఇక్కడ ఉత్పత్తి చేస్తారు. వీటి తయారీ కోసం రాగి, బంగారం, వెండి, రంగు రాళ్లని ఎక్కువగా వినియోగిస్తారు. రెండు పక్రియలలో నగలు రూపు దిద్దుకుంటాయి. మొదటి పక్రియలో రాగి వైర్లను కరిగించి కడ్డీలుగా మలుస్తారు. అలా మలిచన కడ్డీలను తిరిగి తీగలుగానూ, బద్దలుగానూ తయారు చేస్తారు. రాగి కమ్మెలను కరెంటు యంత్రాల ద్వారా తీగలుగానూ, బద్దలుగానూ మలుస్తారు. చిన్నచిన్న పనిముట్లతో కావాల్సిన డిజైన్లలో ముడినగలను తయారుచేస్తారు. రాగిని కరిగించేటప్పుడు సత్తు(లోహం)ను ఉపయోగిస్తారు. గాలిలో పంకా లేదా మోటార్‌ను ఉపయోగించి బొగ్గును మండిస్తారు. కర్రను లేదా మహారాష్ట్ర నుండి దగుమతి చేసుకునే చిట్లం బొగ్గును ఇక్కడ వాడతారు. ఇలాంటి కర్మాగారాలు మచిలీపట్నంలో 250 వరకు ఉండవచ్చునని అంచనా. సగటున ఒక్కొక్క కర్మాగారంలో 50 కేజీలకు తగ్గకుండా బొగ్గును వాడుతున్నట్లు సమాచారం.

విదేశాలకూ ఎగుమతులు

కుటీర పరిశ్రమల్లో తయారు చేసే రోల్డుగోల్డ్‌ను దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ముఖ్యంగా అరబ్ దేశాలు, సింగపూర్, బంగ్లాదేశ్, మలేషియా, మద్రాస్ తదితర నగరాలకు ఎగుమతి చేస్తారు. ఎక్కువగా సినీ రంగంలో ఈ రోల్డుగోల్డ్ నగలను ఉపయోగిస్తారు.

తగ్గుతున్న నాణ్యత

కుటీర పరిశ్రమగా సాగుతున్న రోల్డుగోల్డ్ తయారీలోకి పెద్దపెద్ద కంపెనీలు, డబ్బున్న మారాజులు ప్రవేశించారు. పరిశ్రమ ప్రారంభంలో ఒక ఆభరణంలో ఒక నవర్సు బంగారం ఉండే విధంగా ఆభరణాలు తయారు చేసేవారు. నేడు లేమినేషన్ ద్వారా చాలా తక్కువ బంగారంతో తయారు చేస్తున్నారు. దీంతో ఆభరణాలలో నాణ్యత తగ్గిపోయి ఎక్కువకాలం ఉండటంలేదు.

అదే ఆధారం

రోల్డుగోల్డ్ పరిశ్రమపై ఆధారపడి 60 వేల మంది జీవనం సాగిస్తున్నారు. వీరు తమ ఇళ్లలోనే ఈ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. వీరికి కావాల్సిన ముడి సరుకును పెద్ద కంపెనీల వద్ద నుంచి తెచ్చుకుని తమ ఇళ్లలో తయారు చేసి వారికే అమ్ముతున్నారు. మచిలీపట్నంతోపాటు పరిసర ప్రాంతాలైన చిన్నాపురం, పోలవరం,మల్లవోలు, రాయవరం, పెడన, పోతేపల్లి, చినకరగ్రహారం, పెదకరగ్రహారం, తదితర గ్రామాల్లో ఇప్పటికీ ఈ పరిశ్రమపైనే ఆధారపడి అనేక కుటుంబాలు జీవిస్తున్నాయి.

తగ్గుతున్న పసిడి వాడకం

గతంలో ఉప్పునీటి బ్యాటరీ ద్వారా కరెంటు తయారు చేసి మూకిడి గిల్టు వేసేవారు. రాగి వస్తువుపై బంగారు రేకును అద్దేవారు. వీటి వినియోగం వలన కాలుష్యం నామమాత్రంగా ఉండేది. నేడు శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందటంతో రసాయనాల వినియోగం ఎక్కువైంది. రాగితో తయారు చేసిన ముడి నగలపై బంగారాన్ని కోటింగ్ వేసే పద్ధతి ప్రారంభమైంది. ఇది మరింత అభివృద్ధి చెంది బంగారంతో పని లేకుండా గోల్డు కలర్‌తో లామినేషన్ వేసే పక్రియ ప్రస్తుతం ఊపందుకుంది. ఈ పక్రియలో అధికంగా వినియోగిస్తున్న రసాయనాలతో పట్టణ ప్రజలు కాలుష్యం కోరల్లో చిక్కుకుని అనారోగ్యాలకు గురౌతున్నారు. రోల్డుగోల్డు నగల పరిశ్రమలన్నీ ప్రజల నివాసాల మధ్యనే నెలకొల్పటంతో దీని ప్రభావం ప్రజలపై నేరుగా పడుతోంది.

పొగతో కాలుష్యం

మచిలీపట్టణాన్ని కేంద్రంగా చేసుకుని సుమారు 500 కంపెనీలు రోల్డుగోల్డు నగలను ఉత్పత్తి చేస్తున్నాయి. రాగిని కరిగించేటప్పుడు సత్తు (లోహం)ను ఉపయోగిస్తారు. గాలిలో పంకా లేదా మోటార్‌ను ఉపయోగించి బొగ్గును మండిస్తారు. కర్ర, మహారాష్ట్ర నుండి దిగుమతి చేసుకునే చిట్లం బొగ్గును ఇక్కడ వాడతారు. ఇలాంటి కర్మాగారాలు మచిలీపట్నంలో 250 వరకు ఉండవచ్చునని అంచనా. సగటున ఒక్కొక్క కర్మాగారంలో 50 కేజీలకు తగ్గకుండా బొగ్గును వాడుతున్నట్లు సమాచారం. ఈ లెక్కన రోజుకు 12,500 కిలోల బొగ్గును మండిస్తున్నట్లు తెలుస్తోంది. దీని ద్వారా వెలువడే పొగ చుట్టుపక్కల ప్రజలను తీవ్ర అస్వస్థతకు గురిచేస్తోంది.

ప్రమాదకరమైన వ్యర్థాలు

రాగి కమ్మెలను కరెంటు యంత్రాల ద్వారా తీగలుగానూ, బద్దలుగానూ మలుస్తారు. చిన్నచిన్న పనిముట్లతో కావాల్సిన డిజైన్లలో ముడినగలను తయారుచేస్తారు. అలా తయారైన నగలను సల్ఫర్‌లో నానబెట్టి, యాసిడ్‌తో శుభ్రం చేస్తారు. ఫినిషింగ్ కోసం వీటిని బ్యారల్‌లో కలియబెడతారు. ఈ సమయంలో రసాయనాలతో కూడిన సబ్బులను ఎక్కువగా వినియోగించటం వలన ప్రమాదకరమైన వ్యర్థాలు వెలువడతాయి. వ్యర్థాలతో కూడిన నీటిని డ్రైన్లలోకి వదులుతారు. ఇలాంటి బ్యారల్‌సెక్షన్లు మచిలీపట్నంలో 300 వరకు ఉన్నాయి. ఒక్కొక్క సెక్షన్ నుండి సగటున 200లీటర్ల వ్యర్థనీరు డ్రైన్‌లో కలుస్తోంది. ఈ లెక్కన 60వేల లీటర్ల కాలుష్యంతో కూడుకున్న నీరు ప్రతిరోజు డ్రైన్లలోకి వదులుతున్నారు. వీటిని సేవిస్తున్న అనేక మూగజీవాలు తరచూ మృత్యువాతపడుతున్నాయి. అలాగే వీటి నుండి వెలువడే గాలి పీలుస్తున్న ప్రజలు శ్వాసకోశవ్యాధుల బారిన పడుతున్నారు. డ్రైన్ల కిందనుండి పోతున్న మంచినీటి పైప్‌లైన్లు అక్కడక్కడా దెబ్బతినటం వలన ఈ వ్యర్థాలతో కూడుకున్న నీరు అందులో కలవటం అవి తాగిన ప్రజలు రోగాలు కొనితెచ్చుకోవటం సర్వసాధారణంగా మారింది.

గిల్టు సమయంలో విషవాయువులు

నగలకు గిల్టు వేసే సమయంలో కూడా అనేక విషవాయువులు వెలువడతాయి. ఈ పక్రియలో బంగారం, ద్రావకం, లక్క, అరపూస, సైనేడ్ మిశ్రమాలను వినియోగిస్తారు. కొత్తగా నికిల్ కోటింగ్ విధానాలు అమలులోకి వచ్చింది. ఈ విధానం ద్వారా మరిన్ని ప్రమాదకరమైన రసాయనాలను పరిశ్రమలో వినియోగిస్తున్నారు. కర్మాగారాలు, గోల్డు కోటింగ్ పరిశ్రమల ద్వారా వెలువడే కాలుష్యాలు వెయ్యి మీటర్ల దూరం వరకు ప్రభావం చూపిస్తాయి. పట్టణం నలుమూలలలోనూ ఈ పరిశ్రమ వ్యాపించి ఉండటంతో మూడొంతుల మంది కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నట్లు పేర్కొంటున్నారు.

శ్రమ దోపిడి

రోల్డుగోల్డుకు సంబంధించిన ముడినగలను తయారు చేస్తూ జీవనం కొనసాగించే వారి సంఖ్య మచిలీపట్నంలో వేలల్లోనే ఉంది. కొద్దిపాటి పెట్టుబడితో రాగి తీగలు, రేకులను కొనుగోలు చేసి వాటితో ముడి నగలను తయారు చేస్తారు. చెవి దిద్దులు, జూకాలు, రింగులు, గాజులు, చెయిన్‌లతో పాటు పలు రకాల నగలు వీరి చేతుల్లో రూపుదిద్దుకుంటాయి. ఇలా తయారు చేసిన ముడినగలను కంపెనీ యజమానులకు విక్రయించి సొమ్ముచేసుకుంటారు. ఐటమ్స్‌ను బట్టి కంపెనీ యజమానులు వీరికి ధర చెల్లిస్తారు. ఈ రకంగా సేకరించిన ముడి నగలకు కంపెనీలు మెరుగులు దిద్ది, గిల్టువేసి రోల్డుగోల్డ్ నగలుగా మలుస్తాయి. తరువాత వాటికి ఆకర్షణీయమైన ప్యాకింగ్ చేసి బ్రాండ్ పేర్లతో మార్కెట్‌లో ప్రవేశపెడతాయి. కంపెనీ యజమానులు ముడి నగల తయారీదార్లకు చెల్లిస్తున్న ధరకు, మార్కెట్‌లో విక్రయించే రోల్డుగోల్డ్ నగల ధరకు ఎన్నోరెట్ల వ్యత్యాసం ఉంటుంది. రోజుకు ఒక కుటుంబం 1000 నుండి 1500 జతల ముడి రింగులను తయారు చేస్తుంది. ఒక జత రింగులు తయారు చేయటానికి సుమారు 60 నుండి80 పైసలు మెటీరియల్ కోసం వెచ్చిస్తారు. ఇలా

తయారు చేసిన రింగులకు కంపెనీ యజమానులు 80 నండి 100 పైసలు చొప్పున చెల్లిస్తారు. అంటే ఒక్కో జతపై సగటున 10 నుండి 15 పైసలు రాబడి వస్తోంది. దీనిని బట్టి రోజుకు మెటీరియల్ ఖర్చుపోను 150 రూపాయల ఆదాయం సమకూరుతోంది. ఉదయం నుండి రాత్రి వరకు ఇంట్లో ఉండే నలుగురు కుటుంబ సభ్యులు కష్టపడి పనిచేస్తే వారికి వచ్చే ఆదాయం 150 రూపాయలు. మనిషికి 40 రూపాయలలోపే కూలి గిట్టుబాటు అవుతోంది. గిల్టువేసిన జత రింగులను కంపెనీ యజమానులు రూ 12 నుండి 30 రూపాయలకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అంటే సగటున ఒక్కొక్క జతపై 15 రూపాయల ఆదాయాన్ని వీరు పొందగలుగుతున్నారు. అదేవిధంగా చెవి జుంకాలకు మూడు నుండి పది రూపాయలు తయారీదారునికి చెల్లిస్తూ 50 నుండి 100 రూపాయలకు అమ్ముకుంటున్నారు. నాలుగు జతల గాజుల తయారీకి 15 నుండి 30 రూపాయలు చెల్లిస్తూ 60 నుండి 120 రూపాయలు, చైన్లు, నాంతాడులకు 20 నుండి 30చెల్లిస్తూ మార్కెట్‌లో 100 నుండి 300రూపాయలకు విక్రయించికుంటున్నారు. ముడినగలకు మెరుగులుదిద్ది గిల్టు వేయటానికి పెద్దగా ఖర్చుకాదని తయారీదారులు పేర్కొంటున్నారు. పెద్దఎత్తున మార్జిన్ మిగులుతున్నా అదనపు ధర చెల్లించటానికి కంపెనీ యజమానులు అంగీకరించటం లేదని వాపోతున్నారు. ధర పెంచమని అడిగితే కొనటానికి నిరాకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. చేసేది లేక వారి చెల్లించే అరాకొరా ధరలకే ముడినగలను విక్రయించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టం తమదైనా ఫలితాన్ని వారే అనుభవిస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రతి నగపైనా అనేక రెట్లు లబ్దిపొందుతూ కోట్లకు పడగలెత్తుతున్నారని గుర్తుచేస్తున్నారు. సుమారు నాలుగు వేల మంది బాలకార్మికులు ఇందులో మగ్గిపోతున్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది బాలికలే. బాలకార్మికులను ఎక్కువగా గిల్టుసెక్షన్‌లో పనిచేయిస్తున్నారు. వీటిలో వినియోగిస్తున్న రసాయనాల వలన వీరు తరచూ అనారోగ్యాలకు గురౌతున్నారు.



కవిత్వమ్

ఆకాంక్ష

- తంగిరాల చక్రవర్తి

కోటి ఆశయ ఆలోచనల అనుభూతుల ఆనందహేలలతో
కొత్త సంవత్సరాన్ని స్వాగతిద్దాం! రానేస్తం - రానేస్తం...
నీ కొరకు .... నా కొరకు... మన కొరకు...
వాంఛా, కాంక్షల తోరణాలు కట్టి...
నవ వసంత వత్సరాన్ని స్వాగతిద్దాం.. రా నేస్తం... రా నేస్తం...
ప్రకృతిని ధ్వంసం చేసే విధ్వంస రచన గావించే రాజకీయ రాక్షస క్రీడే రామాయణంగా సాగించే భారతంలో
నాగరికతా ముసుగులో నాగరికతనే పాతరేసే పాలకులపై
గర్జనలు... ఘర్షణలు... అనివార్యం.. అంటూ!
కొత్త సంవత్సరాన్ని స్వాగతిద్దాం... రానేస్తం.... రా నేస్తం....
అనుబంధ సుగంధాలన్నీ ఆర్థిక మయ్యేవేళ....
రాట్నం వడికిన చేతి గుర్తు నాటి నేతల
వారసులు.... నేడు ప్రపంచీకరణ రాగం పాడుతుంటే!
నీటికై... నేలకై.. న్యాయంకై... నిలబడే సామాన్యులకు
పోరే శ్వాసగా... ధ్యాసగా.. మార్చిన మువ్వన్నెల జెండా ఏలికలపై
మార్పు ... తీర్పుల తరుణంలో .... నువ్వు - నేను... మనమౌదాం..
పోరుచేద్దాం..రా నేస్తం... రా నేస్తం...
మౌనంతో మారని 'మాయా'లోకంలో...అలజడి...అనివార్యం...
శోకాన్ని శాపంగా.. కర్మను ...ఖర్మగా .. కోపాన్ని పాపంగా
భావించేంత కాలం అదృశ్య శత్రువు మనని దోస్తూనే ఉంటాడు -
నేస్తం!
ఇలలో... కలలో... మార్పు కోరే సమాజంకై
స్వప్నాల్ని ... సత్యం చేసే శుభ సంకేతం తెచ్చే
కొత్త వత్సరానికి! వేల...వేల.... స్వాగతగీతికలతో
స్వాగతిద్దాం! రా నేస్తం! స్వాగతిద్దాం! రా నేస్తం!

సమస్య

ఖమ్రుద్దీన్

శైశవం
పాలు లేక
పాల సీసాలేక
పాలిపోతోంది!
బాల్యం
చదువు లేక
సంధ్య లేక
చట్టుబండలవుతోంది!
కౌమారం
ఆటలు లేక
పాటలు లేక
పాట్లు పడుతోంది!
యవ్వనం
ఉద్యోగం లేక
ఉపాధి లేక
ఊగిసలాడుతోంది!
వార్ధక్యం
ఆత్మీయత లేక
ఆదరణ లేక
అల్లల్లాడుతోంది!

గాయం కా(ఖా)యమౌతున్న వేళ

- పోతగాని

[illegible]
[illegible]
మానవత్వాన్ని గుర్తెరిగిందెప్పుడు
మారణహోమమే మతమైన మృగానికి
మరణదండన అమలయ్యిందెప్పుడు
చిందిన లేళ్ల నెత్తుటితో దాహం తీరక
'ఉగ్ర'మృగం విలయతాండవం చేస్తూనే ఉంది
అరాచకానికి అశువులు బాసిన
అభాగ్యుల పార్థివ శరీరాలపై
సందర్భానికోసారి ఆవేశాన్ని పులుముకున్న సందేశం
వాడిన పూలను రాల్చే సంతాప సంకేతమౌతూనే ఉంది
లోచూపు లోపించిన ఆదేశం
నిఘా కంటిని నిద్రపుచ్చి నిర్జించే నైజానికి ఊతమిచ్చి
బలిదానం చేసిన వీరుల త్యాగాలకు వెలకడుతూనే ఉంది
పొరుగు పొదలో పొంచివున్న శత్రువు
గమ్యం తెలియని నడకల మూర్ఖత్వానికి ఆజ్యం పోసి
కవ్వింపు డెక్కల్ని నేలకు రాస్తూనే ఉంది
తెల్లని పావురాల మధ్య కాట్ల కుక్కై దూకి
నేరం నాది కాదు ఆకలిదంటూ అసమర్థతను ఆకుల్లోపెట్టి
సానుభూతి మూటల కోసం
మాటల్ని ఏరుకుంటుంటే
ప్రజల ప్రాణాలను పరిహారంగా
బలిపెడుతున్న మౌనముద్రలు
మీనమేషాల గణింపులో లీనమౌతూనేవున్నై
చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం
అలవాటైన మెదళ్లు
ఆనవాయితీగా సంయమన జపాన్ని పఠిస్తూనే వున్నై
చేతివేళ్ల కొసల్ని దాటని చర్యల్ని చూచి
శత్రువును శత్రువుతోనే పరిమార్చాలనే కుయుక్తిని
ఒంట బట్టించుకున్న డాలర్ దేగల నోట
ఉసిగొల్పే ఉపన్యాసాలు ఊపందుకుంటూనే వున్నై
ఇకనైనా కబళించే కల్మషాన్ని కడిగెయ్యకపోతే
గాయం కాయాన్నే మింగేస్తుంది
సవరింపుకు లోనుకాని నియమాలకు
స్వాతంత్ర్యం బలౌతుంది.



వెన్నెముక గోడు

- సోమేపల్లి వెంకట సుబ్బయ్య



కాడీ జోడెద్దులూ
నాగలీ గొర్రూ
జడ్డిగం
ఎరువులూ క్రిమిసంహారకాలు
చేనూ మంచె వడిసెలా
కోతలూ నూర్పిళ్ళూ-
రైతు నిఘంటువులో
అన్నీ వున్నాయి...
పేగు నింపే
గిట్టుబాటు ధర తప్ప...!?

కొత్త పుస్తకాలు

విజయవాడ సమగ్ర దర్శిని



పేజీలు : 388,
వెల : 120/-
ప్రతులకు : విశాలాంధ్ర ప్రచురణాలయం అబిడ్స్, హైదరాబాద్.
మరియు అన్ని విశాలాంధ్ర బుక్ హౌస్‌లు

విజయవాడ నగరం గురించి సమగ్రంగా తెలిపే ప్రయత్నంగా ఈ 'విజయవాడ సమగ్ర దర్శిని' 2008ని పేర్కొనవచ్చు. విజయవాడ 1981లో కార్పొరేషన్ అయింది. మిత్రపక్షాల సహకారంతో సి.పి.ఐ, సి.పి.ఎం, లోక్‌దళ్, జనతా పార్టీ కలిసి 1986 దాకా పరిపాలన చేశాయి. ఆ కార్పొరేషన్ ప్రథమ మేయర్ టి. వెంకటేశ్వరరావు ఈ గ్రంథాన్ని ప్రచురించారు. 1938లో కమ్యూనిస్ట్ పార్టీ సభ్యత్వం పొంది, విశాలాంధ్ర విజ్ఞాన సమితికి జనరల్‌గా మేనేజర్‌గా పని చేశారు. 2011 నాటికి విజయవాడ జనాభా 12 లక్షలకు చేరుకొనే దశలో వుంది. విజయవాడ నగరం పుట్టుక-చారిత్రక ప్రాధాన్యత, మన పార్లమెంట్ సభ్యులు, పురపాలక సంఘం అవతరణ, కళా- సాహితీ - సాంస్కృతిక రంగాల విస్తృతి, మొదలైన అంశాలను ఈ గ్రంథంలో ఫొటోలతో సహా ప్రచురించారు. కానీ పాఠకునికి అసమగ్రంగానే అనిపిస్తుంది. ఉదాహరణకు 295వ పేజీలో రేషన్ కార్డుల అంశం ఇచ్చారు. ఏ సర్కిల్ కార్యాలయం ఎక్కడ ఉంది? దాని చిరునామా, ఫోన్ నెంబర్లు ఏంటో ఇవ్వలేదు. తెల్లకార్డు / లేదా గులాబీ కార్డు పొందాలంటే అప్లికేషన్ - పొందుపరచాల్సిన అంశాలు ... ఎవరి సహాయం తీసుకోవాలి.... ఇలాంటి ముఖ్యమైన - ప్రధానమైన అంశం గురించి, 1వపేజీ సాధారణ న్యూస్ ఇస్తే పోలా? సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గురించి పేజీ 307 లో చక్కగా రాశారు. చిరునామా.. ఫోన్ నెంబర్... ఫీజు... వివరాలు... సంప్రదించాల్సిన వారి పేర్లు... ఇచ్చారు. చాలా విలువైన కృషిగా పేర్కొనాలి. సాహిత్యకారులు, రంగస్థల కళాకారులు, విప్లవకారుల చరిత్రలను...పైపైన ఏదో మొక్కుబడిగా (ఎవరో రాసిన వ్యాసాల ద్వారా) ప్రచురించినట్లు కనిపిస్తుంది. సమగ్రత లోపించింది. విజయవాడ విమానాశ్రయంగా పేర్కొనే గన్నవరం విజయవాడకు సమీపప్రాంతం... ఆ నియోజకవర్గానికి 1983 దాకా ప్రాతినిధ్యం వహించిన వారు పార్లమెంటులో ప్రథమ ప్రతిపక్ష నేత, ప్రజాశక్తి, విశాలాంధ్ర దిన పత్రికల్లో ప్రధాన పాత్రధారి- స్థాపకులు అయిన పుచ్చలపల్లి సుందరయ్యగారు విజయవాడ కేంద్రం స్థానంగా రాష్ట్రకార్యదర్శిగా పనిచేశారు. ఉమ్మడి పార్టీలో సుందరయ్య, సనకాబుచ్చు కోటయ్య, చండ్ర రాజేశ్వరరావు లాంటి వారు విజయవాడలో నడిపిన అభ్యుదయ విప్లవ వారసత్వ పోరాటాలు... జనసంఘ్ ముసుగులో నాటి సీతారామ సమాజం వారి ఆగడాలపై కమ్యూనిస్టుల చైతన్య పోరాటాలు... బందరు కాల్వ పూడికలు - తవ్వకాలు జరిపిన నాటి కమ్యూనిస్టుల కృషి.. పౌర హక్కుల ఉద్యమాలు, ఆర్‌టిసీ ధరలపై పోరాటంలో పోలీసు కాల్పుల్లో కమ్యూనిస్టు కార్యకర్తల మృతి... రైతు - కూలీ-సంఘాల మహాసభలు... కమ్యూనిస్ట్ పార్టీ మహాసభలు... లాంటి అంశాలు ప్రచురించకపోవడం నిరుత్సాహ పరిచింది. అలాగే విద్యార్థి ఉద్యమాలు.. వామపక్ష ప్రజా సంఘాల పోరాలు... ట్రేడ్ యూనియన్లు, సంఘటిత పోరాటాలు.. మరింత విపులంగా రాస్తే యువతకు స్ఫూర్తిగా ఉండేది.. 1-4-1888 నుండి 2008 వరకు గల సమగ్రమైన ఎన్నో అంశాలను రేఖామాత్రంగా చూపిన ఈ గ్రంథం ఓ విశిష్టమైన - విలక్షణమైన మంచి ప్రయత్నం. అధ్యయనశీలులకు చక్కటి కరదీపిక.

తంగిరాల చక్రవర్తి

ప్రజాకవి వంగపండు అప్పల స్వామి
జీవితం - సాహిత్యం
వెల : **200/-**, పేజీలు **:266,**
ప్రతులకు :
ఉత్తరాంధ్ర బుక్ డిస్ట్రిబ్యూటర్స్
నేషనల్ హైస్కూల్ ప్రాంగణం, 6-75,
ప్రశాంతి నగర్, పులగాలిపాలెం రోడ్,
పెందుర్తి- 531173,
71 డివిజన్,- గ్రేటర్ విశాఖ.





తెలంగాణా సాహిత్యం
తెలుగు సాహితీ మూర్తులు
డి. రామలింగం
సంపాదకుడు: డా॥ దేవరాజు మహరాజు
వెల : **50/-**, పేజీలు **:96,**
ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, విజ్ఞాన భవన్,బ్యాంకు స్ట్రీట్,
హైద్రాబాద్.



స్వీకారం

ఖండాంతరాల మీదుగా...
నిఖిలేశ్వర్
వెల : **50/-,**
పేజీలు :102,
ప్రతులకు : నిఖిలేశ్వర్
2-2-647/185/1/ఎ
శారదా నగర్, బాగ్ అంబర్ పేట,
హైద్రాబాద్.

వర విక్రయము(నాటకం)
కాళ్ళకూరి నారాయణరావు
వెల : **25/-**, పేజీలు **: 80,**
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్
అబిడ్స్ మరియు సుల్తాన్ బజార్,
హైద్రాబాద్.
మరియు
అన్ని విశాలాంధ్ర బుక్ హౌస్‌లు.



అంతా శ్వేతమయం

ఏంటిది? మనం ఎక్కడున్నాం. ఇక్కడ ఏ ప్రాణిని చూసినా శ్వేతవర్ణంలో మెరిసిపోతోందేంటి? పొరపాటున మనంగానీ ఏదైనా ప్రత్యేక ప్రపంచంలోకి వచ్చేశామా! అనుకుంటే మాత్రం పొరపాటే... ఏ మహానుభావుడోగానీ... ఎంతో శ్రమకోర్చి ... సమయాన్ని వెచ్చించి అలాంటి వాటన్నిటినీ ఫొటోలు తీసి నెట్‌లో పెట్టేశాడు. వాటిని అలా కన్నార్పకుండా చూడాలనిపిస్తోందికదూ. అదేనండీ శ్వేత వర్ణం చేసే మాయ.



కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్

కలంస్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్.

పేరు: తిప్పారం సువర్ణ
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: డాక్టర్ కావటం.
హాబీలు: పాటలు పాడటం, చదవటం.
చిరునామా: తిప్పారం సువర్ణ డాటరాఫ్ : యాదన్ రావు
ఆరెపల్లి, మిరుదొడ్డి , మెదక్.

పేరు: కె. పృథ్విరాజ్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: పోలీస్ ఆఫీసర్ కావటం.
హాబీలు: పుస్తకాలు చదవటం.
చిరునామా: కె. పృథ్విరాజ్
సన్నాఫ్ : కె. ఎల్లయ్య,
మిరుదొడ్డి (గ్రా), మిరుదొడ్డి (మం), మెదక్.



పేరు: డి.వెంకటేష్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: డాక్టర్ కావడం.
హాబీలు: చదవటం, చిత్రలేఖనం
చిరునామా: డి.వెంకటేష్ సన్నాఫ్ : సత్తయ్య
మిరుదొడ్డి (గామం), మెదక్.

పేరు: నేరెండ్ల రజిత
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: ఇంజనీర్ కావటం
హాబీలు: డ్రాయింగ్ వేయడం
చిరునామా: నేరెండ్ల రజిత
డాటరాఫ్ : ఎన్. బాల్‌లింగం
మిరుదొడ్డి (గ్రా), మిరుదొడ్డి (మం), మెదక్.

పేరు: డి. అశ్విని
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం,
లక్ష్యం : టీచర్ కావడం.
హాబీలు: పుస్తకాలు చదవటం, టీవీ చూడటం.
చిరునామా: డి. అశ్విని
డాటరాఫ్ : శ్రీనివాస్
ఆరెపల్లి (గ్రామం),
మిరుదొడ్డి (మ), మెదక్.

పేరు: జి. యాదగిరి
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం,
లక్ష్యం: ఇంజనీర్ కావడం.
హాబీలు: క్రికెట్ ఆడడం, చదవడం.
చిరునామా: జి. యాదగిరి
సన్నాఫ్ : జి. భూమయ్య
మిరుదొడ్డి (గ్రా),
మిరుదొడ్డి (మం),
మెదక్.

పేరు: ఎం.శ్రీకాంత్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం,
లక్ష్యం : డాక్టర్ కావడం.
హాబీలు: క్రికెట్ ఆడటం.
చిరునామా: ఎం.శ్రీకాంత్
సన్నాఫ్ : ఎం. నర్సయ్య
మిరుదొడ్డి(గ్రా), మిరుదొడ్డి (మండలం),
మెదక్.